



ESTD: 1999
www.voodayam.com

# వుదయం






ఆదిలాబాద్ | 18-03-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 304 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on


# వాగ్యుద్ధకాండ

## శాసన సభలో పాలక, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ.. రచ్చ
- బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య పేలిన మాటల తూటాలు
- ప్రజాప్రతినిధులందరూ డ్రగ్ టెస్టులు చేసుకోవాలి : టీపీసీసీ చీఫ్
- రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల విడుదలకు బీఆర్ఎస్ పట్టు
- అసెంబ్లీ సెక్రటరీకి ప్రతిపక్షం వాయిదా తీర్మానం
- కాంగ్రెస్ పాలనలోఅన్ని అంశాల్లో అవినీతి జరుగుతోందన్న కేటీఆర్
- మహిళా సంఘాలకు రుణాలపై సంచలన వ్యాఖ్యలు
- రూ. 57వేల కోట్ల రుణాలిచ్చినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- ఆరు గ్యారంటీల అమలుపై కేటీఆర్, మంత్రి కోమటిరెడ్డి మాటల తూటాలు
- ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు భవిష్యత్తుపై కేటీఆర్ అనుమానం
- ఫార్మాసిటి భూములు ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ పేర్లతో మళ్లింపు కుట్ర
- గ్లోబల్ సమ్మిట్లలో ప్రకటించిన పెట్టుబడులు, ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై స్పీకర్ తీర్పుపై కేటీఆర్ అసహనం
- నిరంకుశత్వానికి బీఆర్ఎస్ నేతలే బ్రాండ్ అంబాసిడర్ల అన్న పొంగులేటి
- హ్యామ్ పేరిట రూ. 18వేల కోట్ల స్కాం జరిగిందన్న హరీశ్ రావు
- అసలు టెండర్లే పిలవనప్పుడు అవినీతి ఆస్కారం ఎక్కడిది..? మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రాజీనామా సవాళ్లతో దద్దరిల్లాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మంగళవారం శాసనసభలో పలు అంశాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వ తీరును ఎండగట్టే ప్రయత్నం చేశారు. దీనికి అధికార పార్టీ సభ్యులు ప్రశ్నలు సంధించిన కేటీఆర్ కు గట్టి కౌంటర్ ఇచ్చారు. సభ తర్వాత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఇరు పార్టీల సభ్యులు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో జరిగిన వాగ్వా దం, ఆరోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలపై ప్రజలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. మహిళా సంఘాల రుణాల విషయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంచలన సవాల్ విసిరారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు తమ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.57 వేల కోట్ల రుణాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. అయితే, ఆ లెక్కలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఒకవేళ మహిళలకు రూ.57 వేల కోట్ల రుణాలు ఇచ్చినట్లు ప్రభుత్వం దగ్గర ఉన్న ఆర్డర్ కాపీని ఇప్పుడే సభలో చూపిస్తే.. తాను తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. ఒకవేళ అటువంటి ఆర్డర్ కాపీ లేకపోతే.. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు భట్టి విక్రమార్క తన డిప్యూటీ సీఎం పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తారా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సవాల్‌తో సభలో ఒక్కసారిగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గణాంకాల విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ తనదైన స్టైల్లో ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య మాటల సంవాదం చోటుచేసుకుంది. హామీలు అమలు చేయనందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలా అని కేటీఆర్ ప్రశ్నించారు.

## డ్రగ్స్ టెస్టులకు సిద్ధమా? : పిసిసి చీఫ్

**హైదరాబాద్, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో బిస్కెట్‌లు, చాక్లెట్లలా గంజాయి, కొకైన్ దొరుకుతోందని ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపానికి కారణం పదేళ్లు తెలంగాణను పరిపాలించిన బీఆర్ఎసే అన్నారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారం చేశారని ఇంతకన్న సిగ్గుచేటు ఉందా అని నిలదీశారు. మంగళవారం శాసనమండలిలో మాట్లాడిన ఆయన... డ్రగ్ టెస్టుకు సభానాయకుడు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం అని ప్రకటించారు. మరి ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ , బీఆర్ఎస్ యువనాయకుడు కేటీఆర్ కూడా ముందుకు రావాలని చాలెంజ్ విసిరారు. టెస్టులకు బీఆర్ఎస్ అంగీకరిస్తే రేపే ముహూర్తం అని మీరు ముందుకు వస్తే తాను సీఎంను ఒప్పిస్తానన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్ టెస్టులు చేసుకుని ఈ సమాజానికి ఓ మంచి సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎవరెవరికి బీ-ఫామ్‌లు ఇచ్చిందో వారందరిని డ్రగ్ టెస్టుకు తీసుకువస్తామని అలాగే బీఆర్ఎస్ కూడా పార్టీ బి-ఫామ్స్ ఎవరెవరికి ఇచ్చిందో వారందరిని టెస్టులకు తీసుకురావాలన్నారు. ఫామ్ హౌస్‌లో పట్టుబడింది మీ నాయకుడు కాదా? అలాంటి వారికి వత్తాసు పలకవద్దని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఈ కేసులో ఎంత పెద్దవాళ్లున్నా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పదేళ్లలో డ్రగ్స్ వ్యాపారం చేస్తూ తెలంగాణను సిగ్గుతో తలవంచుకునే పరిస్థితికి బీఆర్ఎస్ తీసుకువచ్చిందని అన్నారు. డ్రగ్స్ మాటెత్తగానే మీ నాయకుడి పేరు బయటకు ఎందుకు వస్తోంది? ఇవాళ సామాన్యులు తమ పిల్లలు ఈ మాదక ద్రవ్యాల నుంచి కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పదేళ్లలో విచ్చలవిడిగా ఈ రాష్ట్రంలో గంజాయి, కొకైన్ సరఫరా అయిందని ఇది తాను ఆన్ రికార్డుగా చెబుతున్నానన్నారు. మీ మాజీ శాసనసభ్యులు డ్రగ్ తీసుకుని పట్టుబడితే ఇప్పటి వరకు ఆయనపై బీఆర్ఎస్ పార్టీ ఏం చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఇలా డ్రగ్స్ తీసుకుంటే సమాజానికి ఏం సందేశం ఇస్తున్నట్లు అని నిలదీశారు. మద్దుపదార్థాలతో అంధకారం చేసిన ఈ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ టీమ్ ఏర్పాటు చేసి పరిస్థితిని దారికి తెస్తున్నారన్నారు. గతంలో టెస్టులకు రాకుండా భయపడ్డది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు.




## ఇరాన్ భద్రతా అధికారి అలీ లారీ జానీ హతం?


- అతడిని లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటన
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు
- ఇరాన్ పై దాడుల్లో 300 మంది బసీజ్ దళ సభ్యులు మృతి
- ఇజ్రాయెల్, అమెరికా సైనిక స్థావరాలకు గురిపెట్టి ఇరాన్ క్షిపణులు, డ్రోణుల సరికొత్త దాడులు

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి

**వుదయం డెస్క్, మార్చి 17 :** ఇరాన్ అగ్ర భద్రతా అధికారి అలీ లారీజానీని లక్ష్యంగా చేసుకొని, సోమవారం రాత్రి దాడి చేసి, హతమార్చినట్లు ఇజ్రాయెలీ మీడియా పేర్కొంది. టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదిక ప్రకారం, ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి కార్యదర్శిగా ఉన్న లారీజానీని లక్ష్యంగా చేసుకుని దాడి చేశారు. ఇంతవరకూ, ఇరాన్ ఆ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు, ఖండించలేదు.

**లారీజానీ పరిస్థితిపై అనిశ్చితి**

ఈ దాడి అనంతరం లారీజానీ పరిస్థితి గురించి స్వతంత్ర ధ్రువీకరణ లేదు. ఇజ్రాయెలీ మీడియా చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఇరాన్ అధికారులు ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు. స్పష్టత లేకపోవడం అన్నది ఈ ఘటన చుట్టూ ఊహాగానాలకు ఊతమిచ్చింది. ఇలా ఉండగా, లారిజానీకి ఆపాదించిన ప్రకటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ నివేదికల నడుమ, ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ, లారిజానికి ఆపాదిస్తూ ఒక ప్రకటనను విడుదల చేసింది; అందులో ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను విమర్శించారు. 47 సంవత్సరాల క్రితం, ఇరాన్ ఇస్లామిక్ విప్లవంలో ప్రజలు విజయం సాధించడానికి ముందు రోజు, వీధుల్లో నినాదాలు చేస్తున్న భారీ జనసమూహాల శబ్దం నిజమైనది కాదని, అది ఒక టేప్ రికార్డింగ్ శబ్దమని పహలవీ ప్రభుత్వ ప్రధానమంత్రి పేర్కొన్నారు! ఇప్పుడు ఇరాన్ నగరాల్లో లక్షలాది మందితో జరుగుతున్న అమెరికా వ్యతిరేక, ఇజ్రాయెల్ వ్యతిరేక సమావేశాల గురించి ట్రంప్ మాట్లాడుతూ, ఈ చిత్రాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టించినవని అంటున్నారు అని ఆ ప్రకటన పేర్కొంది. మిగతా 2లో



## దాడులు.. ప్రతిదాడులు



**వుదయం డెస్క్, మార్చి 17 :** గత రాత్రి ఇరాన్ వ్యాప్తంగా జరిగిన దాడులలో కనీసం 300 మంది బసీజ్ సభ్యులు మరణించినట్టు ఇరాన్ ప్రతిపక్ష పత్రిక ఇరాన్ ఇంటర్నేషనల్ పేర్కొంది. దీని కార్యాలయం లండన్‌లో ఉంది. బసీజ్ దళ అధిపతి ఘొలమ్‌రెజా సొలేమానీని, అతడి డిప్యూటీని, సీనియర్ అధికారులను మట్టుబెట్టామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే, వారు బాధితుల లెక్కలు ఇవ్వలేదు. పలు బసీజ్ కమాండ్, లాజిస్టిక్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరి గాయని వార్తలు వచ్చాయి. దానితతో పాటుగా, పాట్రోల్, ఇతర అమలు కార్య కలాపాలకు ఉపయోగించే వందలాది వాహనాలు నిలిచి ఉన్న ఒక ప్రాంతాన్ని కూడా ఇజ్రాయెల్ల క్ష్యంగా చేసుకుంది. నిరసనలను అణచివే యడంలో జోక్యం ఉన్న యూనిట్లపై తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆ వార్త పేర్కొంది.

**దక్షిణ లెబనాన్‌పై దాడి..** దక్షిణ లెబనాన్‌లో ఒక కారు, మోటరు సైకిల్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఒకరు మరణించగా, నలుగురు గాయపడ్డారని లెబనీస్ సైన్యం మంగళవారం తెలిపింది. ఇజ్రాయెల్ శత్రు దాడిగా తాము అభివర్ణించిన దాని తర్వాత నబాటియే ప్రాంతంలో ఈ ప్రాణనష్టం జరిగిందని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మిగతా 2లో

## ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై సిట్

### 'పైలట్' రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షోకాజ్

రాజేంద్రనగర్ డీసీపీ నేతృత్వంలో విచారణ ● దుబాయ్ లింకులపైనా ఆరా



**హైదరాబాద్, మార్చి 17 (ఎఎంఎస్) : :** రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు మూలాలను, అంతర్జాతీయ సం బంధాలను ఛేదించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ఈ సిట్ తన విచారణను ప్రారంభించనుంది. ఈ బృందం మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి సంబంధించి లోతైన విచారణ జరగనుంది. ఆ పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు..? అక్కడ డ్రగ్స్ సరఫరా ఎలా జరిగింది..? అనే కోణంలో విచారణ కొనసాగుతుంది. ఈ డ్రగ్స్ దందాతో దుబాయ్‌కు ఉన్న సంబంధాలపై సిట్ ఆరా తీయ నుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా తో నిందితులకు ఉన్న పరిచయాలను వెలికితీయనున్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నమిత్ శర్మ రియల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వా రా డ్రగ్స్ మనీని ఎలా మళ్లించారనే అంశంపై సిట్ ఫోకస్ చేయనుంది. అక్రమ సంపాదనకు సంబంధించి ఆర్థిక లావాదేవీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అధికారిక ఉత్తర్వుల విడుదలతో సిట్ అధికారులు త్వరలోనే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. ఈ కేసులో మరికొంతమంది రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మిగతా 2లో

## భరోసాతోపాటు బోనస్

### వరి బోనస్ పై రైతులకు రూ.25 వేలు ఆదా

- మహిళలకు రూ. 57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చాం
- బీఆర్ఎస్ నేతలకు ఆడబిడ్డలపై ఏమాత్రం గౌరవం లేదు

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** రైతు భరోసా కాకుండా ఒక్కో రైతుకు వరి ధాన్యం బోనస్ పేరిట రూ.25 వేలు ఆదా అవుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. రైతుల శ్రమను గుర్తించి సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.ఐదొందల చొప్పు న బోనస్ రైతుల ఖాతాలో వేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు వారి ఖాతాలో జమ చేశామన్న భట్టి.. స్వయం సహా యక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల కింద ఏడాదికి రూ. 20వేల కోట్ల పైగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు ఇప్పటివరకు వడ్డీ లేని రుణాల కింద రూ. 57 వేల కోట్లను మహిళల ఖాతాలో జమా చేశామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు మహిళలపై ఏమాత్రం గౌరవం ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. కేటీఆర్ ప్రతిసారి మహిళల మనసు గాయపరుస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మహి ళల గురించి జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలని సూచించారు. మహిళ ల అభివృద్ధి గురించి వారికి శ్రద్ధ ఉంటే వారి క్యాబినెట్లో మహిళలకు అవకాశం కల్పించేవారన్నారు. వడ్డీ లేని రుణాల గురించి కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. వడ్డిలేని రుణాలకు సంబంధించిన చెక్కులు చెల్లించుకుంటూ పోతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామన్న భట్టి.. మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎన్ని అడ్డం కులు సృష్టించిన ముందుకు పోతూనే ఉంటామని స్పష్టం చేశారు.

మిగతా 2లో

## 20న మంత్రివర్గ సమావేశం

- అసెంబ్లీ కమిటీ హాల్‌లో బడ్జెట్ ఖరారు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

**హైదరాబాద్, మార్చి 17 (ఎఎంఎస్) :** రాష్ట్ర మంత్రివర్గ ఈ నెల 20న భేటీ కానుంది, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉ.9.30 గంటలకు సమావేశం కాబోతోంది. ఈ భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు దానికి మంత్రివర్గ ఆమోదం తెలపడం ఈ సమావేశం యొక్క ప్రధాన అజెండాగా ఉంది. దీంతో పాటు రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోతున్న నేపథ్యంలో ఈసారి బడ్జెట్ లో ఎలాంటి పథకాలు ఉండబోతున్నాయి? అనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## లోక్‌సభలో 8 మందిపై సస్పెన్షన్ రద్దు

- సభలో లేదా పార్లమెంటు ప్రాంగణంలో ప్లకార్డులు
- పోస్టర్లు, ఫోటోల ప్రదర్శనకు తావులేదన్న స్పీకర్



**న్యూఢిల్లీ, మార్చి 17 (వుదయం) :** అమర్యాదపూర్వక ప్రవర్తన కారణంగా ఫిబ్రవరి 3న సభ నుండి బహిష్కరించిన ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను లోక్‌సభ మంగళవారం నాడు రద్దు చేసింది. అయితే, సభ లోపల గానీ లేదా పార్లమెంట్ ప్రాంగణంలో గానీ ప్లకార్డులు, పోస్టర్లు, ఛాయాచిత్రాలు లేదా ఎఐ-సృష్టించిన చిత్రాలను ప్రదర్శించకూడదని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. సభలో జరిగిన పరిణామాలన్నీ విచారకరమని, సభ సజావుగా సాగడానికి తమ పార్టీ సహకరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొంటూ, సస్పెండైన ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకునే విషయాన్ని పరిశీలించాలని కాంగ్రెస్ సభ్యుడు కె. సురేష్ సభను కోరారు.

మిగతా 2లో

## అమెరికా కౌంటర్ టెర్రరిజం డైరెక్టర్ కెంట్ రాజీనామా



**వుదయం డెస్క్, మార్చి 17 :** ఇరాన్‌తో అమెరికా చేస్తున్న యుద్ధంపై నైతిక ఆందోళనలను పేర్కొంటూ జాతీయ ఉగ్రవాద నిరోధక కేంద్రం డైరెక్టర్ జో కెంట్ మంగళవారం రాజీనామా చేశారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించిన కెంట్, ఇరాన్ వల్ల అమెరికాకు తక్షణ ముప్పు ఏమీ లేదంటూ, యుద్ధాన్ని ప్రభుత్వం నిర్వహించిన తీరును విమర్శించారు. కెంట్ తన రాజీనామాను ఎక్స్‌పై పోస్ట్ చేస్తూ, ఇరాన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి నేను మనస్ఫూర్తిగా మద్దతు ఇవ్వలేను. ఇజ్రాయెల్, దాని శక్తివంతమైన అమెరికన్ లాబీ ఒత్తిడి కారణంగానే మనం ఈ యుద్ధాన్ని ప్రారంభించామన్నది స్పష్టం అని పేర్కొన్నారు. ఈ రాజీనామాపై జాతీయ నిఘా డైరెక్టర్ కార్యాలయం ఇంకా స్పందించలేదు. ఆ ప్రాంతంలోని అమెరికా బలగాలకు తక్షణ ముప్పు ఉందని పేర్కొంటూ ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై దాడులను సమర్థించుకుంది. అయితే, మొదట రెచ్చగొడితే తప్ప దాడి చేసే ప్రణాళికలు ఇరాన్‌కు లేవని కాపిటల్ హిల్‌కు పెంటగాన్ ఇచ్చిన బ్రీఫింగ్‌లు సూచించాయి. కాలక్రమేణా, ట్రంప్ వివరణలు మారుతూ వచ్చాయి; జనవరిలో ఇరాన్ నిరసనకారులను రక్షించడం నుండి అణు, సుదూర ఆయుధ ముప్పులను ఎదుర్కోవడం, ఉగ్రవాద గ్రూపులకు టెహ్రాన్ ఇస్తున్న మద్దతును ఎదుర్కోవడం వరకు ఆయన వివరణలు ఉన్నాయి. తమ దేశ పాలన పగ్గాలను వారే చేజిక్కించుకోవాలని ట్రంప్ ఇరానీయులను ప్రోత్సహించినప్పటికీ, ఈ సైనిక చర్య బలవంతంగా పాలన మార్పును చేయడానికి ఉద్దేశించినది కాదని అధికారులు నొక్కి చెబుతున్నారు. ఇరాన్ పట్ల అమెరికా వైఖరిపై పెరుగుతున్న అంతర్గత అసమ్మతిని సూచిస్తూ, కెంట్ నిష్క్రమణ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.


## డాక్యుమెంట్ పోయినది

తేది 17 /03/2026సాధారణ ప్రజానీకానికి ఇందుములముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ వేస్త వీరేశ్ తండ్రి ఉరుకుందప్ప, నివాసం ఇంటి.నెంబర్. 2-23, సిందనూర్ గ్రామం, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా అను వారు 1. అయిజ శివారులో గల సర్వే నెంబర్ 3/ఏ, ప్లాట్ నెంబర్ 05, రిజిస్టర్ డాక్యుమెంట్ నెంబర్.12385/2017 కొనుగోలు చేసి వున్నారు. దీనికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు 1046/2005, 1721/2014, 1722/2014, 5596/2013.లింక్ డాక్యుమెంట్లు అయిజ బస్టాండ్ నందు వ్యక్తిగత పనుల మీద పోయినప్పుడు పోగొట్టుకపోయినవి. ఒకవేళ సదరు రిజిస్టర్ డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినచో ఈ ప్రచురణ తేదీ నుండి 7 రోజులలో ఈ దిగువ సంతకదారుణ్ణి సంప్రదించగలరు.సం/-దేవ సహాయం, బి.ఏ., ఎల్.ఎల్.బి.జమ్మిచేడు గ్రామం, గద్వాల జిల్లా. 95053 41646

## ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై సిట్
# పైలట్‌కు బీఆర్ఎస్ నోటీసులు

**మొదటి పేజీ తరువాయి..**

మొయినాబాద్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షాక్ ఇచ్చింది. డ్రగ్స్ విని యోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ మంగళవారం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో మాదక ద్రవ్యాల వినియోగం జరిగిందని, ఆ సమయంలో రోహిత్ రెడ్డి అక్కడ హాజరై ఉన్నారనే మీడియా కథనాలను పార్టీ తీవ్రంగా పరిగణించింది. ఈ మొత్తం పరిణామాలపై 7 రోజుల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పార్టీ ఆదేశించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలతో సంబంధం కలిగి ఉండటం పార్టీ విలువలకు, ప్రతిష్ఠకు విరుద్ధమని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నోటీసు జారీ చేసినట్లు ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ పేర్కొన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పార్టీ తుది నిర్ణయం తీసుకునే వరకు రోహిత్ రెడ్డి పార్టీ కార్యక్రమాలకు, అధికారిక సమావేశాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. గడువులోపు సంతృప్తికరమైన వివరణ ఇవ్వని పక్షంలో, ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే పార్టీ రాజ్యాంగం ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రభుత్వం ఇప్పటికే ఈ కేసుపై 'సిట్' ఏర్పాటు చేసిన తరుణంలో సొంత పార్టీ కూడా రోహిత్ రెడ్డిపై చర్యలకు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# భరోసాతోపాటు బోనస్

**మొదటి పేజీ తరువాయి..**

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించిందన్న భట్టి.. మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వీటి నిర్మాణం కోసం రూ. 22,500 కోట్లు మంజూరు చేశామనీ ఇది దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం అమలు చేసుకుంటూ ముందుకు పోతుందని తెలిపారు. కానీ టిఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఇంటికో ఉద్యోగం, దళిత సీఎం, భూమిలేని పేదలకు వ్యవసాయ భూమి పంపిణీ హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదు అన్నారు.

## ఇరాన్ భద్రతా అధికారి
# అలీ లారీ జానీ హతం?

**మొదటి పేజీ తరువాయి..**



ఎప్‌స్టీన్ ద్వీప అవశేషాలపై ఇరాన్ ప్రజల చారిత్రక విజయం ఆసన్నమైంది, అని అది పేర్కొంది.

**ముస్లిం ప్రపంచానికి సందేశం..**

అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా ఇరాన్ తన వైఖరిలో దృఢంగా ఉందని లారిజానీ ముస్లిం ప్రపంచాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ఒక రోజు తర్వాత ఈ దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న దేశాల నుండి మద్దతు కొరవడిందని పేర్కొంటూ, ఆయన నిరాశను కూడా వ్యక్తం చేశారు. చర్చలు జరుగుతున్న సమయంలోనే, ఇరాన్‌ను ఛిన్నాభిన్నం చేయడమే లక్ష్యంగా అమెరికా–జియోనిస్టుల కుట్రపూరిత దురాక్రమణకు ఇరాన్ గురైంది. ఈ దురాక్రమణ ఫలితంగా, ఇస్లామిక్ విప్లవానికి చెందిన గొప్ప, త్యాగశీలి అయిన నాయకుడితో పాటు పలువురు పౌరులు, సైనిక కమాండర్లు అమరులయ్యారు, అని ఆయన అన్నారు.

**ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు...**

ఇరాన్, ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్ మధ్య శత్రుత్వం పెరిగి, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అధికారిక వర్గాల నుండి మరిన్ని వివరాలు రావలసి ఉన్నందున పరిస్థితి అస్థిరంగా ఉంది.

# దాడులు.. ప్రతిదాడులు

**మొదటి పేజీ తరువాయి..**

సైనికులు తమ విధులను అప్పుడే ముగించుకున్నారని ఒక సైనిక అధికారి ఏఎఫ్‌పీకి చెప్పారు. ఈ ఆరోపణ గురించి తమకు తెలుసని, ఈ ఘటనపై సమీక్ష జరుగుతోందని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. తమ కార్యకలాపాలు హిజ్బుల్లాను లక్ష్యంగా చేసుకున్నవే తప్ప, లెబనీస్ సాయుధ దళాలు లేదా పౌరులను కాదని స్పష్టం చేసింది.

**10 బాలిస్టిక్ క్షిపణులు, 45 డ్రోన్లను అడ్డుకున్నామన్న యుఎఇ..**

మంగళవారం నాడు ఇరాన్ ప్రయోగించిన 10 బాలిస్టిక్ క్షిపణులు, 45 డ్రోన్లను తాము అడ్డుకున్నట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, తాము మొత్తం 314 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు, 1,672 డ్రోన్‌లను అడ్డుకున్నట్లు యుఎఇ తెలిపింది. ఇలా ఉండగా, ఇరాన్ నుండి కొత్త బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని ఐడిఎఫ్ గుర్తించింది. రాబోయే ముప్పును ఎదుర్కోవడానికి వాయు రక్షణ వ్యవస్థలు సిద్ధమవుతున్నందున, రాబోయే నిమిషాల్లో మధ్య ఇజ్రాయెల్‌లో సైరన్‌లు మోగనున్నాయని ఐడిఎఫ్ పేర్కొంది.

**ప్రభుత్వ మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ తిరిగి దాడులు...**

తెహ్రాన్‌లోని ఇరాన్ ప్రభుత్వ మౌలిక సదుపాయాల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దళం కొత్త విడత దాడులు ప్రారంభించిందని ఐడీఎఫ్ తెలిపింది.గతరాత్రి తెహ్రాన్‌లో ఇరాన్ తాత్కాలిక నాయకుడు అలీ లారిజానీ, బసిజ్ పారామిలిటరీ దళాల కమాండర్ ఘోలమ్రెజా సోలేమానీ, ఇతర సీనియర్ బసిజ్ అధికారులను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించిన తర్వాత ఈ తాజా దాడులు జరిగాయి. ఇజ్రాయెల్, అమెరికా సైనిక స్థావరాలకు గురిపెట్టి ఇరాన్ క్షిపణులు, డ్రోణుల సరికొత్త దాడులు జరిపినట్టు సమాచారం.



# లోక్‌సభలో 8 మందిపై సస్పెన్షన్ రద్దు

**మొదటి పేజీ తరువాయి..**

ప్రతిపక్ష సభ్యులు పలు సూచనలు చేసిన అనంతరం, సభ సజావుగా సాగడానికి ఒక 'లక్ష్మణ రేఖ'ను గీసుకోవాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. దీనికి అధికార, ప్రతిపక్ష పక్షాలు రెండూ అంగీకరించాయి. సభలో గానీ, పార్లమెంట్ ప్రాంగణం లోపల గానీ ఎటువంటి ప్లకార్డులు, పోస్టర్లు, ఛాయా చిత్రాలు లేదా ఎఐ–సృష్టించిన చిత్రాలను ప్రదర్శించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని స్పీకర్ బిర్లా తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ పార్లమెంటు కార్యకలాపాలు సజావుగా సాగాలని, ఇందుకోసం అందరూ సహకరించాలని అందరూ అభిప్రాయపడుతున్నారని బిర్లా పేర్కొన్నారు. అనంతరం, ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలు, ఒక సిపిఐ–ఎం సభ్యుడిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ రిజిజు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అది మూజువాణి ఓటు ద్వారా ఆమోదం పొందింది. సస్పెండ్ అయిన ఎంపీలలో కాంగ్రెస్‌కు చెందిన గుర్జీత్ సింగ్ ఔజ్లా, హిబి ఎడెన్, సి. కిరణ్‌కుమార్ రెడ్డి, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మనిక్కం టాగోర్, ప్రశాంత్ పదోలే, డీన్ కురియకోసె, సిపిఐ (ఎం)కు చెందిన ఎస్. వెంకటేశన్ ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల మొదటి భాగంలో లోక్‌సభ ఆమోదించిన ఒక తీర్మానం మేరకు, అదుపులేని ప్రవర్తన కారణంగా ఆ ఎనిమిది మంది ఎంపీలను ఫిబ్రవరి 3న సస్పెండ్ చేశారు. ఏప్రిల్ 2న ముగియనున్న ఈ బడ్జెట్ సమావేశాల పూర్తి కాలానికి వారిని సస్పెండ్ చేశారు. అంతకుముందు, సురేష్ చేసిన విజ్ఞప్తి అనంతరం, సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్ ఆ ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. పార్లమెంటు అత్యున్నత ప్రమాణాలను కాపాడటంలో తమ పార్టీ సహకరించడానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సభ గౌరవానికి భంగం కలిగించే పనేదీ మేము చేయబోమని ఈ సభకు హామీ ఇస్తున్నాను. అయితే, అధికార కూటమి సభ్యులు కూడా సముచితంగా ప్రవర్తించాలి, అని యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే పేరును ప్రస్తావిస్తూ, ఆయన తన ప్రవర్తనను సరిదిద్దుకోవాలని సూచించారు.

తన 17 ఏళ్ల పార్లమెంటరీ ప్రస్థానంలో, సభ గౌరవాన్ని దిగజార్చే పని ఏదీ తాను చేయలేదని పేర్కొంటూ దుబే వెంటనే యాదవ్ వ్యాఖ్యలను ఖండించారు.

సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ చేసిన వ్యాఖ్యలకు గాను, క్షమాపణ చెప్పాలని కూడా బిజెపి ఎంపీ డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగేలా చూసేందుకు అధికార, ప్రతిపక్ష సభ్యులు ఇరువురూ కృషి చేయాలని ఎన్‌సీపీ నాయకురాలు సుప్రియా సూలే అన్నారు. ఎవరూ ఎవరిపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకూడదు. మేము (ప్రతిపక్షం) అధికార పక్షాన్ని గౌరవించాలి, అలాగే అధికార పక్షం కూడా ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ఇరుపక్షాల మధ్య ఒక లక్ష్మణ రేఖ ఉండాలి, దానిని ఎవరూ ఉల్లంఘించకూడదు, అని ఆమె అన్నారు. సభ సజావుగా సాగాలని, ఇరుపక్షాలు సహకరించుకోవాలని జేడీ–యూ నాయకుడు, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ పేర్కొన్నారు. లక కూటమి సభ్యులు నిబంధనలను ఉల్లంఘించరని, గతంలోనూ వారు ఎప్పుడూ నిబంధనలను ఉల్లంఘించలేదని రిజిజు అన్నారు. ఒక లక్ష్మణ రేఖ గీసుకోవాలి. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడానికో లేదా నిరసనలు తెలపడానికో ప్రజలు మనల్ని ఎన్నుకోలేదు. అందరి సహకారంతో సభ సజావుగా సాగాలి, అని రిజిజు పేర్కొన్నారు. సోమవారం నుండి ప్రతిపక్ష సభ్యులు ఎటువంటి ప్లకార్డులు లేదా బ్యానర్లను ప్రదర్శించలేదని, సభ సక్రమంగా పనిచేయడానికి సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సురేష్ తెలిపారు.



# వాగ్యుద్ధకాండ

**మొదటి పేజీ తరువాయి..**

దీనిపై స్పందించిన కోమటిరెడ్డి గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. అయినప్పటికీ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలపాలని పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు భవిష్యత్తుపై కేటీఆర్ కీలక ప్రశ్నలు లేవనెత్తారు. గ్లోబల్ సమ్మిట్లలో ప్రకటించిన పెట్టుబడులు, అవగాహన ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. టీఎస్–ఐపాస్ వెబ్‌సైట్ గత పదేళ్లలో అత్యంత పేలవమైన పనితీరును చూపుతోందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 14వేల ఎకరాల్లో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని, ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ వంటి పేర్లతో మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఫార్మా కోసం షరతులతో కూడిన ఈ భూమిని ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్లాట్లు ఇవ్వడానికి, స్టేడియాలు, జూ పార్కులు నిర్మించడానికి ఉపయోగించలేరని ఆయన స్పష్టం చేశారు. ఫార్మా సిటీ రద్దు కాలేదని కోర్టుకు చెబుతూ, బయట మాత్రం దానిని ఫ్యూచర్ సిటీగా ప్రచారం చేయడంలో వైరుధ్యం ఉందని కేటీఆర్ అన్నారు. కాలుష్య కారక పరిశ్రమల మధ్యలో నివాస సముదాయాలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పారిశ్రామికవేత్తలకు నమ్మకం ఎలా కుదురుతుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ సభలో విమర్శలు గుప్పించారు. దీనికి మంత్రి శ్రీధర్ బాబు ఆయనకు కౌంటర్ ఇచ్చారు.

**రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ గళం..**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ గళమెత్తింది. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సెక్రటరీకి వాయిదా తీర్మానం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చెల్లించాలని బీఆర్ఎస్ నేతలు తీర్మానంలో పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన తర్వాత రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందక రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. అసెంబ్లీ లోపల, బయట రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

**ఆరు గ్యారంటీలేమయ్యాయి..? బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్**

ఎన్నికల ముందు 'దానకర్ణుడి'లా సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ..అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా 'కుంభకర్ణుడి'లా నిద్రపోతోంది. నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకుపోలేరు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది? తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైంది? సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారు? ఇటీవల ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ ఫైలు కూడా కాలిపోయిందా.? మాయమైన ఆ ఆరు గ్యారంటీల ఫైలును వెతికి పట్టుకోవడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలి. కాంగ్రెస్ పాలనను మూడు ముక్కల్లో చెప్పాలంటే 'ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు' అన్న చందంగా ఉంది. గల్లీల్లో చెత్త కుప్పలు పేరుకుపోతుంటే, పాలకులు మాత్రం ఢిల్లీకి విమాన యాత్రలు చేస్తున్నారు. రాష్ట్రంలో నోటిఫికేషన్లు 'నిల్'.. లూటిఫికేషన్లు 'ఫుల్'. పెన్షనర్లకు టీఏ, డీఏలు రాక నరకయాతన పడుతున్నారు. గ్యారంటీ కార్డులు కాస్తా ఇప్పుడు 'బాకీ కార్డులుగా' మారి వెక్కిరిస్తున్నాయి. తెలంగాణ ప్రజల సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫుల్ పేజీ ప్రకటనలు ఇస్తూ ఎన్నికల ప్రచారం చేసుకుంటోంది. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, ప్రభుత్వం ఇతర అంశాలపై దృష్టి పెడుతోంది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు, ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో బీఆర్ఎస్ తరపున 'ప్రైవేట్ మెంబర్ బిల్' ప్రవేశపెడతాం. ప్రభుత్వం ఇప్పటికైనా మాట నిలబెట్టుకుని రైతులు, మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారు.. 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా? ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి ? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదు.

**ఢిల్లీ నుంచే మా రాజకీయం మంత్రి శ్రీధర్ బాబు**

మాది జాతీయ పార్టీ. ఢిల్లీ నుంచే రాజకీయం ఉంటుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధుల తీసుకువచ్చేందుకు ఎన్ని సార్లైనా ఢిల్లీ వెళ్తాం. ఎన్ని సార్లైనా ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులను కలుస్తాం.మీది ప్రాంతీయ పార్టీ. మీరు పదేళ్లు అధికారంలో ఉండగా అధికారం కాపాడుకునేందుకు ఎన్ని సార్లు ఢిల్లీకి వెళ్లలేదు..? గవర్నర్ ప్రసంగంపై ప్రభుత్వానికి కేటీఆర్ ఏదైనా సలహాలు, సూచనలు ఇస్తారనుకున్నా. కానీ అదే ఊక దంపుడు ఉపన్యాసాలు, ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను ఇక్కడ చదివి వినిపిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఢిల్లీకి వెళ్లకుండా జిద్దు రాజకీయం చేయాలా? రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మేము ఓ మెట్టు దిగైనా ప్రయత్నిస్తున్నాం. కేంద్రం ఇస్తుందా లేదా అది వారి ఇష్టం. కానీ మా ప్రయత్నం కొనసాగిస్తాం. మంత్రిగా పని చేసిన అనుభవం కలిగిన కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారు. మమ్మల్ని ఫ్లాప్ అయిన సినిమా అంటున్నారు. ఫ్లాప్ అయింది మేము కాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో, సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో ఫ్లాప్ అయింది మీరే. ఇన్నిసార్లు ఫ్లాప్ అయిన మీరు మమ్మల్ని ఫ్లాప్ అంటున్నారా..? ఇకనైనా వాస్తవాలు మాట్లాడాలి. అప్పుడే వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనైనా కనీసం ఫ్లాప్ నుంచి తప్పించుకుని కాస్త మెరుగు పడే అవకాశం ఉంది. అంతే తప్ప వింటున్నామని కాదా అని తిట్టడమే పనిగా పెట్టుకోవడం సరికాదు.

**బీఆర్ఎస్ పదేళ్లలో ఎందుకు చేయలేదు..? : మంత్రి సీతక్క**

ప్రతిపక్ష నేత కేటీఆర్ ప్రభుత్వంపై నిందు సభలో మహిళా సంక్షేమంపై సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మా ప్రభుత్వం పని చేస్తోంది. మా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రతిపక్షాలు ఎగతాళి చేయడం సరికాదు. మేము చేస్తున్న పనులను పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు చేయలేకపోయింది? మొదటి నుంచి కేటీఆర్‌కు మహిళలంటేనే చిన్నచూపు. అందుకే ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జీర్ణించుకోలేక నిప్పులు చెరుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. బాధ్యత గల ప్రతిపక్షంగా దీనికి సహకరించాలి. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 57వేల కోట్లకు పైగా రుణాలను మంజూరు చేశాం.

**సీఎంకు ఆయన శాఖలో ఏం జరుగుతుందో తెలియదు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఆయనకు జల్సాలు ఎక్కువయ్యాయి. ప్రైవేట్ వ్యక్తులకు ఆయుధాలు ఇచ్చి కాల్పులు జరిపిస్తున్నారు. గడ తేడాది సెప్టెంబర్ లో కరీంనగర్ ఫైరింగ్ రేంజ్‌లో సీపీ సతీమణి, ఆమె ఐదుగురు మిత్రులతో కలిసి 10 రౌండ్లు కాల్పులు జరిపారు. ఏకే–47, పిస్టల్స్‌తో సుమారు 160 బుల్లెట్లను ప్రైవేట్ వ్యక్తులు ఎలా వాడతారు... ? బోనాలపల్లిలో అమృతమ్మ అనే వృద్ధురాలికి బుల్లెట్ తగిలింది. కానీ ఆమె రాయి తగిలిందని భావించింది. ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. హోం మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి ఆయన శాఖలో ఏం జరుగుతుందో తెలియడం లేదు. ప్రైవేట్ వ్యక్తులు ఫైరింగ్ చేయడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. నేను చెప్పింది తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటా. మరి ఇప్పుడు ఐపీఎస్ అసోసియేషన్ ఎందుకు స్పందించడం లేదు. వికాస్ అగర్వాల్ అనే అధికారి ప్రైవేట్ వ్యక్తికి ఇన్నోవా వాహనం ఇచ్చి పంపారు. ఇలా కొందరు అధికారులతో మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తుంది. సీపీ.. నన్ను బెదిరించలేదు. నేను భయపడే వ్యక్తిని కాదు. ఆయనకు ఇంటెలిజెన్స్ ఉంటే, మాకు లక్షలాది మంది కార్యకర్తలు సమాచారం ఇస్తారు.

**పార్టీ మారే ఆలోచన తెచ్చిందే సంజయ్ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

నేను కాంగ్రెస్ పార్టీని వీడటం ఖాయం. ఆల్రెడీ వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాను. రెండు, మూడు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తా. మెజార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరూ పార్టీని వీడితేనే మంచిదని చెప్పారు. వారి సూచనలు, అభిప్రాయాలను గౌరవిస్తా. నేను పార్టీ వీడతానని ఎప్పుడూ.. ఎక్కడా.. చెప్పలేదు. అసలు ఆ ఆలోచన రావడానికి కారణం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్. ఆయన కాంగ్రెస్ పార్టీలోకి రావడంతోనే జిల్లాలో చిచ్చు రేగింది. 2014లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నేను ప్రజల హక్కుల కోసం పోరాడా. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ ప్రజల అభివృద్ధి హక్కును సాధించలేకపోతున్నారు. వక్రమార్గాన వెళ్తే ప్రజలు ఎన్నటికీ హర్షించరు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలో ఉంటూ తనతో కలిసి పనిచేయాలంటూ సంజయ్ చెప్పడం విడ్డూరంగా ఉంది. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలి. అసలు ఆయనది ఏ పార్టీ.. స్పీకర్ ఏమో ఆయన బీఆర్ఎస్‌లో ఉన్నారని అంటున్నారు. సంజయ్ ఏమో కాంగ్రెస్‌లో కలిసి పనిచేద్దాం అంటున్నారు. నేను పార్టీ మారాలని ఆలోచించేందుకు కారణం ఎమ్మెల్యే సంజయ్. ఇంకా నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న. కాంగ్రెస్ పార్టీతో తనది 40 ఏళ్ల బంధం ఉంది. ఎంత ఒత్తిడి ఉంటే పార్టీ మార్పుపై ఆలోచిస్తున్నానో అర్థం చేసుకోవాలి.

**హ్యామ్ పేరిట రూ. 18వేల కోట్ల స్కాం : మాజీ మంత్రి హరీశ్ రావు**

రాష్ట్రంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల పేరిట రూ.18వేల కోట్ల స్కామ్ జరుగుతోంది. హ్యామ్ రోడ్లకు 10శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇస్తున్నారు. హ్యామ్ రోడ్ల ద్వారా కాంగ్రెస్‌కు వేల కోట్లు వస్తాయి. ఈ కమీషన్లను 4 రాష్ట్రాల ఎన్నికలకు పంపుతారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే టెండర్లు రద్దు చేయాలి. సీవోటీ అనుమతి.. 5 శాతం సీలింగ్ తప్పనిసరి చేయాలి. మొబిలైజేషన్ అడ్వాన్సులు రద్దు చేయాలి. ఈ కుంభకోణంపై హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలి. సీవీసీ, ఆర్బీఐ సహా అన్ని విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

**జగ్గారెడ్డికి పీసీసీ ఇస్తే వంద సీట్లు ఖాయం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి తరహాలో జగ్గారెడ్డికి ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గుణం ఉంది. ఆయన 'మరో పీజేఆర్'. ఒకవేళ జగ్గారెడ్డికి పీసీసీ పగ్గాలు అప్పగిస్తే, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సునాయాసంగా 100 సీట్లు గెలుచుకుంటుంది. హ్యామ్ రోడ్ల టెండర్లలో రూ.18 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్న మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణల్లో వాస్తవం లేదు. అసలు అన్ని కోట్ల రూపాయల టెండర్లే పిలవనప్పుడు, అవినీతి జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదం.

**కేసీఆర్ గొప్ప అనుభవజ్ఞుడు.. మంత్రి శ్రీధర్ బాబు**

కేసీఆర్ గొప్ప అనుభవజ్ఞుడు.. ఆయన సభకు రావాలి. ఆయన సలహాలు సూచనలు స్వీకరిస్తాం. మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి ఎవరనేది ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుంది. నామినేటెడ్ పదవులపై కసరత్తు జరుగుతోంది. పోర్ట్ ఫోలియోల కేటాయింపులపై సీఎందే తుది నిర్ణయం. మాజీ మంత్రి జీవన్ రెడ్డి విషయంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవ చూపాలి. జీవన్ రెడ్డి పార్టీ మారొద్దని నేను కోరుతున్న. జగ్గారెడ్డి అంటే అందరికీ ఇష్టమే.. పీసీసీపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన మనసులోని మాట చెప్పారు. పీసీసీ పదవిపై అధిష్టానానిదే తుది నిర్ణయం.

**60లక్షల మందికి పైగా మందికి రైతుభరోసా : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ఈనెల 22 నుంచి రైతుభరోసా నిధులు పంపిణీ చేయనున్నాం. రాష్ట్రంలో 60లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో ఈ నిధులు జమ అవుతాయి. బీఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్నారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్, యంత్ర పరికరాలు అందిస్తున్నాం. రైతులు, ప్రజల మద్దతుతో మున్సిపల్, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం దక్కింది. అసత్య ప్రచారం చేస్తోన్న బీఆర్ఎస్ నేతలను ప్రజలు విశ్వసించరు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా 71.86లక్షల టన్నుల ధాన్యం పండించాం. ఎల్లంపల్లి నీటితో పెద్ద ఎత్తున వరి పండింది. బీఆర్ఎస్ హయాంలో మోటార్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. ఇందిరమ్మ రాజ్యం నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ సేవలందిస్తున్నాయి.

## ఎమ్మెల్యేల అనర్హత తీర్పుపై బీఆర్ఎస్ నిలదీత..
### కౌంటర్ ఇచ్చిన స్పీకర్, మంత్రి పొంగులేటి

సభలో ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల తీర్పు అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల స్పీకర్ ఘాటుగా స్పందించారు. తీర్పు కాపీ చదివి వచ్చి మాట్లాడాలని సూచించగా, కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. దీందో పార్టీ ఫిరాయింపుల అంశం సభలో హాట్ హాట్‌గా మారింది. ఈ క్రమంలో సభలో మాట్లాడిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని అంశాల్లో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. స్పీకర్‌ను ఉద్దేశించి మీరంటే నాకు మర్యాద ఉంది. కానీ తమరు కూడా మా పార్టీ టికెట్ మీద ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి కాంగ్రెస్ పార్టీ టికెట్ మీద ఎంపీగా పోటీ చేస్తే మీరు ఓ నిర్ణయం తీసుకున్నారు. మీరంటే వ్యక్తిగతంగా గౌరవం ఉంది. మీరు నేను మిత్రులం అది అందరికీ తెలుసు. కానీ మీరు తీసుకున్న నిర్ణయం తప్పైతే తప్పకుండా ప్రశ్నించే అధికారం, హక్కు సభ్యుడిగా నాకు ఇక్కడ ఉంది. ఉంటుందన్నారు.

మీ జ్యుడిషియల్ అథారిటీని మేము కాదనడం లేదు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, నిలదీయడం మా బాధ్యత. హైకోర్టులో కాకుంటే సుప్రీంకోర్టుకు సుప్రీంకోర్టు తీర్పుపై అవసరమైతే రివ్యూ పిటిషన్లు వేస్తామని ఇది న్యాయవ్యవస్థలో ప్రాసెస్ అన్నారు.

దేశంలో ఆయారాం గయారామ్ సంస్కృతిని తీసుకువచ్చింది కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. అధికారం వచ్చిందని అహంకారంతో మాట్లాడవద్దని నేనేమి ఇక్కడికి ఊరికేనే రాలేదని నేను ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి వచ్చామన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. జ్యుడిషియరీ వ్యవస్థలో జడ్జి తీర్పు ఇస్తారన్నారు. కానీ మీరు జడ్జిమెంట్ చదవకుండానే నాపై ఎన్ని అభియోగాలు మోపారు. అయినా నేను మీడియా ముందుకు రాలేదు. ఈ విషయంలో కూడా జడ్జిమెంట్ చదివాక మాట్లాడితే మీకు నేను జవాబిస్తా. దయచేసి విషయంలో ప్రశ్నించడాన్ని తగ్గించుకుంటే మంచిదని సూచించారు.

**నిరంకుశత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు మీరు**

కట్టుకథలు అల్లుతున్న ప్రతిపక్ష నేత చివరకు జడ్జి స్థానంలో స్పీకర్ ను కూడా ప్రశ్నించే స్థాయికి మాట్లాడుతుంటే వారు ఏ రకమైన అహంకారంతో ఉన్నారో అర్థం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. వీరి అహంకారాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారని చెప్పారు. అందుకే పదే పదే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే నాలుగు సార్లు ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. మీరు చెప్పినవే నిజాలైతే ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు, అంతకు ముందు పంచాయతీ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారని నిలదీశారు. ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయకపోతే వాటికి కారణాలపై విశ్లేషించుకోకుండా కట్టుకథలు, మాటల గారడీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నిరంకుశం అని మాట్లాడుతున్నారని నిరంకుశానికి బ్రాండ్ అంబాసీడర్లు మీరు. దాని గురించి మీరు మాట్లాడుతున్నారా? అని అని మండిపడ్డారు. పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించిందే మీరు కదా అని అన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**అక్రిడిటేషన్ కమిటీలో పరిగణలోకి జర్నలిస్టుల సూచనలు**

**టీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు**



**హైదరాబాద్, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ తో పాటు వెబ్ మీడియాలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తోన్న జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్–ఏ–ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రడేషన్ కార్డుల జారీలో, అక్రిడేషన్ కమిటీ ఏర్పాటులో, జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్న పొంగులేటి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.





# జాతీయం-అంతర్జాతీయం



## దత్తత తీసుకున్న తల్లులూ ప్రసూతి సెలవుకు అర్హులే : సుప్రీం

**న్యూఢిల్లీ, మార్చి 17 (వుదయం) :**



సామాజిక భద్రతా కోడ్ లోని సెక్షన్ 60(4) ను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ, దత్తత తీసుకున్న పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా, దత్తత తీసుకున్న తల్లులకు 12 వారాల ప్రసూతి సెలవుకు అర్హత ఉండాలని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది.

ఇంతకు ముందు, దత్తత తీసుకున్న బిడ్డ మూడు నెలలలోపు వయసు వారైతేనే ఆ తల్లులకు శలవు ఇచ్చేవారు.

ఒక బిడ్డను చట్టబద్ధంగా దత్తత తీసుకున్న మహిళ గానీ, లేదా సరోగసీ ద్వారా బిడ్డను పొందిన తల్లి గానీ సందర్భాన్ని బట్టి ఆ బిడ్డను దత్తత తీసుకున్న తల్లికి లేదా సరోగసీ తల్లి, దత్తత తీసుకునే తల్లికి అప్పగించిన తేదీ నుంచి వారు 12 వారాల పాటు ప్రసూతి ప్రయోజనాలను పొందే హక్కును కలిగి ఉంటారు, అని న్యాయమూర్తులు జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**వయసుతో సంబంధం లేకుండా తల్లి బాధ్యతలు అవే**

మూడు నెలల కంటే ఎక్కువ వయసున్న బిడ్డను దత్తత తీసుకున్న మహిళ తల్లి బాధ్యతలు, మూడు నెలల కంటే తక్కువ వయసున్న బిడ్డను దత్తత తీసుకున్న మహిళ తల్లి బాధ్యతలతో సమానంగా ఉంటాయి కనుక, వయసు ఆధారిత విభజన హేతుబద్ధమైన వర్గీకరణ కాదని సుప్రీంకోర్టు పేర్కొంది.

పితృత్వ సెలవును సామాజిక భద్రతా ప్రయోజనంగా గుర్తించే చట్టాన్ని తీసుకురావాలి కూడా కోర్టు కేంద్రాన్ని కోరింది.

దత్తత తీసుకున్న ఒక తల్లి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. శిశువులను దత్తత తీసుకోవాలనుకునే మహిళలకు ఈ నిబంధన చట్టపరమైన అడ్డంకులను సృష్టిస్తున్నందున, ఇది ఏకపక్షమైనదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జి)ని ఉల్లంఘిస్తోందని పిటిషనర్ వాదించారు.

**వయస్సును నిర్ణయించడం వెనుక ఉన్న హేతుబద్ధతను ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

విచారణ సందర్భంగా, దత్తత వయస్సును మూడు నెలలుగా నిర్ణయించడం వెనుక ఉన్న హేతుబద్ధతను కోర్టు ప్రశ్నించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం తన సమాధానంలో, ప్రసవం తర్వాత కోలుకోవడానికి అవసరమైనందున కన్నతల్లులకు 18 వారాల సెలవు మంజూరు చేస్తారని పేర్కొంది. ఒక తల్లికి ప్రసూతి ప్రయోజనాలను పూర్తిగా నిరాకరిస్తే, ఎక్కువ వయస్సులో దత్తత తీసుకున్న బిడ్డను ఆమె ఎలా చూసుకుంటుందని కోర్టు ఇంకా ప్రశ్నించింది. దత్తత తీసుకున్న బిడ్డను పెంచడంలో ఉండే బాధ్యతలు, భావోద్వేగ బంధాలు ఏమాత్రం భిన్నమైనవి కావని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

## కాబూల్‌లో ఆసుపత్రిపై పాక్ దాడిని ఖండించిన భారత్

**న్యూఢిల్లీ, మార్చి 17 (వుదయం) :**



కాబూల్‌లోని ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ మంగళవారం తీవ్రంగా ఖండించింది. పౌరులను లక్ష్యంగా చేసుకున్న ఈ ఘటనను పిరికిపంద, అమానుషమైన చర్యగా అభివర్ణించింది. ఒమిద్ అడిక్షన్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్‌గా గుర్తించిన మాదకద్రవ్యాల పునరావాస కేంద్రంపై జరిగిన దాడి ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఈ దాడిలో సుమారు 400 మంది మరణించారని, మరో 250 మంది గాయపడ్డారని ఆఫ్ఘన్ అధికారులు పేర్కొన్నారు.

చట్టబద్ధమైన సైనిక లక్ష్యంగా పరిగణించలేని ఒక ప్రదేశంలో పౌరులపై జరిగిన ఈ అమానుష చర్య అత్యంత క్రూరమైనదని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఒక మారణహోమాన్ని సైనిక చర్యగా చిత్రీకరించడానికి ఇస్లామాబాద్ ప్రయత్నిస్తోంది అని కూడా ఆరోపించింది.

ఈ ఘటన ఆఫ్ఘనిస్తాన్ సార్వభౌమాధికారాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని న్యూఢిల్లీ అభివర్ణించింది. అలాగే, ఇలాంటి చర్యలు ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ప్రత్యక్ష ముప్పు కలిగిస్తాయని హెచ్చరించింది.

ఈ దాడిలో అవివేక ప్రవర్తన ధోరణి ప్రతిబింబిస్తోందని, పాకిస్తాన్ అంతర్గత సవాళ్ల నుంచి దృష్టి మళ్లించేందుకు సరిహద్దు దురాక్రమణకు పాల్పడుతోందని కూడా ఆరోపించింది.

పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని భారత్ విమర్శించింది. ఏ మతమూ, నైతిక నియమావళి కూడా ఒక ఆసుపత్రిని, దానిలోని రోగులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని సమర్థించదు, అని ఆ ప్రకటనలో పేర్కొంది.

అంతర్జాతీయ చర్యలకు పిలుపునిస్తూ, ఈ ఘటనకు బాధ్యులైన వారిని జవాబుదారీగా చేయాలని, పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలని భారత్ అంతర్జాతీయ సమాజాన్ని కోరింది.

బాధితుల కుటుంబాలకు సంతాపం తెలియజేయడంతో పాటు, ఆఫ్ఘనిస్తాన్ సార్వభౌమత్వానికి, ప్రాదేశిక సమగ్రతకు తమ మద్దతును పునరుద్ఘాటించింది.

ఈ దాడిని పాకిస్తాన్ చేసిందని ఆఫ్ఘన్ అధికారులు ఆరోపించిన తర్వాత, ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈ ఖండన వెలువడింది. ఈ దాడిలో ఆసుపత్రిలోని చాలా భాగాలను నేలమట్టం అయ్యాయని తెలుస్తోంది.

సోమవారం రాత్రి పొద్దుపోయాక కాబూల్ వ్యాప్తంగా పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వచ్చాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి దట్టమైన పొగ పైకి లేవడం కనిపించింది.

పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నామన్న ఆరోపణలను పాకిస్తాన్ ఖండించింది. తమ వైమానిక దాడులు ఉగ్రవాద, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది.

## ఐసిస్‌తో సంబంధం ఉన్న వైద్య విద్యార్థి అరెస్టు

**లక్నో, మార్చి 17 (వుదయం):**



నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్ ఆన్‌లైన్ మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై, దంత వైద్య విద్యను అభ్యసిస్తున్న 19 ఏళ్ల విద్యార్థిని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం (ఏటిఎస్) అరెస్టు చేసిందని అధికారులు సోమవారం తెలిపారు.

భారతదేశంలో పనిచేస్తున్నఐఎస్ఐఎస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ల కార్యకలాపాలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా, సహారన్‌పూర్ జిల్లాకు చెందిన హారిష్ అలీని ఆదివారం నాడు మొరాదాబాద్‌లో అరెస్టు చేసినట్లు ఎటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

రెండో సంవత్సరం బిడిఎస్ విద్యార్థి అయిన అతడు, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు, సెషన్, డిస్కార్డ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్ల ద్వారా ఐఎస్ఐఎస్ నిర్వాహకులు (హ్యాండ్లర్లు), సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎటిఎస్ తెలిపిన వివరాల ప్రకారం, ఉత్తరప్రదేశ్, ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు షరియా ఆధారిత ఖలీఫా వ్యవస్థను స్థాపించడమే లక్ష్యంగా ఐఎస్ఐఎస్ సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయడానికి, అలాగే భారతదేశంలో ఆ ఉగ్రవాద సంస్థను బలోపేతం చేసేందుకు వ్యక్తులను చేర్చుకోవడానికి ఆన్‌లైన్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది.

ప్రచార సామగ్రి, తీవ్రవాద సాహిత్యం, ఐఎస్ఐఎస్ కార్యకలాపాలకు సంబంధించిన ఆదేశాలను పంచుకోవడానికి ఈ గ్రూపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

లభ్యమైన సమాచారం ఆధారంగా, లక్నోలోని ఎటిఎస్ పోలీస్ స్టేషన్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, భారతీయ న్యాయ సంహిత లోని సంబంధిత సెక్షన్ల కింద ఒక కేసు నమోదు చేసినట్లు ఆ ప్రకటన తెలిపింది.

విచారణలో భాగంగా, నిందితులు తమతో ఏకీభవించే వ్యక్తులను నియమించుకోవడానికి, ఐసిస్ ప్రచారాన్ని వ్యాప్తి చేయడానికి మారుపేర్లు, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌లను (విపిఎన్ లు) ఉపయోగించి అనేక గ్రూపులను సృష్టించినట్లు తేలిందని అది పేర్కొంది.

నిందితులు అల్ ఇత్తిహాద్ మీడియా ఫౌండేషన్ అనే పేరుతో మరో గ్రూపును కూడా నడుపుతూ, భారతదేశంలో, విదేశాలలో ఉన్న ఐసిస్ నెట్‌వర్క్‌లతో సంబంధం ఉన్న వ్యక్తులతో సంబంధాలు కొనసాగించారని అధికారులు తెలిపారు.

## ‘కాలమే జవాబిస్తుంది’

**చెన్నై, మార్చి 17 (వుదయం) :**



రాష్ట్రంలోని అగ్ర కుటుంబం డిఎంకె నుండి వచ్చిన బెదిరింపుల కారణంగానే రజనీకాంత్ రాజకీయాలకు దూరంగా ఉన్నారని టివికె ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున చేసిన వ్యాఖ్యలు సంచలనం రేకెత్తించాయి. ఈ వ్యాఖ్యల వల్ల రేగిన రాజకీయ వివాదంపై ప్రముఖ నటుడు రజనీకాంత్ స్పందించారు. ఆ వ్యాఖ్యలు అవాస్తవం అని పేర్కొంటూ, తనకు మద్దతు తెలిపిన వివిధ పార్టీల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమయం వచ్చినప్పుడు కాలమే దానికి జవాబిస్తుందని ఒ క ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

**టివికె నాయకుడి వ్యాఖ్యతో రేగిన వివాదం**

రాష్ట్రంలోని అగ్ర కుటుంబం నుండి వచ్చిన బెదిరింపుల కారణంగానే రజనీకాంత్ రాజకీయాలకు దూరంగా ఉన్నారని టివికె ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున చేసిన వ్యాఖ్యతో ఈ వివాదం మొదలైంది.

విజయ్ మానసిక స్థైర్యాన్ని పట్టి చూపే ఉద్దేశంతో చేసిన ఈ వ్యాఖ్యపై పలువురు రాజకీయ నాయకుల నుండి తీవ్ర స్పందనలు వచ్చాయి.

**రాజకీయ నాయకుల ఖండన**

ఆ వ్యాఖ్యలు పూర్తిగా ఖండించదగినవిగా ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె. పళనిస్వామి అభివర్ణించారు. రజనీకాంత్ రాజకీయాలకు అతీతులని, ఆయన అందరి గౌరవాన్ని పొందుతున్నారని పేర్కొన్న ఆయన, ఆయన నిర్ణయాన్ని ప్రశ్నించడం తగదని వ్యాఖ్యానించారు.

రాజకీయాల్లోకి ప్రవేశించడం ప్రతి వ్యక్తి హక్కు అయినట్లే, వాటికి దూరంగా ఉండటం కూడా అంతే సమానమైన హక్కు. స్వయంగా ఆయనే తన నిర్ణయానికి గల సరైన కారణాన్ని వెల్లడించినప్పుడు, మనం దానిని గౌరవించాలి. అంతేకానీ, రాజకీయ దురుద్దేశాలతో వ్యవహరిస్తూ, పరువుకు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడం అనేది రాజకీయ మర్యాదకు పూర్తిగా విరుద్ధమైన చర్య, అని ఆయన ఎక్స్‌పై పేర్కొన్నారు. తమిళనాడు మంత్రి, డీఎంకే నాయకుడు ఎస్. రఘుపతి కూడా ఈ ప్రకటనను పచ్చి అబద్ధం అని విమర్శిస్తూ, టీవీకే రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, రజనీకాంత్‌కు సినిమాకు అతీతమైన స్థాయి ఉందని ప్రశంసిస్తూ, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆయన అద్భుతమైన కళాత్మక విజయాలకు అతీతంగా, ఆయన వినయం, ఆధ్యాత్మిక దృక్పథం, కుల, మత, భాష, ప్రాంత భేదం లేకుండా ప్రజల నుండి ఆయన పొందే అపారమైన అభిమానానికి విస్తృతంగా ప్రశంసలు అందుకున్నారు, అని నాగేంద్రన్ కూడా ఎక్స్‌పై పేర్కొన్నారు.

**తనకు మద్దతు తెలిపిన నాయకులకు రజనీ కృతజ్ఞతలు**

ఈ వివాదం నడుమ తనకు మద్దతుగా నిలిచిన వివిధ పార్టీల నాయకులకు రజనీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్నేళ్లుగా రాజకీయాల్లోకి ఆయన ప్రవేశంపై విస్తృతంగా ఊహాగానాలు వినిపించినప్పటికీ, ఆరోగ్య సమస్యలు, కోవిడ్19 మహమ్మారిని కారణంగా చూపుతూ, 2020లో ఈ నటుడు రాజకీయ ప్రవేశం నుండి అధికారికంగా వైదొలిగారు.


**తమిళనాడులో సినిమా, రాజకీయాలు**

తమిళనాడు రాజకీయాల్లోకి ప్రవేశించిన తాజా తమిళ సూపర్‌స్టార్ విజయ్. అంతకుముందు, ఎం.జి. రామచంద్రన్ , జె. జయలలిత వంటి ప్రముఖులు రాష్ట్రంలో విశేషమైన రాజకీయ కెరీర్లను నిర్మించుకున్నారు.

కమల్ హాసన్‌తో సహా మరికొందరు పరిమిత రాజకీయ విజయాన్ని మాత్రమే సాధించగా, రజనీకాంత్ మాత్రం ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

## మొజ్తబా రష్యాలో చికిత్స పొందడంలేదు

**వుదయం డెస్క్, మార్చి 17:**



ఇరాన్ కొత్త సుప్రీం నాయకుడు అయతుల్లా మొజ్తబా ఖమేనీ మాస్కోలో వైద్య చికిత్స పొందుతున్నారని వచ్చిన మీడియా కథనాన్ని, రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలి ఖండించినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ తెలిపింది. గత నెలలో అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో తండ్రి మరణించగా, గాయపడిన 56 ఏళ్ల మజ్తాబాను రష్యా అధ్యక్షుడు వ్లాదమిర్ పుతిన్ వ్యక్తిగత ఆహ్వానం మేరకు చికిత్స కోసం మాస్కోకు తరలించినట్టు కువైట్ వార్తా పత్రిక అల్ జరీదా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే.


**ఐఆర్‌జిసిని తీవ్రవాద గ్రూపుగా ముద్ర వేసిన అల్బేనియా**

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో, అల్బేనియా మంగళవారం ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌స్‌ను ఉగ్రవాద సంస్థగా పేర్కొనడంతో పాటు, ఇరాన్‌ను ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశంగా అభివర్ణించింది. ప్రతిపక్షాలు బహిష్కరించినప్పటికీ, సోషలిస్ట్ నేతృత్వంలోని పార్లమెంట్ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. తమ పార్లమెంటరీ ఐటీ వ్యవస్థపై ఇటీవల జరిగిన ప్రయత్నంతో సహా, ఇరాన్‌తో సంబంధం ఉన్న సైబర్ దాడులను ఈ తీర్మానం ఖండించింది.

ప్రవాసంలో ఉన్న ఇరాన్ ప్రతిపక్ష బృందం ఎంఇకెకు చెందిన వేలాది మంది సభ్యులకు ఆశ్రయం కల్పిస్తున్న అల్బేనియా, 2022లో జరిగిన సైబర్ దాడి తర్వాత ఇరాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది.

నిరసనకారులపై ఇరాన్ చర్యలు, అణచివేతల కారణంగా రివల్యూషనరీ గార్డ్‌స్‌పై అమెరికా, యూరోపియన్ యూనియన్ కూడా ఇలాంటి ప్రకటనలే చేసిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు.

## బాగ్దాద్‌లోని అమెరికన్ ఎంబసీపై దాడి



**వుదయం డెస్క్, మార్చి 17 :**

మంగళవారం ఉదయం సహా ఈ వారంలో ఇరాక్‌పై వరుసదాడులు జరిగాయి. గత రాత్రి బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై డ్రోన్లు, రాకెట్లతో దాడులు జరిగాయి. ఈ దాడులు ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యంత తీవ్రమైన దాడి అని ఇరాక్ భద్రతా వర్గాలు ఎఎఫ్‌పి వార్తా సంస్థకు తెలిపాయి.ప్రభుత్వ భవనాలు, విదేశీ రాయబార కార్యాలయాలు ఉన్న బాగ్దాద్‌లోని అత్యంత కట్టుదిట్టమైన గ్రీన్ జోన్‌లో, ఒక విలాసవంతమైన హోటల్‌లో సోమవారం డ్రోన్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది.

మంగళవారం ఉదయం, గ్రీన్ జోన్లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం లక్ష్యంగా దాడి జరిగింది. మూడు డ్రోన్లు, నాలుగు రాకెట్లు రాయబార కార్యాలయంపై దాడి చేశాయని, వాటిలో కనీసం ఒక డ్రోన్ కార్యాలయం లోపలే కూలిపోయిందని ఒక భద్రతా అధికారి ఎఎఫ్‌పి వార్తా సంస్థకు తెలిపారు.

అమెరికా రాయబార కార్యాలయం వైపు కనీసం మూడు డ్రోన్లు ఎగురుతూ రావడం చూశామని ఒక సాక్షి రాయిటర్స్‌కు తెలిపారు. వాటిలో రెండింటిని కూల్చివేయగా, మూడవది రాయబార కార్యాలయ ఆవరణ లోపల దాడి చేసిందని రాయిటర్స్ నివేదించింది. దాడులు ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యంత తీవ్రమైన దాడి అని ఇరాకీ భద్రతా వర్గాలు ఏఎఫ్‌పీకి తెలిపాయి.

## అభ్యర్థుల జాబితాను ప్రకటించిన టిఎంసి గెలుపుపై మమత ధీమా

**కోల్‌కత, మార్చి 17 (వుదయం) :**



త్వరలో జరుగనున్న పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను టిఎంసి మంగళవారం ప్రకటించింది. టిఎంసి 294 స్థానాలకు గాను 291 స్థానాలలో పోటీ చేస్తుందని పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. కోల్‌కతలో ఒక విలేకరుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, డార్జిలింగ్ కొండ ప్రాంతంలోని మిగిలిన మూడు స్థానాల్లో అనిత్ థాపా నేతృత్వంలోని భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బిజిపిఎం) పోటీ చేస్తుందని బెనర్జీ తెలిపారు. అమె పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రతా బక్షితో కలిసి అభ్యర్థుల పేర్లను ప్రకటించారు.

2026 అసెంబ్లీ ఎన్నికలలో సౌకర్యవంతమైన మెజారిటీతో గెలిచి అధికారాన్ని నిలుపుకుంటామని మమత ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలలో మేం 226 స్థానాలకు పైగా గెలుచుకుంటామని ఆమె పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాలో చోటు దక్కని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వారికి పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో తగిన స్థానం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాలో ఎవరికైతే చోటు కల్పించలేకపోయామో, వారందరికీ పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో స్థానం కల్పిస్తాం, అని ఆమె అన్నారు.


ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీని లక్ష్యంగా చేసుకుంటూ, రాబోయే ఎన్నికల్లో ఆ కాషాయ పార్టీ బలం తగ్గుతుందని బెనర్జీ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ స్థానాల సంఖ్య తగ్గుతుంది. వారి ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం లభిస్తుంది, అని ఆమె అన్నారు. అభ్యర్థుల ప్రకటనతో పశ్చిమ బెంగాల్‌లో తీవ్రమైన ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది; ఇక్కడ టిఎంసి వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది.






## ఈ ఎన్నికలు రాజకీయ ఆవరణను మారుస్తాయా

**న్యూఢిల్లీ, మార్చి 17 (వుదయం డెస్క్):**



సోమవారం 37 రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు భారత రాజకీయాల్లో ఒక భారీ మార్పును తీసుకువచ్చాయి. బీహార్, హర్యానా, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో రాజకీయ సమీకరణాలు ఆకస్మికంగా మారిపోయాయి. క్రాస్‌ఓటింగ్, మారుతున్న కూటములు, ప్రతిపక్షంలోని బలహీనతలు ఎన్డీయేకి భారీ ప్రయోజనాన్ని చేకూర్చాయి. బిజెపితోపాటు, జెడి(యు) వంటి మిత్రపక్షాలు కూడా ఎగువ సభలో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నాయి.

**బీహార్‌లో...**

బీహార్‌లో పోటీ చాలా ఆసక్తికరంగా సాగింది. 202 మంది ఎమ్మెల్యేలతో ఉన్న ఎన్డీఏ నాలుగు సీట్లు గెలుచుకునే సునాయాస స్థితిలో ఉంది, కానీ ఐదవ సీటు కోసం దానికి మరో మూడు ఓట్లు అవసరమయ్యాయి. మరోవైపు, ప్రతిపక్ష కూటమి చిన్న పార్టీల సహాయంతో తమ స్థానాన్ని పదిలపరుచుకోవడానికి ప్రయత్నించింది.

అయితే, పోలింగ్ రోజున, ప్రతిపక్షానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనకపోవడంతో ఆ కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ గైర్హాజరు మొత్తం సమీకరణాన్ని మార్చివేసి, నేరుగా ఎన్డీఏకు ప్రయోజనం చేకూర్చింది.

**ఫలితాలను మార్చేసిన క్రాస్-ఓటింగ్**

ఈ ఎన్నికలలో క్రాస్‌ఓటింగ్ అతిపెద్ద అంశంగా నిలిచింది. బీహార్, హర్యానా, ఒడిశాలో పలువురు ఎమ్మెల్యేలు తమ పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో, ఊహించని ఫలితాలు వెలువడ్డాయి. కొన్ని సందర్భాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు అనుకూలంగా ఓటు వేయగా, మరికొన్నింటిలో ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం ఫలితాన్ని ప్రభావితం చేసింది. ఒడిశాలో 11 మంది ఎమ్మెల్యేల క్రాస్‌ఓటింగ్, 4 స్థానాలకు గాను 3 స్థానాలను బీజేపీ గెలుచుకోవడానికి దోహదపడింది. హర్యానాలో కూడా భారీగా క్రాస్‌ఓటింగ్ కనిపించినప్పటికీ, కాంగ్రెస్ రెండు స్థానాలకు గాను ఒక స్థానాన్ని గెలుచుకోగలిగింది.

**పాలక పక్షానికి, ప్రతిపక్షానికి సందేశం**

ఈ ఎన్నికలు ప్రతిపక్షంలోని ప్రధాన బలహీనతలను బయటపెట్టాయి. ఎమ్మెల్యేల మధ్య స్పష్టమైన ఐక్యత లోపించడంతో పాటు, వ్యూహాత్మక తప్పిదాలు కూడా జరిగాయి. సంఖ్యాబలం ఉన్నప్పటికీ, ప్రతిపక్షం తమ ఓట్లను సరిగ్గా నిర్వహించలేకపోయింది. క్రమశిక్షణారాహిత్యం నష్టాలకు కారణమైంది. క్రాస్‌ఓటింగ్, గైర్హాజరు పరిస్థితిని మరింత దిగజార్చాయి. మరోవైపు, అధికార ఎన్డీఏ బలమైన వ్యూహాన్ని, సమర్థవంతమైన ఓట్ల నిర్వహణను ప్రదర్శించింది. ఈ కూటమి తమ ఓట్లను కాపాడుకుంది, భాగస్వాముల మధ్య సమన్వయాన్ని కొనసాగించింది. ప్రతిపక్ష బలహీనతలను పూర్తిగా సద్వినియోగం చేసుకొని అదనపు సీట్లను గెలుచుకుంది.

**ఈ ఫలితాల తర్వాత ఏం మారనుంది?**

ఈ ఫలితాల తర్వాత, రాజ్యసభలో ఎన్డీఏ స్థానం చాలా బలోపేతమైంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, ఈ కూటమి ఇప్పుడు సుమారు 140 సీట్లను కలిగి ఉంది, ఇది మెజారిటీ మార్కు కంటే 17 సీట్లు ఎక్కువ. ఏఐఏడీఎంకే, జేడీ(యూ), ఎన్సీపీ, టీడీపీ, శివసేన వంటి మిత్రపక్షాల మద్దతుతో, బీజేపీ 106 సీట్లతో అతిపెద్ద వాటాను కలిగి ఉంది. ఈ ఆధిక్యత ప్రభుత్వ పనితీరుపై నేరుగా ప్రభావం చూపుతుంది. ప్రభుత్వం ప్రతిపక్షంపై తక్కువగా ఆధారపడటం వల్ల, రాజ్యసభలో బిల్లులను ఆమోదించడం ఇప్పుడు సులభతరం కావచ్చు. ఇది చట్టాల రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేసి, కీలక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో సహాయపడుతుంది.

అదే సమయంలో, ప్రతిపక్షాల సంఖ్య తగ్గడం వల్ల వారి పాత్ర పరిమితం కావచ్చు, అయినప్పటికీ చర్చలు, జవాబుదారీతనాన్ని కోరడం సహా ఇతర విషయాలలో వారి పాత్ర బలంగానే ఉంటుంది.

మొత్తమ్మీద, రాజ్యసభ ఎన్నికలు 2026 రాజకీయాల్లో కేవలం సంఖ్యాబలం మాత్రమే సరిపోదని చూపిస్తున్నాయి. విజయాన్ని నిర్ధారించడంలో వ్యూహం, క్రమశిక్షణ, సకాల నిర్ణయాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్డీఏ బలమైన స్థానం చట్టాల రూపకల్పనలో దానికి ఒక అంచును ఇస్తున్నప్పటికీ, ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని, సంస్థను రెండింటినీ బలోపేతం చేసుకోవాలని ఈ ఫలితాలు స్పష్టమైన సందేశాన్ని పంపుతున్నాయి.

**IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**OS.NO.630 OF 2026**

**Between:**
Biram Ramadevi & others ...Plaintiffs

**AND**

**The Tahsildar, Charminar Mandal & another ...Defendant**

**To,**
**All concerned ....Defendant No.2**

PLEASE TAKE NOTICE that the above said Plaintiff has filed the above suit for Declaration of Legal Heirs to declare the plaintiffs as the legal heirs of deceased **Late B. SRINIVAS** against you before the Hon'ble Court of II Junior civil judge court, city civil court, Hyderabad and this Hon'ble court has directed for service of Notice to you. The above case is posted for your appearance on 02-04-2026 at 10:30 AM either in person or through an Advocate, failing which the matter will be decided as per law.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**M. Rajender Reddy**
**V. Kodandaram**
**J Rajashekar yadav**
**Advocates**
**Office at Flat No.301, Elite Trehan Towers, Road:2, Hubsiguda, Hyderabad**
**Cell No. 8341760104**




ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు వీడియో సందేశం ద్వారా ఇరాన్ ప్రజలకు పర్షియన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నౌరోజ్ సెలవు దినాల సందర్భంగా ఆయన తన శుభకామనలు వ్యక్తం చేశారు. సాహస ఇరాన్ ప్రజలారా! వెలుగుల ఉత్సవం ప్రారంభం సందర్భంగా ప్రతి సంవత్సరం చెప్పేవిధంగానే మీకందరికి శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. నేటి (మార్చి 18న) ఇరాన్ దివ్వెల పండుగ చాహర్షాన్బే సూరిని ఆహ్లాదంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను. చీకటి మీద వెలుగు విజయం తథ్యమనే ఇరానియన్ల చిరకాల విశ్వాసం ఈ పండుగ ద్వారా వ్యక్తం అవుతుంది. ఈ యేడాది ఈ సెలవు దినానికి ప్రత్యేక ప్రాధాన్యముంది. మీ అందరి ఆశావహ భవిష్యత్తుకు ఇది సూచన. ముఖ్యంగా ఇరాన్ లోని ప్రస్తుత మత నాయకుల ఆధీనంలోని ఇస్లామిక్ రిపబ్లిక్ ను వ్యతిరేకిస్తున్న ప్రజలందరికీ మంచి జరగాలని, వారు ఆశిస్తున్న స్వేచ్ఛ వారికి లభించాలని ఆకాంక్షిస్తున్నాను.

– బెంజమిన్ నెతాన్యాహు, ఇజ్రాయెల్ ప్రధాని

## వే'మన'పద్యం

గంగిగోవుపాలు గంటెడైనను చాలు
కడివెడైననేల ఖరముపాలు
భక్తికలుగు కూడు పట్టెడైననుజాలు,
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# తమిళనాడు ఓటు రూటు!

వాస్తవానికి తమిళనాడు రెండు ప్రధాన రాజకీయపక్షాల రాష్ట్రం. డి ఎం కె, అఖిల భారత అన్నా డి ఎం కె ల మధ్యనే చిరకాలంగా అక్కడ రాజకీయ సమరం సాగింది. జయలలిత ఉన్నంతవరకూ ఆమె సారథ్యంలో ఎ ఐ ఎ డి ఎం కె పార్టీ అనూహ్య విజయాలు సాధించింది. పార్టీ మూలంలోని .ద్రావిడ సిద్ధాంతం నుంచి అప్పుడప్పుడూ పక్కకు జరిగినప్పటికీ ఆమె నాయకత్వాన్ని తమిళ ప్రజలు నెత్తిన పెట్టుకుంటూ వచ్చారు. అయితే ఆమె నిష్క్రమణ తర్వాత కేంద్ర అధికారపక్షం బిజెపి అండతో కొంత కాలం ఎ ఐ ఎ డి ఎం కె వెలిగినప్పటికీ అంతర్గత కలహాలతో ఆ పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. ఎ ఐ ఎ డి ఎం కె ని అడ్డం పెట్టుకొని బిజెపి తమిళనాడు ను పరోక్షంగా పాలించినా ఆ రాష్ట్రంపై అది ఆశించిన పట్టును సాధించు కోలేకపోయింది. అందుచేత ఇప్పటికీ పాలక డి ఎం కె పార్టీ యే ఎక్కువ ప్రజాదరణను పొందుతున్నట్టు సమాచారం. అయితే నటుడు విజయ్ నాయకత్వంలో అవతరించిన టి వి కె ( తమిళగ వేత్రి కజగం )పార్టీ కొత్త సవాలుగా బరిలో ప్రవేశించింది. జెన్ జీ మాదిరిగా ఈ పార్టీ బలమైన యువ శక్తి పార్టీగా అవతరించి డి ఎం కె ని బలహీనపరుస్తుందో లేదో చూడాలి. 234 స్థానాలున్న తమిళనాడు శాసనసభలో గత ఎన్నికల్లో డి ఎం కె 133,ఎ ఐ ఎ డి ఎం కె 60 స్థానాలు గెలుచుకున్నాయి. టి వి కె కారణంగా ఈ సారి ప్రధాన పక్షాల బలాలు తీవ్రంగా ప్రభావితం కావొచ్చు.కాంగ్రెస్ పార్టీతో పొత్తు చర్చలు ఫలించడం డి ఎం కి మేలైన పరిణామం. అలాగే స్టాలిన్ ప్రభుత్వం తన ద్రావిడ రాజకీయాల మూలాలను కాపాడుకుంటూ వస్తున్నది. దాని సంక్షేమ చర్యలు ప్రజలను ఆకట్టుకున్నాయని చెబుతున్నారు. తండ్రి కరుణానిధి స్థాయిలో కాకపోయినా ఆయన మాదిరిగానే పార్టీ కి గట్టి దిశానిర్దేశకుడుగా స్టాలిన్ పేరు గడించుకున్నాడు. అందుచేత తమిళనాడు ఎన్నికలు ఆసక్తికరంగా ఉండబోతున్నాయని భావించవచ్చు.


## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# ఇరాన్ యుద్ధంపై నిస్తేజంగా భారత్

జనవరి 1, 2026న పెరుగుతున్న శక్తివంతమైన బ్రిక్స్ అధ్యక్షతన బాధ్యతలు స్వీకరించిన భారతదేశపు సామర్థ్యాలు, అమెరికా-ఇజ్రాయెల్ కూటమి ఇరాన్ పై ఏకపక్షంగా యుద్ధానికి దిగడం, అంతుకు ప్రతిగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై విరుచుకు పడటంతో ఎదురయ్యే సవాళ్లు మొత్తం ఆ ప్రాంతాన్ని అగ్నిమయ యుద్ధభూమిగా మార్చింది. రూపాయి విలువ పడిపోయిన సమయంలో, ముడి చమురు ధర దాదాపు రోజువారీగా కొత్త ఎత్తులకు చేరుకుంటున్న సమయంలో ఇది జరుగుతోంది. ప్రపంచ చమురు ధరలకు అత్యంత ముఖ్యమైన బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు $106 వద్ద గరిష్ట స్థాయికి చేరుకుంది. అయినప్పటికీ ఫిబ్రవరి 28 నుండి ప్రపంచ చమురు ధరలు 40 శాతానికి పైగా పెరిగాయి. పశ్చిమ ఆసియా భారతీయులకు, సంపన్నులు, అంతగా ధనవంతులు కాని వారికి చాలా ఆశాజనకంగా ఉందనే వాస్తవం దీనికి తోడవుతుంది. పైగా, ఎక్కువగా గణనీయమైన చెల్లింపులను స్వదేశానికి పంపే కార్మిక శక్తిని కలిగి ఉంటుంది. ఈ పరిస్థితి మరికొన్ని నెలలు కొనసాగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమన ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని, కరోనా మహమ్మారి దారితీసిన మాంద్యానికి భారతదేశం పెద్దగా భిన్నంగా లేని మాంద్యాన్ని చూస్తుండవచ్చని స్పష్టంగా తెలుస్తోంది. ఈ మొతం ప్రక్రియలో భారతదేశం వ్యూహాత్మకంగా మౌనంగా ఉండాల్సి రావడం ఆందోళన కావిస్తున్నది. భారత్ సైనికంగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్న 1980, 1990 దశకాలలోనే అంతర్జాతీయ వ్యవహారాలలో గుర్తింపు పొందగల్గింది. కానీ ఇప్పుడు నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, నాల్గవ రక్షణ వ్యవస్థ కలిగిన బలమైన దేశంగా ఉండికూడా క్రియాశీలక పాత్ర వహింపలేకపోవడం, బ్రిక్స్ అధ్యక్ష హోదాలో స్పందించక పోవడం భారత్ ఇరకాటాన్ని వెల్లడి చేస్తుంది. ఇరాన్ యుద్ధంపై బ్రిక్స్ ఏకాభిప్రాయం సాధించలేకపోయింది. సంయుక్త ప్రకటనను విడుదల చేయడంలో విఫలమైంది. కొన్ని సభ్య దేశాలు యుద్ధంలో భాగస్వాములైనందునే బ్రిక్స్ ఉమ్మడి వైఖరిని తీసుకోలేకపోయిందని భారత్ విదేశాంగ శాఖ తెలిపింది. సభ్య దేశాలతో సంప్రదింపులు జరుపుతామని చెప్పింది. ఈ పరిస్థితులు అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్ ను ఇరకాటంలోకి నెట్టేస్తున్నాయి. "కొన్ని సభ్య దేశాలు పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిలో భాగస్వాములుగా ఉన్నాయి. అందుకే ప్రస్తుత ఘర్షణపై అవి ఒక ఉమ్మడి వైఖరిని తీసుకోలేకపోతున్నాయి. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న దేశంగా షెర్పా ఛానల్ ద్వారా సభ్య దేశాలతో భారత్ చర్చలు జరుపుతోంది" అని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ విలేకరులకు తెలియజేశారు. యుద్ధంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధమున్న ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇలు బ్రిక్స్‌లో అదనపు సభ్యులుగా కొనసాగుతున్నాయి. ఈ నెల 12న బ్రిక్స్ షెర్పా సమావేశం వర్చువల్‌గా జరిగినప్పటికీ వేర్వేరు వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్న కారణంగా సభ్య దేశాలు ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్ ప్రస్తుత ఘర్షణపై సంయుక్త ప్రకటనను విడుదల చేయలేకపోయింది. గత సంవత్సరం జూన్‌లో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య 12 రోజుల యుద్ధం ప్రారంభమైనప్పుడు, బ్రెజిల్ అధ్యక్షత వహించిన బ్రిక్స్, ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు "అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం" అని వెంటనే స్పష్టమైన పదజాలంతో ఖండించింది. అయితే, డిసెంబర్ 2025లో బ్రిక్స్ అధ్యక్ష పదవి భారతదేశానికి మారినప్పటి నుండి, న్యూఢిల్లీ సొంత ప్రయోజనాలు బ్రిక్స్ లక్ష్యాలను అధిగమిస్తున్నట్లు కనిపిస్తున్నాయని విమర్శకులు అంటున్నారు, భారతదేశం ఇజ్రాయెల్, అమెరికాలతో సన్నిహిత సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా బ్రిక్స్ ఉద్దేశ్యాలకు విఘాతం కలిగిస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యులలో, భారతదేశం మాత్రమే ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను పూర్తిగా ఖండించలేదు. బ్రిక్స్ భారత అధ్యక్షతన బ్రిక్స్ యుద్ధంపై అసాధారణంగా మౌనంగా ఉంది. ఇటీవలి సంవత్సరాలలో, భద్రతా సమస్యలను కూడా చేర్చడానికి సంస్థ తన పరిధిని విస్తరించింది. సభ్యులు ఉమ్మడి సైనిక విన్యాసాలను నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం జనవరిలో దక్షిణాఫ్రికా నిర్వహించిందగా, భారతదేశం పాల్గొనలేదు. అందుకు తోడుగా ఇప్పుడు భారత్ ఉమ్మడి ప్రకటన విషయంలో విజయం సాధింపలేకపోవడం బ్రిక్స్ ను బలహీనపరిచే సంకేతాలను పంపుతున్నట్లు పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనాలు వ్యవస్థాపక సభ్యులుగా 2009లో 'బ్రిక్' ప్రారంభమైంది. 2010లో దక్షిణాఫ్రికా ఇందులో చేరడంతో ఇది 'బ్రిక్స్'గా రూపుదిద్దుకుంది. ముఖ్యంగా, 2024లో



భారత్ చొరవతో ఇరాన్ ఈ కూటమిలో చేరింది. ప్రస్తుతం, ఈ కూటమిలో 10 పూర్తి స్థాయి సభ్య దేశాలు ఉన్నాయి. ఇవి ప్రపంచ జనాభాలో 54.6 శాతాన్ని, ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో (జిడిపి) 42.2 శాతాన్ని (పిపిపి ప్రాతిపదికన) కలిగి ఉన్నాయి. అమెరికా వ్యతిరేక వేదికగా ఈ కూటమిపై దృక్పథం పెరుగుతున్నప్పటికీ, డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించే దిశగా చైనా, రష్యా, ఇరాన్ వంటి ఇతర దేశాలు ఆసక్తి చూపినప్పుడు, భారత దేశం ఓ స్పష్టమైన విధానం అనుసరింపలేక పోతుంది. పెట్రో-డాలర్ ఆధిపత్యాన్ని బద్దలు కొట్టడమే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. మరోవంక, బ్రిక్స్ దేశాల మధ్య డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం ద్వారా పరోక్షంగా డాలర్ ఆధిపత్యం కట్టడి చేసేందుకు భారత్ కీలకమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. అటువంటి కీలక సమయంలో ఇరాన్ అంశంపై బ్రిక్స్ లో ప్రతిష్టంభన ఏర్పడటం భారత్ అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రతికూలతకు దారితీసే అవకాశం ఉంది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష హోదాలో పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న వివాదంపై సమిష్టి ప్రకటన విడుదల చేయలేకపోవడంను భారత ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొంటూ కాంగ్రెస్ తీవ్ర దాడి చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డోనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహులతో సన్నిహిత సంబంధాలను కొనసాగించే ప్రయత్నంలో ఫోరమ్ స్థాయిని దెబ్బతీస్తున్నారని ఆరోపించింది. "ఇప్పటివరకు ఇరాన్‌లో అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులు, లక్ష్యంగా చేసుకున్న హత్యలపై, అలాగే గల్ఫ్ దేశాలోని సైనికేతర లక్ష్యాలపై ఇరాన్ ఆ తర్వాత చేసిన దాడులపై, శ్రీలంక, భారతదేశం రెండింటికీ దగ్గరగా హిందూ మహాసముద్రంలో అమెరికా నావికాదళం దిగ్భ్రాంతికరమైన చర్యపై సమిష్టి ప్రకటన విడుదల చేయడానికి ధైర్యం లేదా ఉత్సాహాన్ని కూడగట్టుకోలేదు" అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ధ్వజమెత్తారు.

బ్రిక్స్ అధ్యక్ష హోదాలో సభ్యదేశమైన ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖమేనీ హత్య విషయంలో సహితం భారత్ వెంటనే స్పందించకపోవడం కూడా ఈ సందర్భంగా విమర్శలు ఎదుర్కొంటోంది. టెహ్రాన్‌పై జరిగిన మొదటి దాడుల్లో ఖమేనీ, ఇరాన్‌లోని పలువురు సీనియర్ సైనిక అధికారులు మరణించిన మూడు రోజుల తర్వాత, భారత్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో "వివాదానికి ముందస్తు ముగింపు" కోసం జాగ్రత్తగా పిలుపునిచ్చింది."సంభాషణలు, దౌత్యం కోసం భారత దేశం తన పిలుపును గట్టిగా పునరుద్ఘాటిస్తుంది. సంఘర్షణకు ముందస్తు ముగింపుకు అనుకూలంగా మేము స్పష్టంగా మా స్వరాన్ని పంచుకుంటాము" అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. యుద్ధం ప్రాంతీయ స్థిరత్వాన్ని, గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న, పనిచేస్తున్న వేలాది మంది భారతీయ పౌరుల భద్రతను ప్రమాదంలో పడేసిందని కూడా మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా గల్ఫ్ దేశాలతో మాట్లాడారు. ఇరాన్ గురించి ప్రస్తావించకుండా వారి భూభాగాలపై ప్రతీకార దాడులను మాత్రమే విమర్శించారు. ఆ తర్వాత ఇరాన్ అధ్యక్షునితో కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్ పై యుద్ధం ప్రారంభానికి రెండు రోజుల ముందు ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో ఉండటం, ఇజ్రాయిల్ పార్లమెంట్ లో కేవలం ఆయన కోసమే ఓ కొత్త మెడల్ సృష్టించి బహుకరించడం ఈ సందర్భంగా పలు అనుమానాలకు ఆస్కారం ఇస్తున్నది. బ్రిక్స్ అధ్యక్షుని హోదాలో ప్రధాని మోదీ సభ్యదేశాల అధినేతలతో పశ్చిమాసియా ఘర్షణలపై మాట్లాడి, ఓ ఏకాభిప్రాయ సాధనకు ఓ ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించడం గాని లేదా వెంటనే కాల్పుల విరమణకు బ్రిక్స్ పక్షాన పిలుపు ఇవ్వడం గాని చేసి ఉండినట్లయితే అంతర్జాతీయంగా భారత్ స్వరంకు ఓ విలువ ఏర్పడి ఉండెడిది. గత ఏడాది కాలంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరచుగా భారత్ ను చులకన చేస్తూ, భారత్ నాయకత్వాన్ని అవమానపరుస్తూ మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కాల్పుల విరమణ నుండి భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం వరకు ఏకపక్ష ప్రకటనలు చేస్తూ భారత్ నాయకత్వాన్ని ఇరకాటంలోకి నెట్టివేస్తున్నారు. ముఖ్యంగా రష్యా నుండి ఆయిల్ కొనుగోలు విషయంలో భారత్ ను కట్టడి చేసే ప్రయత్నాలను బహిరంగంగానే చేస్తున్నారు. ఇరాన్ పై దాడి విషయంలో బ్రిక్స్ అధ్యక్ష హోదాలో అయినా భారత్ స్పష్టమైన వైఖరి తీసుకొని ఉంటె అమెరికాకు ఓ గుణపాఠం చెప్పిన్నట్లాయెడిది. అంతేకాదు ప్రస్తుత అయోమయ అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ నిజంగా 'విశ్వగురు'గా ఓ గుర్తింపు పొందే అవకాశం కలిగేది.



చలసాని నరేంద్ర
9849569050

# రైతుకు సూర్యుడే శరణ్యం

భారత వ్యవసాయం వాతావరణ మార్పు ప్రభావాన్ని అత్యంత తీవ్రంగా అనుభవిస్తున్న రంగం. గత దశాబ్దంలో వర్షపాతం అస్థిరత, భూగర్భ జలాల అధిక వినియోగం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కలిసి గ్రామీణ వ్యవసాయాన్ని కొత్త సంక్షోభం వైపు నెట్టుతున్నాయి. ముఖ్యంగా వేసవి కాలం రైతులకు కేవలం ఋతువు మాత్రమే కాదు.. నీటి కోసం పోరాటం చేసే కాలం. బోర్‌వెల్‌లు ఎండిపోవడం, విద్యుత్ సరఫరా లోపించడం, డీజిల్ ఖర్చులు పెరగడ.. ఇవన్నీ కలిసి రైతు ఆదాయాన్ని మింగేస్తున్నాయి.

*ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగం ముందున్న పెద్ద ప్రశ్న "భవిష్యత్ సాగునీరు ఎలా?" ఈ ప్రశ్నకు సాంకేతికత సూచిస్తున్న ఒక స్పష్టమైన సమాధానం ఉంది: సోలార్ పంప్ సెట్లు.*

**వేసవి కాలం: రైతుకు అత్యంత కఠిన పరీక్ష**

భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వ్యవసాయం ఇప్పటికీ వర్షాధారంగా కొనసాగుతోంది. వర్షాలు తగ్గిపోతే భూగర్భ జలాలపై ఆధారపడాల్సి వస్తుంది. కానీ గత కొన్ని సంవత్సరాల్లో బోర్‌వెల్‌లు మరింత లోతుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు 150–200 అడుగుల్లో దొరికే నీరు ఇప్పుడు 500 అడుగుల లోతులో కూడా దొరకని పరిస్థితి చాలా ప్రాంతాల్లో కనిపిస్తోంది. విద్యుత్ సరఫరా కూడా మరో పెద్ద సమస్య. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ ఎక్కువగా రాత్రి సమయంలో ఉంటుంది. రైతులు అర్ధరాత్రి పొలాలకు వెళ్లి మోటార్లు ఆన్ చేయాల్సి వస్తుంది. ఇది కేవలం కష్టమే కాదు.. ప్రమాదకరమైన పరిస్థితి కూడా. ఇక డీజిల్ మోటార్లపై ఆధారపడే రైతుల పరిస్థితి మరింత క్లిష్టం. పెరుగుతున్న ఇంధన ధరలు రైతు ఆదాయాన్ని నేరుగా తినేస్తున్నాయి. పంటకు వచ్చే లాభం కంటే సాగునీటి ఖర్చే ఎక్కువగా మారుతున్న ఉదాహరణలు పెరుగుతున్నాయి.

**సోలార్ మోటార్లు: రైతు వ్యవసాయానికి కొత్త దిశ**

ఇలాంటి పరిస్థితుల్లో సోలార్ పంప్ సెట్లు వ్యవసాయ రంగంలో ఒక కీలక మార్పును సూచిస్తున్నాయి. సూర్యకాంతిని విద్యుత్తుగా మార్చి నీటిని పంపింగ్ చేసే ఈ వ్యవస్థ రైతును విద్యుత్ లేదా డీజిల్‌పై ఆధారపడకుండా చేస్తుంది. సోలార్ మోటార్లతో రైతు పగటి సమయంలోనే నీటిని పంపింగ్ చేసుకోవచ్చు. విద్యుత్ సరఫరా కోసం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ఒకసారి వ్యవస్థను ఏర్పాటు చేస్తే సంవత్సరాల పాటు తక్కువ నిర్వహణతో పనిచేస్తుంది. దీని వల్ల రైతు సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ఇది కేవలం సాగునీటి పరిష్కారం మాత్రమే కాదు; గ్రామీణ శక్తి స్వావలంబనకు కూడా మార్గం. కొన్నిచోట్ల అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును విద్యుత్ సంస్థ లకు విక్రయించే అవకాశాలు కూడా పరిశీలిస్తున్నారు. అంటే రైతు ఇక కేవలం పంటలే కాదు.. విద్యుత్ ఉత్పత్తిదారుడిగా కూడా మారే అవకాశం ఉంది.



**పర్యావరణానికి పెద్ద లాభం..** సోలార్ మోటార్ల వినియోగం పెరగడం పర్యావరణ పరంగా కూడా అత్యంత కీలకం. డీజిల్ మోటార్లు గాలి కాలుష్యానికి ప్రధాన కారణాలలో ఒకటి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సౌరశక్తి వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు సమస్య తీవ్రమవుతున్న సమయంలో వ్యవసాయ రంగాన్ని పునరుత్పాదక శక్తితో అనుసంధానించడం అనివార్యంగా మారింది. సోలార్ వ్యవసాయం ఈ దిశగా ఒక పెద్ద అడుగు. అంతే కాదు, సూర్యశక్తి ఉపయోగం పెరగడం వల్ల ఫాసిల్ ఫ్యూయల్స్‌పై ఆధారపడటం తగ్గుతుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా దీర్ఘకాలిక లాభాలను అందిస్తుంది.

**ప్రభుత్వ ప్రోత్సాహం..**సోలార్ పంప్ సెట్ల వినియోగాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (PM-KUSUM) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రైతులకు సోలార్ పంప్ సెట్లపై భారీ సబ్సిడీలు అందిస్తున్నారు. సాధారణంగా ఈ పథకం ప్రకారం మొత్తం ఖర్చులో సుమారు 60 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీగా అందిస్తాయి. బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయి. రైతు చెల్లించాల్సిన భాగం తక్కువగా ఉంటుంది. దీని వల్ల చిన్న, మధ్య తరగతి రైతులు కూడా సోలార్ టెక్నాలజీని స్వీకరించే అవకాశం పెరుగుతోంది.

**వ్యవసాయం ముందున్న మార్గం..** భారత వ్యవసాయం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. వాతావరణ మార్పు ప్రభావం, నీటి కొరత, పెరుగుతున్న ఇంధన ఖర్చులు – ఇవన్నీ కలిసి సంప్రదాయ సాగు విధానాలను సవాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక పరిష్కారాలను స్వీకరించడం తప్ప మరో మార్గం లేదు. సోలార్ మోటార్లు రైతుకు కేవలం ఒక పరికరం కాదు; నీటి భద్రత, విద్యుత్ స్వావలంబన, పర్యావరణ రక్షణ – ఈ మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించే పరిష్కారం. భారతదేశంలో వ్యవసాయం సూర్యుడి చుట్టూ తిరిగే వ్యవస్థే. విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు ప్రతి దశలో సూర్యకాంతి కీలకం. ఇప్పుడు అదే సూర్యకాంతి రైతుకు సాగునీటి శక్తిగా మారుతోంది. వాతావరణ సంక్షోభం తీవ్రంగా మారుతున్న ఈ కాలంలో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. భవిష్యత్ వ్యవసాయం నీటి మీద మాత్రమే కాదు... సూర్యశక్తి మీద కూడా ఆధారపడబోతోంది. రైతు పొలంలో మోటార్ తిరిగే శబ్దం వినిపించాలంటే ఇక విద్యుత్ లైన్ల కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండకపోవచ్చు. సూర్యుడు ఉదయిస్తే చాలు... నీళ్లు కూడా వస్తాయి.



శ్యాంమోహన్
9440595858

# ఒక యుగాంతపు అంతర్మథనం!


భారతదేశ అంతర్గత భద్రతను దశాబ్దాల పాటు శాసించిన ఒక సాయుధ పోరాటం నేడు ముగింపు అంచున నిలబడి ఉంది. ఇంకా చెప్పాలంటే దాదాపుగా ముగిసిందనే చెప్పాలి. అడవుల నుండి వినిపించిన గెరిల్లా గర్జనలు ఇప్పుడు మీడియా చర్చల రూపంలో, నాయకుల మధ్య ఆరోపణల పర్వంగా మారి బహిరంగ వేదికల మీదకు రావడం ఒక యుగాంతాన్ని సూచిస్తోంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలోని అగ్ర నేత దేవ్ జీ ఇటీవలి ఇంటర్వ్యూ, ఆ పార్టీలోని అంతర్గత వైరుధ్యాలను మాత్రమే కాదు, ఒక సిద్ధాంతం తన ఉనికి కోసం పడుతున్న వేదనను కూడా బయటపెట్టింది. అయితే, ఈ 'అంతర్మథనం'లో గెలుపోటముల కంటే, ఈ నాయకుల అడుగులు సమాజంపై చూపే ప్రభావమే ఇప్పుడు చర్చనీయాంశం. ఒకరకంగా భారతదేశ సాయుధ విప్లవోద్యమ చరిత్రలో నేడు ఒక వింతైన, కలవరపెట్టే దృశ్యం ఆవిష్కృతమవుతోందని, దశాబ్దాల పాటు 'క్రమశిక్షణ'కు మారుపేరుగా, రహస్య కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఒక శక్తివంతమైన పార్టీగా చెప్పుకునే పార్టీ నేడు టీవీ కెమెరాల ముందు తన అంతర్గత కలహాలను వీధిన పెట్టుకుంటోందని, ఆ పార్టీలోని చీలికను బహిర్గతం చేయడమే కాకుండా, సాయుధ పోరాటం ఏ తీరానికి చేరుకుందో స్పష్టం చేస్తోంది. అయితే, ఒక పరిశీలకుడిగా మనం సోను లేదా దేవ్ జీ ల పక్షం వహించకుండా, ఈ మొత్తం వ్యవహారాన్ని సమీక్షించడమే ఇక్కడ చేసే ప్రయత్నం.



అయితే మావోయిస్టు ఉద్యమ చరిత్రలో చీలికలు కొత్తేమీ కాదు, కానీ ప్రస్తుత ఘర్షణలో సిద్ధాంతం కంటే 'వ్యక్తిగత అస్తిత్వమే' ఎక్కువగా కనిపిస్తోంది. ఒకవైపు మల్లోజుల వేణుగోపాల్ (సోను), ఆశన్న వర్గం వందల సంఖ్యలో క్యాడర్‌తో బయటకు రావడం ఒక వాస్తవిక నిర్ణయంగా కనిపిస్తుంటే, దేవ్ జీ దీనిని 'ద్రోహం'గా అభివర్ణించడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక్కడ ప్రశ్న ఎవరిది ద్రోహం అని కాదు.. దశాబ్దాల పాటు ప్రజల కోసం అని చెప్పిన పోరాటం, చివరకు నాయకుల మధ్య 'ఎవరు స్వచ్ఛమైన విప్లవకారుడు..?' అనే పోరుగా ఎందుకు మారింది..? అనేదే ప్రశ్న.

ఈ మొత్తం చర్చలో అత్యంత ఆందోళనకరమైన బాధ్యతారాహిత్యమైన అంశం 'అర్బన్ నక్సల్స్' ప్రస్తావన. దేవ్ జీ వంటి అగ్రనేతలు 'లీగల్' రాజకీయాల గురించి మాట్లాడటం ఇప్పటికే 'అర్బన్ నక్సల్స్' ముద్రతో జైళ్లలో మగ్గుతున్న, లేదా ఆ కేసుల వల్ల కోర్టుల చుట్టూ తిరుగుతున్న పౌర హక్కుల నేతలను, మేధావులను, ప్రజాసంఘాల ప్రతినిధులను, జర్నలిస్టులను మరింత ప్రమాదంలోకి నెట్టేలా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు సాగుతున్న వారిపై నిఘా పెరిగేలా చేస్తున్నట్లుగా వ్యవహారం సాగుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. నిజానికి, ఈ అగ్రనేతల అడుగులు వారిని నమ్మి అడవికి వెళ్ళిన అమాయక క్యాడర్‌ను గానీ, లేదా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల కోసం పోరాడే వారిని గానీ కాపాడేలా ఉండాలి. వారి సిద్ధాంత ప్రభావంతో, లేదా ఆ సిద్ధాంతాన్ని ఆపాదించి నిందించి ముద్రవేసి అరెస్టులు చేయబడిన సామాన్యులు, విద్యావంతులు, జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మాత్రం చట్టపరమైన ఊబిలో ఉండిపోవడాన్ని కూడా మరువొద్దు. ఈ స్థితిలో తమ ఉనికిని చాటుకునే క్రమంలో వ్యవస్థను మరింత కఠినతరం చేసి, అన్యాయంగా ముద్రలు పడ్డ వారిని ఇబ్బందుల్లోకి నెట్టేసే విధంగా ఉండకూడదు.

నేడు ప్రధాన స్రవంతిలోకి వచ్చిన సోను, దేవ్ జీ వంటి నేతలు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే పరిస్థితి పెరిగడం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. వారు అడవిలో ఉన్నప్పుడు పాటించిన 'సమిష్టి నాయకత్వం' అనే సూత్రాన్ని ఇప్పుడూ పాటించకపోవడాన్ని ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలో వారే పరిశీలించుకోవాలి. లొంగుబాటు లేదా పంథా మార్పు అనేది కేవలం వ్యక్తిగత భద్రతకు పరిమితం కాకూడదు.నేతల మధ్య ఒక ఐక్య అవగాహన ఉంటేనే, ఇంకా అడవిలో ఉన్న ఆ పార్టీకి చెందిన 'మావో'లకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుంది. విడివిడి గ్రూపులుగా విడిపోయి ఉండటం కంటే ఒక సమూహంగా ప్రభుత్వంతో చర్చలు జరిపి, తమను నమ్మిన వారికి సామాజిక, రాజకీయ పునరావాసం కల్పించడంలో వీరు బాధ్యత వహించాలి. ఐక్యత లేని ఈ నాయకత్వం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న వారికి అభద్రత పెరుగుతుందే తప్ప శాంతి లభించదు అనే అంశాన్ని గమనించాలి. ఇక్కడ శాంతి అనేది కేవలం ఆయుధాలు కింద పెట్టడం వల్ల రాదు. దశాబ్దాల పాటు జరిగిన హింసకు బాధ్యత వహించడం, బాధితులకు న్యాయం చేయడం, రాజ్యాంగ విలువలకు నిజాయితీగా తలవంచడం ద్వారానే వస్తుంది. చివరిగా 'ఒక యుగాంతపు అంతర్మథనం' అంటే కేవలం ఒక ఉద్యమం ముగియడం మాత్రమే కాదు. ఆ ఉద్యమం విడిచిపెట్టిన గాయాలకు చికిత్స చేయడం కూడా. తమ వాయిస్, తమ అభిప్రాయాలు ప్రజలకు తెలియపరుచడం కోసం మీడియా చర్చలు అవసరమే కానీ సోను లేదా దేవ్ జీ మధ్య జరుగుతున్న, లేదా అగ్ర నేతల మధ్య జరుగుతున్న మీడియా చర్చల వాదనల ఆరోపణల ప్రక్రియతో ముందే చెప్పినట్లుగా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదు. నాయకులు తమ వ్యక్తిగత ఇగోలను పక్కనపెట్టి, ఒక ఐక్య అవగాహనతో ప్రజల పక్షాన, రాజ్యాంగ బద్ధంగా నిలబడాలి. ప్రభుత్వం కూడా వీరిని రాజకీయ పావులుగా వాడుకోకుండా, దశాబ్దాల హింసలో నలిగిపోయిన ఆదివాసీలకు, బాధితులకు నిజమైన న్యాయం చేయాలి. అప్పుడే ఈ సుదీర్ఘ పోరాట ముగింపునకు ఒక అర్థవంతమైన ముగింపు అవుతుంది.



రాజేందర్ దామెర

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు



## సహజ వ్యవసాయం రైతులకు లాభం

**జిల్లా కలెక్టర్ సత్య శారద**

**వరంగల్, మార్చి 17 (వుదయం జిల్లా ప్రతినిధి)** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సంపేట మండలం రాజుపేట గ్రామంలోని రైతు వేదికలో సహజ వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్)పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై రైతులనుద్దేశించి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు అవగాహన, శిక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు.సహజ వ్యవసాయం ద్వారా పంటల ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు భూమి సారాన్ని సంరక్షించుకోవచ్చని తెలిపారు.ఎక్కువగా పురుగు మందులు ఎరువులు వాడడం వల్ల ఆరోగ్య సమస్యలకు వస్తున్నాయని, వాటి నివారణకు పురుగు మందులు లేని నాణ్యమైన ఆహారం అవసరమని తెలియజేశారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పెంచవచ్చని రైతులకు సూచించారు.అనంతరం రైతులకు సహజ వ్యవసాయం కోసం అవసరమైన నేచురల్ ఫార్మింగ్ కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జెడి అగ్రికల్చర్ అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ రావు, నర్సంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు దామోదర్ రెడ్డి , వ్యవసాయ అధికారి కృష్ణ,
నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మోడల్ కాలనీ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట మార్చి 17(వుదయం)**

హుజూర్నగర్ మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.
మంగళవారం ఆయన 110 ఎకరాలలో నిర్మాణంలో ఉన్న 2,160 ఇండ్ల కాలనీని పరిశీలించారు. అంతర్గత రహదారులు, సభాస్థలి, హెలిప్యాడ్ స్థలం, మొక్కల నాటకం వంటి పనులను సమీక్షించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.త్వరలో ఈ మోడల్ కాలనీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.లబ్ధిదారుల ఎంపికలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని, అర్హులైన వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఎంపిక ప్రక్రియ జరగాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.



## బత్తాయి సీజన్‌కు మార్కెట్ సిద్ధం చేయాలి: కలెక్టర్

**నల్గొండ,మార్చి 17 (వుదయం ప్రతినిధి):**

రానున్న బత్తాయి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎస్ఎల్బీసీ వద్ద ఉన్న బత్తాయి మార్కెట్‌ను పూర్తిగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఉద్యాన మరియు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బత్తాయి మార్కెట్‌పై ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో బత్తాయి పంట విస్తీర్ణం, ఉత్పత్తి, దిగుబడులు, సాగు చేస్తున్న రైతులు, కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఇటీవల కొండమల్లేపల్లిలో నిర్వహించిన బత్తాయి రైతుల సమావేశంలో రైతులు వ్యక్తం చేసిన సమస్యలను ప్రస్తావిస్తూ, జిల్లా కేంద్రంలోని బత్తాయి మార్కెట్ రైతులకు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల వ్యాపారులు రైతులను మోసం చేస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.
ఏప్రిల్ 1 నుండి బత్తాయి రైతులు ట్రేడింగ్ లైసెన్స్ తీసుకునేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో బత్తాయిని జిల్లాలోనే కొనుగోలు చేసేలా మార్కెట్‌ను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.అలాగే రైతు ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పీఓలు) చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు మరియు కొనుగోలు పరికరాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రైతులు ట్రేడింగ్ లైసెన్స్ ఉన్నవారికే బత్తాయి అమ్మేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే మెరుగైన రకాల బత్తాయి సాగు చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, ట్రేడర్ అబిద్ అలీ, ఎఫ్‌పీఓ ప్రతినిధి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సూర్య గ్యాస్ ఏజెన్సీని తనిఖీ

**అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చ్ 17 (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రికొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వేణుగోపాల్ మంగళవారం సుజాత నగర్‌లోని ఎంఎస్ సూర్య గ్యాస్ ఏజెన్సీ గోదాం, కార్యాలయంను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో ఉన్న ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బుకింగ్, పంపిణీ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు.తనిఖీ అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎల్పీజీ రీఫిల్ సిలిండర్లను సీనియారిటీ క్రమంలోనే పారదర్శకంగా అందజేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగకూడదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. గ్యాస్ సరఫరాలో ఆలస్యం, అక్రమాలు, ఫిర్యాదులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో సంబంధిత విభాగాల అధికారులు, ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

**జనగామ, మార్చి 1 (వుదయం ప్రతినిధి) :**



ప్రభుత్వ అధికారులు తమ బాధ్యతలను విస్మరించకుండా, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం రోజున కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌తో కలిసి రెవెన్యూ అంశాలు, జిల్లా స్థాయి గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కమిటీ (DLEMC)పై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ పనుల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూకు సంబంధించిన ఏ అంశాన్ని కూడా పెండింగ్‌లో పెట్టకూడదని, నిర్దేశిత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు సకాలంలో పూర్తయితేనే ప్రజలకు సత్ఫలితాలు అందుతాయని ఆయన పేర్కొన్నారు.భూ భారతి పథకానికి సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి తహసీల్దార్‌కు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించారు.

**అక్రమ రవాణాపై నిఘా : -**

ఇసుక, మొరం, గ్రావెల్ వంటి ఖనిజాల అక్రమ రవాణా జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ (SIR) జనాభా లెక్కల విధుల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు.గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు రాకుండా జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం గ్యాస్ డీలర్ల నిల్వలను తనిఖీ చేయాలని, వినియోగదారులకు, ముఖ్యంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వాడాలని, డొమెస్టిక్ (గృహ అవసరాల) సిలిండర్లు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్యాస్ రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు తప్పనిసరిగా ఉండాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.జిల్లాలో కనీసం 5 రోజులకు సరిపడా గ్యాస్ నిల్వలు ఉండేలా చూడాలని ఎల్పీజీ ప్రతినిధులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు రవీందర్, హసీనా బేగం, విక్రమ్, డీడబ్ల్యూఓ కోదండరాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, గ్యాస్ డీలర్ల సంఘం ప్రెసిడెంట్, సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ లు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రోగికి నాణ్యమైన చికిత్స సత్వర వైద్య సేవలే మా లక్ష్యం

## వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్ జిల్లా, మార్చి 17 (వుదయం ప్రతినిధి):**

మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్. మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన జనరల్ హాస్పిటల్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హాస్పిటల్ లోని ఓపి వార్డు, ఏఎంసీ, ఐసీయూ, పిడియాట్రీషియన్, ఎస్ఎన్సియు, జనరల్ మెడికల్ వార్డు, ఆలనా సెంటర్, ప్రతి వార్డులు తిరుగుతూ వైద్యం కోసం వచ్చిన పేషెంట్లు, వారి బంధువులతో స్వయంగా మాట్లాడారు, హాస్పిటల్ లో అందిస్తున్న సేవలు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు, హాస్పిటల్ లోని సిబ్బంది హాజరు పట్టిక, స్టోర్ స్టాక్ రిజిస్టర్, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రిజిస్టర్లు, డ్యూటీ ఆర్డర్స్, రిజిస్టర్, వైద్య పరీక్షలు నిర్వహించే ఇండెంట్ రిజిస్టర్, బయోమెట్రిక్ రిజిస్టర్, మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ లను ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సుదీర్ఘ సమయం హాస్పిటల్, వార్డులు, పరిసరాలను స్వయంగా పరిశీలించారు.వివిధ ఆరోగ్య సమస్యల వైద్యం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి నిరుపేద సామాన్య ప్రజలు తదితరులు వైద్యం కోసం రావడం జరుగుతుందని, ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అత్యాధునిక పరికరాలతో వైద్య విధాన సేవలు, టెస్టులు , ప్రతి ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో నాణ్యమైన, వేగమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలు, డయాలసిస్ పేషంట్స్, తదితర సుదీర్ఘమైన వైద్య సేవల కోసం వచ్చిన వారికి ఆస్పత్రిలో కల్పించిన సౌకర్యాల ద్వారా వైద్య చికిత్సలు అందించాలని, పేషంట్ల సహాయార్థం వచ్చే వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు చిన్నపిల్లల కోసం ఆలనా సెంటర్, లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని,
త్రాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, టాయిలెట్స్, అన్ని వార్డులను ఎప్పటికప్పుడు సానిటేషన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్ సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ సిద్ధం చేయాలని, హాస్పిటల్ ప్రాంతంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్ లో ఆక్సిజన్, కావలసిన మందులు నిత్యం అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు, హాస్పటల్ వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలని, వారికి కేటాయించిన సమయాలలో వైద్య సేవలు అందించడం కోసం సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.హాస్పిటల్ లో పేషెంట్లకు వారి సహాయకులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు, ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు వారి బంధువులతో వైద్య సిబ్బంది సేవ భావంతో ఉండాలని కలెక్టర్ సూచించారు



,ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో కూడా వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు,కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరిడెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ లకావత్, డాక్టర్ జగదీష్, డాక్టర్ హర్షవర్ధన్, తదితరులు ఉన్నారు.

# గ్యాస్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం

- ప్రజలకు నిరంతర సేవలు అందించాలి
- రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం జిల్లా ప్రతినిధి):**



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లిలోని హెచ్‌పీ గ్యాస్, సింగరేణి కాలరీస్‌కు చెందిన గ్యాస్ ఏజెన్సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, గ్యాస్ సరఫరా విధానం, నిల్వల పరిస్థితి, భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన వినియోగదారులకు సమయానికి గ్యాస్ సరఫరా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను పాటించాలని సూచిస్తూ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.ఎల్పీజీ డీలర్లు వినియోగదారుల బుకింగ్ సీక్వెన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ గ్యాస్ రీఫిల్స్‌ను సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమాన్ని అతిక్రమించకూడదని ఆదేశించారు.జిల్లాలో గ్యాస్ కొరత ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను నమ్మి కొందరు వినియోగదారులు అవసరానికి మించి బుకింగ్స్ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.ఈ తనిఖీ సందర్భంగా తనిఖీలో భాగంగా రోజువారీ బుకింగ్స్, డెలివరీస్, రీఫిల్ గ్యాస్ సరఫరా విధానాన్ని సమీక్షించారు. అదేవిధంగా జిల్లాలో గ్యాస్ నిల్వలు, బుకింగ్స్, ఆయిల్ కంపెనీల నుంచి రావాల్సిన సరఫరాపై పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ రోజువారీ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ సరఫరా వ్యవస్థను సక్రమంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశం



**ఖమ్మం, మార్చి 18 (వుదయం ప్రతినిధి)**

పెనుబల్లి మండలం లోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ మరియు ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ తో మంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## చండూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓంకారం రాజీనామా

**చండూరు, మార్చి 17 (వుదయం విలేఖరి)**

చండూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరిమి ఓంకారం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన తన వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు. తనకు అప్పగించిన బాధ్యతలను ఇంతకాలం నిర్వహించే అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వ్యక్తిగత కారణాల దృష్ట్యా పదవిలో కొనసాగడం సాధ్యం కాదని పేర్కొంటూ, తన రాజీనామాను ఆమోదించాలని పార్టీ ఉన్నత నాయకత్వాన్ని వినయపూర్వకంగా కోరారు.ఓంకారం రాజీనామాతో చండూరు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి వర్షా కాలం నాటికి మొక్కలను
- సిద్ధం చేయాలి నర్సరీల పరిశీలన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**ములుగు, మార్చి 17 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం రోజున ములుగు మండలంలోని జంగాలపల్లి, రాయినిగూడెం, కొత్తూరు మరియు కాసిందిపేట గ్రామాల్లో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి, అభివృద్ధి పనులను తనిఖీ చేశారు.

**వైద్య సేవలు - అవగాహన**

రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్, రోగులతో మాట్లాడి సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు,
కిశోర బాలికలు మరియు వృద్ధులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. వైద్యంతో పాటు పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ శిబిరంలో ఇప్పటివరకు సుమారు 127 మందికి వైద్య సేవలు అందించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు వెల్లడించారు.

**పర్యావరణ పరిరక్షణ - నర్సరీల పెంపకం**

జంగాలపల్లిలోని 'మన ఊరు మన నర్సరీ'ని సందర్శించిన జిల్లా కలెక్టర్ మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. రాబోయే వర్షాకాలం నాటికి పండ్లు, పూలు మరియు నీడను ఇచ్చే మొక్కలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండలు తీవ్రమవుతున్నందున మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కొత్తూరులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, ఫినిషింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని లబ్ధిదారులకు సూచించారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించబడతాయని హామీ ఇచ్చారు. అనంతరం కాసిందిపేటలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.పి.ఓ. రహీం, వైద్యాధికారి డాక్టర్ నాగ అనేష్, సి.హెచ్.ఓ రాజమణి తదితరులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**కోదాడ మార్చి 17(వుదయం)**

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా ఐపీఎస్ కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల దర్యాప్తు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఫిర్యాదులు, పెండింగ్ కేసులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు.
ఫిర్యాదుదారులకు తక్షణ స్పందన అందించి, కేసులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని



చెప్పారు.రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని, అటువంటి ఆక్రమణలను నివారించాలని సూచించారు. అలాగే రంజాన్, ఉగాది పండుగల సందర్భంగా ప్రజలు మతసామరస్యంతో కలిసి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.రోడ్డు భద్రత, సైబర్ మోసాలు, సామాజిక భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలని పోలీసులకు సూచించారు.ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్సైలు సుదీర్, చిన్న మాల్సూర్, ట్రాఫిక్ ఎస్సై అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి తోటల్లో కలెక్టర్ సందడి

**రైతు దేవేందర్ సాగు అద్భుతం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రశంస."**

**పరకాల, మార్చి 17 (వుదయం ప్రతినిధి):**



హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం రోజున నడికూడ మండలం నర్సక్కపల్లె గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో గ్రామ పరిస్థితులను సమీక్షించడంతో పాటు, వ్యవసాయ రంగంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు.
ఈ సందర్భంగా సాగులో ఉన్న మిర్చి పంటలను పరిశీలించి, రైతులతో ముఖాముఖి చర్చించారు.
గ్రామానికి చెందిన రైతు కోడెపాక దేవేందర్ తన పొలంలో మిర్చి పంటను శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తూ అత్యధిక దిగుబడి సాధించడంపై జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. దేవేందర్ కృషిని కొనియాడుతూ, ఆయన్ను 'ఆదర్శ రైతు'గా పేర్కొని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, రైతులు అధునాతన సాంకేతికతను జోడించి అధిక లాభాలు గడించాలి, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సూచించారు.కోడెపాక దేవేందర్ లాంటి రైతుల పట్టుదలను గ్రామంలోని ఇతర రైతులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.కలెక్టర్ పర్యటనతో నర్సక్కపల్లె రైతుల్లో నూతనోత్సాహం నెలకొంది. తమ సమస్యలను స్వయంగా కలెక్టర్ అడిగి తెలుసుకోవడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## రాజీవ్ నగర్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**సత్తుపల్లి మార్చి 18 (వుదయం ప్రతినిధి)**



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7 వార్డ్ రాజీవ్ నగర్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 6 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ నరసింహ, వార్డ్ కౌన్సిలర్ మొహమ్మద్ నసీమా షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా వార్డులోని డ్రైనేజీల శుభ్రం చేయటం, చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షరీఫ్,
రామారావు, సారధి, స్వప్న, హమీద్, నజీర్, సూర్య గుంట్రూ పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఉద్యోగుల కృషి అభినందనీయం

### కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** ఖోడద్ గ్రామ అభివృద్ధి లో ఉద్యోగుల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ, గ్రామంలో విజ్ఞానాన్ని పంచేందుకు లైబ్రరీని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామం నుండి ఎదిగిన ఉద్యోగులు తమ ప్రాంతంపై మమకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' బ్లూప్రింట్‌ను సిద్ధం చేసిందని తెలిపారు. ఈ అభివృద్ధిలో గ్రామాలు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే యువతకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. సివిల్ సర్వీసెస్ వంటి కఠినమైన పరీక్షలను సాధించాలంటే పట్టుదల, సరైన ప్రణాళిక అవసరమని తన సొంత అనుభవాలను కలెక్టర్ యువతతో పంచుకున్నారు. గ్రామంలోని ఉద్యోగులంతా కలిసి యువతకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే కాకుండా, స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ రంగాల్లో కూడా రాణించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీఓ శంకర్, గ్రామ ఉద్యోగుల సంఘం సభ్యులు వెంకట్, నర్సింలు, చంద్రారెడ్డి, అనిల్‌రెడ్డి, స్వామి, అశోక్, భోజారెడ్డి, గౌతమ్, గోవర్ధన్, లలిత, స్వామి తదితరులు పాల్గొన్నారు.




## ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

### ఇందిరమ్మ గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి
### కలెక్టర్ గరిమా అగర్వాల్
### వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**సిరిసిల్ల, మార్చి 17(వుదయం ప్రతినిధి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రి ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బడ్జెట్ లోనే ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఆయా మండలాల్లో గుడిసె ల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయమై జడ్పీ డిప్యూటీ సీఈవో, హౌసింగ్. ఇతర అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ఇండ్లను పూర్తి చేయించాలని ఆదేశించారు.

జిల్లాలో గ్రామ సమాఖ్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్ర భవనాల పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని భవనాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా వసతులు కల్పించిన తర్వాత ప్రారంభించాలని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, హౌసింగ్ డీఈ సాజిద్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చందుర్తి మండల ప్రత్యేక అధికారి, పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టర్ ఆవిష్కరణ...

అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులతో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ ఎస్ సీ, బీ కాం, బీఏ తదితర కోర్సుల వివరాలతో సిద్ధం చేసిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. త్వరలో దోస్త్ వెబ్ సైట్ ద్వారా అడ్మిషన్లు పొందాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోర్సులు, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అడ్మిషన్ ఇంచార్జి జి శ్రీధర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ ప్రసాద్, ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ కృష్ణ ప్రసాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్, డాక్టర్ కే శారద అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, డాక్టర్ కే వై కరుణ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ, ఆఫీస్ ఇంచార్జి గోపికృష్ణ, రమేష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## గృహ వినియోగ సిలిండర్లను వాడితే కఠిన చర్యలు

- పౌరసరఫరాల అధికారి
- పౌరసరఫరాల అధికారులు తనిఖీలు
- డొమెస్టిక్ వంట గ్యాస్ లీటర్లను సీజ్

**కోరుట్ల మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల కార్యాలయ సిబ్బంది మంగళవారం మెట్‌పల్లి పట్టణంలోని రెస్టారెంట్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వ్యాపార వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోపిస్తున్న గృహ వినియోగ డొమెస్టిక్ వంట గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. అనే సమాచారంతో అధికారులు ఈ ముందస్తు దాడులు చేపట్టారు పట్టణంలోని వివిధ హోటల్ లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విరుద్ధంగా వినియోగిస్తున్న 13 మందిపై సిక్స్ ఏ కేసు నమోదు చేసి వెంటనే ఆ డొమెస్టిక్ వంట గ్యాస్ లీటర్లను సీజ్ చేశారు. సహాయ పౌరసరఫరాల అధికారి (ఏసీఎస్ఓ) నాయబ్ తాహసిల్దార్ మెట్‌పల్లి కే ఉమాపతి శ్రీనివాస్ విష్ణు పౌరసరఫరాల ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌కి తనిఖీల స్వయంగా పాల్గొన్నారు. వాణిజ్య అవసరాలకు సబ్సిడీపై వచ్చే గృహ వినియోగ సిలిండర్లను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని అధికారులు ఈ సందర్భంగా వ్యాపారులను హెచ్చరించారు.

## జిల్లాలో పారిశుధ్య నిర్వహణ

# పకడ్బందీగా చేపట్టాలి

### కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గణపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్‌లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈలతో పారిశుధ్యం, పన్నుల వసూలు, ఇందిరమ్మ ఇండ్లు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ కూలీల మొబిలైజేషన్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు రోజువారీగా పర్యవేక్షించాలని, ప్రతి గ్రామ పంచాయతీలో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగు కాలువలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణతో 100 శాతం పారిశుధ్యం నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో నర్సరీలు సక్రమంగా నిర్వహించాలని, ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని గ్రామాలలో మంజూరు కాబడిన ఇందిరమ్మ ఇండ్లను గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కార్మికులను ఎక్కువగా మొబిలైజ్ చేయాలని, ప్రతి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా చెట్లను నాటించాలని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ లీకేజీ ఉన్నట్లయితే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో 100 శాతం పన్నులు వసూలు చేయాలని, గ్రామాలలో సందర్శించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేనట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ నెల 23వ తేదీ నుంచి ఒక ప్రత్యేక అధికారి, తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలుచేపడుతామని, గ్రామ పంచాయతీల నిర్వహణ సరిగ్గా లేని పక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలు అందించాలి...

**లక్షెట్టిపేట్/మంచిర్యాల, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో సరోజతో కలిసి సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఎండాకాలం దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం వెంకట్రావుపేట, దౌడపల్లి, చందారం గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా పట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గృహాలు, వ్యాపార సముదాయాల వద్ద చెత్తను రోడ్లపై, మురుగు కాలువలలో వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అమృత్ పథకం నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత

- ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం
- కలెక్టర్ చిత్రా మిశ్రా
- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం




**కరీంనగర్, మార్చి17 (వుదయం ప్రతినిధి) :** వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రమాదాలు నివారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో, రహదారుల్లో రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతులు సమయంలో వాహనదారులు గుర్తించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొన్ని పనులు దీర్ఘకాలం పాటు జరిగే అవకాశం ఉన్నందున అక్కడ వాహన ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాల్లో బాధితులకు తక్షణ వైద్య సాయం అందేలా ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో రోడ్డు భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అందువల్ల అధికారులు రోడ్డు భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. ప్రమాదకర మలుపులు, సిగ్నలింగ్‌పై దృష్టి సారించాలని, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ.. జిల్లాలో 24 ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట్లు ఉన్నాయని తెలిపారు. హెచ్చరిక బోర్డులు, రోడ్డు వైపు పెరిగిన కొమ్మలు కత్తిరించడం తదితర చర్యల ద్వారా ప్రమాదాలు నివారించాలని సూచించారు. నగరంలో బ్లికింగ్ బల్బులు, జంక్షన్లలో సిగ్నలింగ్, లైటింగ్ వ్యవస్థకు సంబంధించి పలు సూచనలు చేశారు. జగిత్యాల రోడ్డుకు ఇరు ప్రక్కల పొదలు, కొమ్మలను తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఆర్టిఏ కమిటీ మెంబర్ పడాల రాహుల్, రోడ్లు భవనాల శాఖ ఈఈ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## జనగణనపై పూర్తి అవగాహనతో ముందుకెళ్లాలి

### శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ మార్చి17(వుదయం ప్రతినిధి) :** జనగణన 2027 కోసం ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. 2027 జనగణనపై అధికారులకు కలెక్టరేట్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈనెల 15 నుండి చార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మంగళవారం హాజరైన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జనగణన కోసం సూచించిన ఆప్ రిజిస్ట్రేషన్, పనితీరు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వస్తుంటాయని, ఉన్నతాధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకొని పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. టెక్నికల్ అంశాలు, నియమ నిబంధనలు స్పష్టంగా తెలుసుకోవాలని, నవీకరించిన మార్గదర్శకాలను పాటించాలని అధికారులకు సూచించారు. శిక్షణ ఇచ్చేవారు అధికారుల సందేహాలు నివృత్తి చేయాలని, ప్రతి అంశంపై క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. మండల చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనకు చార్జ్ అధికారులుగా నాయబ్ తహసిల్దార్లు, పట్టణ చార్జ్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, అదనపు ఛార్జ్ అధికారులుగా టౌన్ ప్లానింగ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులుగా పలువురు జిల్లా స్థాయి అధికారులు శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సిపిఓ రామ్ దత్తారెడ్డి తదితరులు ఉన్నారు.






## కలెక్టరేట్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

**జగిత్యాల మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** జగిత్యాల జిల్లాలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత బి.రాజాగౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో పరస్పర గౌరవం సహనం సహాయ సహకారాల విలువలను పెంపొందించే గొప్ప సమయమని తెలిపారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ ఇఫ్తార్ విందుల వంటి కార్యక్రమాలు సామాజిక సమైక్యతను బలోపేతం చేస్తాయన్నారు. అన్ని మతాల మధ్య మంచి వాతావరణం నెలకొల్పడంలో ఇలాంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధు సూదన్ డిఆర్డిఓ రఘువరన్ డిపిఆర్ఓ నరేష్ కలెక్టరేట్ ఏవో హకీమ్ ట్రెసా జిల్లా అధ్యక్షులు వకీల్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాగేందర్ జిల్లా స్థాయి అధికారులు వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు ముస్లిం మత పెద్దలు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో గంజాయి స్వాధీనం

### ఇద్దరు నిందితులపై కేసు నమోదు

**ధర్మపురి, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** మండలంలోని రాయపట్నం గ్రామంలో గంజాయి కొనుగోలు అమ్మకాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన లో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం రాయపట్నానికి చెందిన నలిమెల విష్ణు (21) గంజాయి కొనుగోలు చేయడానికి లక్షెట్టిపేటకు చెందిన కండ్ల ప్రదీప్ (32)ను సంప్రదించాడు. ఈ క్రమంలో ప్రదీప్ గంజాయితో గ్రామానికి చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న ధర్మపురి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 100 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.




## మూడు విడుతల్లో రైతు భరోసా

### ఈ నెల 25 లోపు బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలి
### జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్

**పెద్దపల్లి, మార్చి-17 (వుదయం ప్రతినిధి) :** యాసంగి 2026 సీజన్ సంబంధించి రైతు భరోసా నిధులను మూడు విడుతలలో విడుదల చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 22న సిద్దిపేట జిల్లాలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ నూనె ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాసంగి సీజన్ 2026 రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని, మన జిల్లాకు సంబంధించి 1,51,300 మంది రైతుల ఖాతాలలో రూ.162 కోట్ల 52 లక్షలు మూడు దఫాలుగా విడుదల ఏప్రిల్ నెలాఖరు నాటికి రైతు భరోసా నిధులు జమ అవుతాయని అన్నారు. ఫిబ్రవరి 28 నాటికి జారి అయిన పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించిన రైతులకు రైతు భరోసా అందజేస్తామని, నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా నిధుల కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని, ఇతర వివరాల కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పేర్కొన్నారు.

## ఏప్రిల్‌లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

### ఈనెల 26వ తేదీలోపు ఫీజు చెల్లించండి
### ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్




**కామారెడ్డి, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :** కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి )లో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నిర్వహించబోయే వివిధ సెమిస్టర్ పరీక్షల వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలతో పాటు, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఏప్రిల్ మాసంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె.కిష్టయ్య ఫీజు చెల్లింపునకు సంబంధించిన తేదీలను ఈ క్రింది విధంగా వివరించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల (మార్చి) 20వ తేదీ వరకు, రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 24వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 26వ తేదీ వరకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించవచ్చనని తెలిపారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు ఎన్. రాములు, ఏ. రాజేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించి, పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈ నెల 26వ తేదీ వరకు కళాశాలలోని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో అందజేయాలని వారు కోరారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

- 22న ముఖ్యమంత్రి రాక; ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హేమావతి
- లోపాలు లేకుండా ప్రోటోకాల్ పాటించాలని అధికారులకు ఆదేశం

**సిద్దిపేట, మార్చి 17 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న నేపథ్యంలో, మంగళవారం జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, విజయ ఎండి చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి ఆమె ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణం, బహిరంగ సభ వేదిక, రైతు మేళా స్టాళ్ల ఏర్పాటును కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్కడా చిన్న పొరపాట్లకు తావివ్వకుండా వివిధ శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. శిలాఫలకం ఆవిష్కరణ నుండి సభ ముగిసే వరకు ప్రతి అంశం ప్రోటోకాల్ ప్రకారం ఉండాలని స్పష్టం చేశారు. అలాగే, రైతు మేళాకు వచ్చే వేలాది మంది రైతులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ.. నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం రాష్ట్ర రైతాంగానికి ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. రైతు మేళా ద్వారా ఆయిల్ పామ్ తోటల పెంపకం, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ మరియు పశుపోషణ ద్వారా కలిగే లాభాలను రైతులకు ప్రత్యక్షంగా వివరించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌తో పాటు వ్యవసాయ, హార్టికల్చర్, ఆర్ అండ్ బీ, పోలీస్ మరియు ఆయిల్ ఫెడ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**అబద్ధం చెప్పిన ప్రిన్సిపాల్ పై ఆగ్రహం: జిల్లా కలెక్టర్**

సిద్ధిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రాజీవ్ రహదారి వెంబడి ఉన్న ఈ పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజన అమలు తీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షలపై విద్యార్థులకు దిశానిర్దేశం.. మొదటగా ఆమె 10వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. రేపు జరగబోయే హిందీ పరీక్షకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రశ్నలను క్లుప్తంగా చదివి, అర్థం చేసుకుని సమాధానాలు రాయాలని సూచించారు. మిగిలిన పరీక్షలను కూడా ఆత్మవిశ్వాసంతో రాయాలని, ఈ కీలకమైన సమయాన్ని వృధా చేయకూడదని విద్యార్థులకు హితబోధ చేశారు. అనంతరం 9వ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, వార్షిక పరీక్షల గురించి ఆరా తీశారు. ఏప్రిల్ 10 నుండి పరీక్షలు ప్రారంభమవుతాయని విద్యార్థులు తెలపగా, ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని ఆమె సూచించారు.

ప్రిన్సిపాల్‌పై సీరియస్: "అబద్ధాలు చెబితే చర్యలు తప్పవు" ఒంటిపూట బడుల నేపథ్యంలో విద్యార్థులకు ఉదయం 10:30 గంటలకే అన్నం, కూర, సాంబార్‌తో కూడిన భోజనం పెడుతున్నామని ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు వివరించారు. అయితే, విద్యార్థులను విచారించగా కేవలం అన్నం, సాంబారు మాత్రమే పెట్టినట్లు తేలింది. దీంతో ప్రిన్సిపాల్ వ్యవహార శైలిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం విషయంలో అబద్ధాలు చెబుతూ, నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, విద్యార్థుల ఆహారం విషయంలో పొరపాట్లు పునరావృతమైనా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.





### సీఎం పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగొద్దు

22వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభించడానికి అవసరమైన హెలిప్యాడ్ ఏర్పాటు, బహిరంగ సభా స్టేజ్ ఏర్పాటు, రైతు మేళాకు స్టాళ్ల ఏర్పాటు, ఫ్యాక్టరీ ప్రారంభానికి ఫ్యాక్టరీలో చేస్తున్న ఏర్పాట్లు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా వివిధ శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. హెలిపాడ్ ఏర్పాటు, బహిరంగ సభ, ఫ్యాక్టరీ ప్రారంభం, స్టాళ్లు, శిలాపలకం ఆవిష్కరణ తదతర అన్ని ప్రోటోకాల్ ప్రకారం ఉండాలని, అదేవిధంగా ఈ కార్యక్రమానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, మరుగుదొడ్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని, అధికారులు సూచించిన విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలనీ అన్నారు.

## ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ మార్చి 17(వుదయం ప్రతినిధి)** పదో తరగతి పరీక్షలకు ప్రతి పరీక్షకు పరీక్షకు మధ్య 4 రోజుల సమయం ఉన్నందున, ఆ సమయాన్ని వృథా చేయకుండా ప్రతి పరీక్షకు పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం జిల్లాలోని తెలకపల్లి మండల పరిధిలోని గౌ రెడ్డి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. శనివారం నిర్వహించిన మొదటి తెలుగు పరీక్షను ఎలా రాశారని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు రాస్తున్నా విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. కష్టపడి చదివిన విషయాలను ప్రశాంతంగా, ఆసక్తితో రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పరీక్షలకు సమయపాలన చాలా ముఖ్యమని పేర్కొంటూ, విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రశ్నపత్రంలో సులభమైన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయడం ద్వారా సమయం ఆదా చేసుకోవచ్చని చెప్పారు. అలాగే హాల్ టికెట్ నంబర్, ప్రశ్న నంబర్లను సరిగా నమోదు చేసి, ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ముఖ్యమైన అంశాలను అండర్‌లైన్ చేస్తూ, సంక్షిప్తంగా సమాధానాలు రాయాలని చెప్పారు. గైడ్లపై ఆధారపడకుండా, స్వయంగా అర్థం చేసుకున్న విషయాలను రాయడానికి ప్రయత్నించాలని విద్యార్థులను కలెక్టర్ ప్రోత్సహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట వివిధ మండల స్థాయి అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.



### వచ్చేనెల 20 నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

జిల్లాలోని తెలకపల్లి మండల కేంద్రంలో వివిధ లబ్ధిదారులకు చెందిన నిర్మాణం జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం పరిశీలించారు. వివిధ లబ్ధిదారుల గృహ నిర్మాణ పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, వచ్చేనెల 20వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా గృహ ప్రవేశాల నాటికి పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

## స్కూల్ బస్సు ఢీకొని ఇద్దరు దుర్మరణం

- జగదేవ్‌పూర్ పీర్లపల్లి శివారులో ఘోర ప్రమాదం
- బైక్‌ను ఢీకొట్టిన సెయింట్ పీటర్స్ పాఠశాల బస్సు
- ఒకరు అక్కడిక్కడే.. మరొకరు చికిత్స పొందుతూ మృతి

**సిద్ధిపేట (జగదేవపూర్), మార్చి 17 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలో మంగళవారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలానికి చెందిన సెయింట్ పీటర్స్ స్కూల్ బస్సు మధ్యాహ్నం 3 గంటల సమయంలో జాతీయ రహదారిపై పీర్లపల్లి గ్రామం వైపు వెళ్తోంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న గ్లామర్ బైక్‌ను స్కూల్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఆళ్ళకుంట రమేష్ (45) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కూతుర్లు (21,16) కొడుకు శ్రీకాంత్ (18) సంవత్సరాల వయస్సు గలవారు ఉన్నారు. బైక్ వెనుక కూర్చున్న లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (60) పరిస్థితి విషమించడంతో వెంటనే అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన కూడా మృతి చెందారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న జగదేవ్‌పూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. స్కూల్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఆస్తి పన్ను వసూళ్లలో 100 శాతం లక్ష్యం సాధించాలి

- మున్సిపల్ అధికారులకు అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదేశం
- కోట మైసమ్మ రోడ్డు పనులపై ప్రత్యేక సమీక్షకు నిర్ణయం
- 11వ వార్డులో చెత్త బుట్టల పంపిణీ చేసిన చైర్‌పర్సన్, కమిషనర్



**గజ్వేల్, మార్చి 17 (వుదయం ప్రతినిధి)** గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, కమిషనర్ ఆర్. వెంకట గోపాల్లతో కలిసి ఆయన ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా వాణిజ్య సముదాయాలకు సంబంధించిన ఆస్తి పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని అసహనం వ్యక్తం చేశారు. ఇకపై రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, పెండింగ్‌లో ఉన్న పన్నులను 100 శాతం వసూలు చేయాలని కమిషనర్‌కు సూచించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కోట మైసమ్మ రోడ్డు పనుల అంశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్ అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన, రోడ్డు పనుల అడ్డంకులను తొలగించేందుకు సంబంధిత R&B డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సంగపూర్‌లో పర్యటించారు.



### హుస్నాబాద్ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**రైతులకు కనీస మద్దతు ధర భరోసా**

**సిద్దిపేట, మార్చి 17 ( వుదయం ప్రతినిధి)** మొక్కజొన్న రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈరోజు నుండి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న పండించిన రైతులు తమ పంటను అమ్ముకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి పొన్నం ప్రభాకర్.. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల నుండి కనీస మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేయాలని కోరగా, మంత్రి తుమ్మల వెంటనే స్పందించి హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోలుకు అనుమతులు మంజూరు చేశారు. మంత్రుల ఆదేశాల మేరకు హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, బొలిశెట్టి శివయ్య ఇతర ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మరియు మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి కొనుగోలు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు.



### కలెక్టర్‌ని కలిసిన జిల్లా ప్రోగ్రాం మేనేజర్ కే.రవి

**నారాయణపేట మార్చి 17(వుదయం ప్రతినిధి)** జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా ఉమ్మడి జిల్లా108,102 ప్రోగ్రామ్ మేనేజర్ కే.రవి మంగళవారం కలిసి పుష్పగుచ్చాన్ని అందచేశారు.ఈ సమావేశంలో జిల్లాలో 108,102 అంబులెన్స్ లో అందిస్తున్న సేవలను గురించి వారికి వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్,ఎస్పీ 108, 102 అంబులెన్స్ల సేవలు అత్యుత్తమమైనవని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట 108 జిల్లా ఎగ్జిక్యూటివ్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



### హెల్త్ క్యాంపు పరిశీలన : జిల్లా కలెక్టర్

**(వుదయం ప్రతినిధి) పాపన్నపేట మార్చి: 17** పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆశాఖ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. మంగళవారం పాపన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపు ను ఆమె సందర్శించారు.రోగులకు అందిస్తున్న వైద్య సేవల సరళిని పరిశీలించారు. కలెక్టర్ వెళ్లిన అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీరాం హెల్త్ క్యాంపు ను పరిశీలించా రు. కార్యక్రమంలో మెదక్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ వో హరిప్రసాద్,పాపన్నపేట మెడికల్ ఆఫీసర్ అన్వర్, సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు సమర్థవంతంగా అందించాలి

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**సంగారెడ్డి, మార్చి 17, వుదయం.** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని బస్తీ దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, శెట్కార్ గ్రౌండ్స్ మరియు ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు మరియు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఓపీకి వచ్చే రోగుల వివరాలపై ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారా అన్న విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గదిలో మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. స్టేడియం వినియోగానికి డైలీ రెంట్‌ను నిర్ణయించాలని, స్టేడియం పరిధిలో ఉన్న షాపుల రెంట్ బకాయిలను వసూలు చేయాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డికి ఆదేశించారు. తదనంతరం ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న రూఫ్ లీకేజీ, డ్రైనేజీ తదితర మరమ్మత్తులకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఈడబ్ల్యూఐడీసీ ఏఈకి ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఉమా హారతి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్ నాయక్, తహసిల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- వార్తలాప్ వర్క్‌షాప్‌తో జర్నలిస్టులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన
- పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్

**సంగారెడ్డి, మార్చి 17: వుదయం** ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా రూపొందుతున్న కంటెంట్, తప్పుదారి పట్టించే చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB) హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో "వార్తలాప్ (వార్తలాప్ )" పేరుతో జర్నలిస్టులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న తప్పుదారి పట్టించే సమాచారం కూడా సమాజంలో భయం సృష్టించడమే కాకుండా ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అన్నారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని పేర్కొంటూ, ప్రభుత్వ పాలసీలు, పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వార్తలను అందించాలని జర్నలిస్టులకు సూచించారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని తమ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు.



పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు ఖచ్చితంగా చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న ఈ కాలంలో తప్పుడు వార్తలను గుర్తించి ఖండించడంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ముఖ్యమైన బాధ్యత నిర్వహిస్తున్నదని తెలిపారు. పీఐబీ ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. వర్క్‌షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు శ్రుతి పాటిల్ సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు మరియు అభిప్రాయాలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

## జిల్లా అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల మార్చి 17 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళల జనాభా, ఉద్యోగినిల సంఖ్య ఎక్కువే కాబట్టి జిల్లా అభివృద్ధిలో వారు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలోని పలు సామాజిక సమస్యలను నిర్మూలించేందుకు తమ వంతుగా కృషి చేస్తారని ఇటీవల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళ సర్పంచులు, కౌన్సిలర్లను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. బాల్యవివాహాలను చేయడం వలన కలిగే దుష్పరిణామాలను గురించి వివరిస్తూ, వీటి నిర్మూలనకు సహకరించాలన్నారు. జిల్లాలో ఇటీవల పాస్కో కేసులు ఎక్కువగా నమోదు కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు అవగాహన కలిగించాలని, వేధింపులకు గురైన మహిళలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే తప్పు చేసినవారికి శిక్షలు వేయడం జరుగుతుందన్నారు. వరకట్న వేధింపులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు సఖీ కేంద్రంలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జనాభా గణన చేపట్టే నాటికి జిల్లాలో మహిళల అక్షరాస్యత శాతం పెరిగేందుకు కృషిచేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని పేర్కొన్నారు. ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందజేస్తుందని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అమ్మాయిల పట్ల వివక్ష చూపడం సరికాదని, వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమానికి హాజరైన పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, మహిళ ఉద్యోగులకు, నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థినిలకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పి శంకర్, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిడబ్ల్యుఓ సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, డిసిపిఓ నరసింహా, పలువురు మహిళ సర్పంచులు, కౌన్సిలర్లు, మహిళా ఉద్యోగులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్ ను పరిశీలన

జిల్లాలోని ఈవీఎం గోడౌన్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజవాన్ బాషా షేక్ ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచి తనిఖీ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విత్తన బంతుల తయారీ

**కామారెడ్డి ప్రతినిధి, మార్చి 17 (వుదయం):-**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎకో క్లబ్, వృక్షశాస్త్రం, ఫారెస్ట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో విత్తన బంతుల తయారీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రాణవాయువును అందించడమే కాకుండా, సకల జీవరాశికి ఆహారం, ఆశ్రయం కల్పించే మొక్కలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అటవీ విస్తీర్ణాన్ని పెంచడానికి విత్తన బంతుల తయారీ ఒక సులువైన, ప్రభావవంతమైన మార్గమని ఆయన కొనియాడారు. ఈ బాధ్యతాయుతమైన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దినకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ విశ్వ ప్రసాద్, అధ్యాపకులు శ్రీవల్లి, స్వాతి, శ్రీలత, వెన్నెల, రమణలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

- సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్
- మాగిలో రంజాన్ తోఫా పంపిణీ

**నిజాంసాగర్ మార్చి 17 (వుదయం ప్రతినిధి) :**
రంజాన్ పవిత్ర మాసం శాంతి సౌభాతృత్వానికి ప్రతీక అని సర్పంచ్ గుర్రపు సుమిత్ర అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మైనార్టీ సోదర సోదరీమణులు పండుగను ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాలను మంగళవారం నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాగి సర్పంచ్ గుర్రపు సుమిత్ర ఆధ్వర్యంలో లబ్ధిదారులకు తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా మాగి సర్పంచ్ గుర్రపు సుమిత్ర మాట్లాడుతూ రంజాన్ మాసం పరస్పర ప్రేమ, సోదర భావం, ఐక్యతను పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకునేలా రాష్ట్ర ప్రభుత్వం తోఫాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుర్రపు శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసం సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని చెప్పారు. పేద మైనార్టీ కుటుంబాలకు సహాయం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రంజాన్ తోఫాలను అందించడం గొప్ప విషయమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని మతాల ప్రజలకు సమాన గౌరవం లభిస్తోందని, ఇలాంటి కార్యక్రమాలు సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేంగారం కవిత పండరి, వార్డు సభ్యులు రాజ్యం సాయిలు, కాశవ్వ తదితరులు పాల్గొన్నారు.






# రైతులకు ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ

**లక్షెట్టిపేట, మార్చి 17 (వుదయం ప్రతినిధి):**
మండలంలోని చందారం క్లస్టర్ రైతులకు పట్టణంలోని స్థానిక రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం క్లస్టర్ రైతులకు కిట్లను, భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# చిన్న పత్రికలను ఆదుకోండి

- ఆర్థిక మంత్రికి టీయుడబ్ల్యూజే వినతి

**పెద్దపల్లి, మార్చి-17 (వుదయం ప్రతినిధి) :**
చిన్న, మధ్యతరగతి పత్రికలకు దీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ కోరారు. మంగళవారం రోజు శాసన సభలోని ఛాంబర్ లో టీయుడబ్ల్యూజే ప్రతినిధి బృందం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. దాదాపు రెండేళ్లుగా చిన్న, మధ్యతరగతి పత్రికలకు బిల్లులు చెల్లించక పోవడంతో పడరాని తిప్పలు పడుతున్నారని, కనీసం కుటుంబంతో ఆనందంగా పండగ కూడా జరుపుకోలేని పరిస్థితిని అనుభవిస్తున్నారని విరాహత్ అలీ మంత్రి దృష్టికి తెచ్చారు. ఒక్క పెద్ద పత్రికకు చెల్లించే బిల్లుతో, వందలాది చిన్న, మధ్యతరగతి పత్రికలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ఆయన కోరగా, భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని కిరణ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజినీకాంత్ తదితరులు ఉన్నారు.



# పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛ భారత్

- పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సీఐ రాం నర్సింహారెడ్డి

**ధర్మపురి, మార్చి 17 (వుదయం ప్రతినిధి) :**
ప్రజా పాలనలో భాగంగా చేపట్టిన '99 డేస్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది అంతా ఏకమై స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. సీఐ రాం నర్సింహా రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సై జి.మహేష్, పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. స్టేషన్ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీఐ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేవలం కార్యాలయాలే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలిచేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పానకల్ రైతు వేదికలో రైతులకు కిట్ల పంపిణీ




**జన్నారం, మార్చ్17 (వుదయం విలేకరి):**
జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ రైతు వేదికలో మంగళవారం రోజున జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కు ఎన్నుకోబడిన ధర్మారం, లింగయ్య పల్లె, చింతలపల్లె గ్రామాలకు చెందిన 125 మంది రైతులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, జన్నారం క్లస్టర్ మల్యాల త్రిసంధ్య లు 125 మంది రైతులకు కిట్లతో(బ్యాగ్, క్యాలెండర్, పెన్, నోట్ బుక్, డైరీ, టోపి) పాటు ఐడి కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, అక్రమ్, సర్పంచులు కొత్తపల్లి వనిత శ్రీనివాస్, పంజాల సురేష్, ఉపసర్పంచ్ లు పిండి నరేష్, మహేందర్, రైతులు పాల్గొన్నారు.



# జాప్తి జానకంపల్లిలో కబడ్డీ క్రీడాకారులకు డ్రెస్ కోడ్ స్పాన్సర్

**నాగిరెడ్డిపేట,(వుదయం):**
మండలంలోని జాప్తి జానకంపల్లి గ్రామంలో క్రీడలను ప్రోత్సహించే దిశగా నాగిరెడ్డిపేట బీజేపీ నాయకురాలు కొండ మీరాతాయి, సభాత్ కృష్ణ కబడ్డీ క్రీడాకారులకు రూ.8,000 విలువైన డ్రెస్ కోడ్‌ను స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా కొండ మీరాతాయి మాట్లాడుతూ యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా క్రీడల ద్వారా మంచి మార్గంలో నడవాలని, అదే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాప్తి జానకంపల్లి స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు, మాజీ ఎంపీటీసీ దేవిసింగ్, ఉప సర్పంచ్ బాలరాజ్, రాజు, జోడు సాయిలు, వార్డు సభ్యులు శివయ్య, బాబు, సాయిలు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్షలో మెల్లకుంట తండా విద్యార్థి ప్రతిభ

**నాగిరెడ్డిపేట్,వుదయం:**
జవహర్ నవోదయ విద్యాలయం ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో నాగిరెడ్డిపేట్ మండలం మెల్లకుంట తండాకు చెందిన కొర్ర నిహాల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. నిహాల్, కొర్ర వసేందర్ కుమారుడు కాగా, కొర్ర వర్జ నాయక్ మనుమడు. సాధారణ గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన ఈ విద్యార్థి సాధించిన విజయం కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. నిహాల్ విజయంపై తండా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, అతని సాధన గ్రామానికి మంచి గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు.



# గంజాయి కేసులో నేరస్తుడి అరెస్ట్

**పరకాల మార్చి 17 (వుదయం ప్రతినిధి):**
గత సంవత్సరం తేదీ 06.03.2025 రోజున చర్లపల్లి గ్రామములో గంజాయి తరలిస్తున్నారన్న సంచారం మేరకు అక్కడకు వెళ్లగ అక్కడ గంజాయి తో ఉన్న ఇద్దరు నిదితులను A1. పాపల్ బాలయ్య తండ్రి నారాయణ, వయస్సు: 25 సంవత్సరాలు, నాగులూరు గ్రామం చిత్రకొండ మండలం కలిమెల మల్కన్ గిరి జిల్లా. ఒడిషా A2. ముదిగొండ ప్రశాంత్ బాబి తండ్రి దేవానందం, వయస్సు: 24 సంవత్సరాలు, వికలాంగుల కాలనీ, పాల్వంచ టౌన్, భద్రాది కొత్తగూడెం జిల్లా పట్టుకొని వారి వద్ద నుండి 2.840 kg ల గంజాయి సీజ్ చేసి Cr.no 58/2025 U/S 8© R/w 20(b)(ii)(B) NDPS act of Parkal ps కేసు నమోదు చేయడం జరిగినది. దాని యందు గల నలుగురు నిదితులలో మరియొక నేరస్తుడి అయిన A4 గోపగాని అభిషేక్ బబ్లు తండ్రి విద్యాసాగర్, వయస్సు 22 సంవత్సరాలు, కులం: గౌడ, డిగ్రీ 3వ సంవత్సరం విద్యార్థి తిరుమలాపూర్ గ్రామం చిట్యాల మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కూడా పట్టుకొని అతన్ని రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. అట్టి నిదితులలో పరారీలో ఉన్న మరో నిందితుడు అయిన A3: పరుషవేణి వెంకటేష్ తండ్రి మల్లయ్య(లేట్), వయస్సు:25 సంవత్సరములు కులం ముదిరాజ్, వృత్తి: బట్టల వ్యాపారం హమాలి కాలనీ, పాల్వంచ గ్రామము, మరియు మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం చెందిన వ్యక్తి మంగళవారము రోజున తేదీ:17.03.2026 మధ్యాహ్నం 2 గంటలకు నడికుడ చౌరస్తా వద్దకు రాగా అట్టి సమాచారం తెలుసుకున్న పరకాల ఇన్స్పెక్టర్ వి.క్రాంతి కుమార్ తన సిబ్బందితో వెళ్ళి అట్టి నిందితుణ్ణి అదపులోకి తీసుకొని అతని వద్ద నుండి మొబైలు ఫోన్ సీజ్ చేసి నిందితుణ్ణి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.







# ఆరు గ్యారంటీల ఫైల్ ను పక్కన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**జన్నారం, మార్చ్17 (వుదయం విలేకరి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేయడంలో విఫలమైందని మంగళవారం రోజున మండల బీజేపీ అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో తహశీల్దార్ రామ్మోహన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా, మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి వంటి కీలకమైన వాగ్దానాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్, పొనకల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి, జిల్లా, రాష్ట్ర నాయకులు కొంతం శంకరయ్య, బద్రి నాయక్, వెయికండ్ల రవి, రమేష్ గౌడ్, సంతోష్ నాయక్, పిట్ట రాజారావు, తదితరులు ఉన్నారు.





# బేకరీలు చికెన్ సెంటర్లపై సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీలు

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 17(వుదయం జిల్లా ప్రతినిధి):**
భూపాలపల్లి జిల్లాలోని వివిధ బేకరీలు మరియు చికెన్ సెంటర్లపై మంగళవారం సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాల్సిన ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాల కోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 6 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం (సీజ్) చేసుకున్నారు. అలాగే, ఎవరూ అక్రమ నిల్వలు మరియు అక్రమ అమ్మకాలు చేయరాదని సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, గృహ వినియోగానికి కేటాయించిన సిలిండర్లను వాణిజ్య వంటలకు ఉపయోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమ వినియోగం వల్ల ప్రభుత్వానికి నష్టం కలగడమే కాకుండా, అర్హులైన గృహ వినియోగదారులకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. అందువల్ల, ఎవరూ గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించరాదని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ వినియోగం ఎవరైనా చేస్తూ పట్టుబడితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని నిత్యావసరాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అదేవిధంగా, అన్ని వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిబంధనలు మరియు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలు



**పరకాల మార్చి 17 (వుదయం ప్రతినిధి):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం రోజున విద్యార్థులకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, షటిల్, టెన్నికాయిట్ మరియు క్రికెట్ పోటీలను నిర్వహించారు. దీనిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థులలో పోటి తత్వాన్ని పెంపొందిస్తాయని నిత్యజీవితంలో క్రీడల వలన శారీరక మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని, క్రీడా స్ఫూర్తి అలవడుతుందని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.మల్లయ్య, ఐ క్యు ఏసి కో ఆర్డినేటర్ జి. రామకృష్ణ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇంచార్జ్ రేణ ఈశ్వరయ్య అధ్యాపకులు డాక్టర్ టి. భీమారావు, బి .మహేంద్రరావు, డాక్టర్ జి.కల్పన, డాక్టర్ ఆడెపు రమేష్, డాక్టర్ కె.జగదీష్ బాబు, ఎం.సమ్మయ్య, డాక్టర్ జి.పావని, ఎస్. రాజశ్రీ, లైబ్రేరియన్ డాక్టర్ గుండా రాజేశ్వర్ కుమార్, డాక్టర్ డి సంజయ్ కుమార్, డాక్టర్ జి.స్వప్న, ఆరుట్ల అలేఖ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల ఏఓను కలిసిన నేతలు



**ఖమ్మం వుదయం బ్యూరో మార్చి 17**
ఆడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పదోన్నతి పొంది ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల లో ఏ ఓ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సరిత ను టీఎన్జీవో నాయకులు మర్యాదపూర్వాకంగా కలవడం జరిగింది. కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పదోన్నతి పొంది విధుల్లో జాయిన్ అయినా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, అభినందనలు తెలపడం జరిగింది. ఈమె గతంలో ఇదే కళాశాలలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వర్తించారు. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం శాఖపరమైన పదోన్నతులు కల్పించడంతో ఈమెకు ఇక్కడే ఏవో పోస్టింగ్ లభించింది. అనంతరం ఉద్యోగుల సమస్యలపట్ల సానుకూలంగా ఉండాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమం లో టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జెడ్ ఎస్ జయపాల్ , టీఎన్జీవో మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షులు సిహెచ్ సైదులు, సీనియర్ సహాయకులు వాణి, టిఎన్జీవో నేలకొండపల్లి యూనిట్ ఉపాధ్యక్షులు కందుల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అవగాహన కార్యక్రమం




**పరకాల మార్చ 17 (వుదయం ప్రతినిధి):**
నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేసే ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన రైతులకు ఒకరోజు ట్రైనింగ్ ప్రోగ్రామ్ రైతు వేదిక నడికుడలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను జిల్లా వ్యవసాయ అధికారి హనుమకొండ రవీందర్ సింగ్ ,సహాయ వ్యవసాయ సంచాలకులు(పరకాల) జగదీశ్వర్ రెడ్డి మరియు ముస్త్యాలపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ద్వారా వ్యవసాయ శాఖ మాత్యులు చెప్పిన సందేశాన్ని ప్రకృతి వ్యవసాయ రైతులకు వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్, రామకృష్ణ మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# జర్నలిస్టుల పోరాటానికి జాగృతి మద్దతు




- ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- మంత్రులు జర్నలిస్టులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- జాగృతి రాష్ట్ర కార్యదర్శి భానోత్ కిసాన్ నాయక్

**ఖమ్మం వుదయం బ్యూరోమార్చి 17 :**
ఇండ్ల స్థలాల కోసమై గత రెండు రోజులుగా జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి మద్దతు పలుకుతూ, జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని జాగృతి రాష్ట్ర కార్యదర్శి కిషన్ నాయక్, జాగృతి జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్లో సోమవారం నుండి గత రెండు రోజులుగా ఇళ్ల స్థలాల సాధనకు జర్నలిస్టులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ... జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత పాలకులు జర్నలిస్టులకోసం కేటాయించిన 23.02 ఎకరాల భూమిని కేటాయించారని, ప్రస్తుత పాలకులు వారిచ్చిన హామీ మేరకు వెంటనే ఇండ్ల స్థలాలను జర్నలిస్టులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గత రెండు సంవత్సరాలుగా అక్రిడిటేషన్ కార్డులు కూడా మంజూరు చేయక ఇబ్బంది పడుతున్నారని, డిజిటల్ మీడియా, కేబుల్ ఛానల్స్, పిడిఎఫ్ పత్రికలకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించకపోతే జాగృతి ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా కార్యదర్శి వనం నాగేందర్ బంజారా జాగృతి జిల్లా అధ్యక్షులు జి రాజ్ కుమార్ నాయక్, యువజన సంఘ నాయకులు ఎస్.కె ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల సమస్య జర్నలిస్టుల అందరి




**ఖమ్మం ,వుదయం బ్యూరో మార్చి 17:**
యూనియన్లు, సీనియర్ జర్నలిస్టులు, జూనియర్ జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యమ సంఘాలకు ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించుకునేందుకు తమవంతుగా ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని, ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుపరచుకునేంత వరకు మేము కూడా మీ వెంట ఉంటామని మద్దతు ప్రకటించి, రెండు రోజుల్లో ప్రత్యక్ష కార్యచరణకు హామీ ఇచ్చిన జర్నలిస్టు మిత్రులందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాల జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి


# దేశవ్యాప్తంగా 133 అమృత భారత్ ట్రైయిన్‌లు

- పేదలకు వరం: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ:**
దేశవ్యాప్తంగా 133 అమృత భారత్ ట్రైయిన్‌ల తయారీ వేగంగా కొనసాగుతున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పేద మరియు మధ్యతరగతి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ట్రైయిన్‌లను ప్రత్యేకంగా రూపకల్పన చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తక్కువ ధరలో ప్రయాణం అందించడమే కాకుండా, మెరుగైన సౌకర్యాలు, శుభ్రత, సౌకర్యవంతమైన సీట్లు వంటి అంశాలు ఈ ట్రైయిన్‌ల ప్రధాన ప్రత్యేకతలుగా ఉంటాయని చెప్పారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో ఈ ట్రైయిన్‌లను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, వేగవంతమైన మరియు సురక్షిత ప్రయాణాన్ని అందించేందుకు ఈ ట్రైయిన్‌లు సిద్ధమవుతున్నాయి. దీర్ఘదూర ప్రయాణాలకు అనుకూలంగా ఉండేలా వీటిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే శాఖ అభిప్రాయం ప్రకారం, ఈ అమృత భారత్ ట్రైయిన్‌లు దేశంలోని ప్రతి పేద కుటుంబానికి వరంగా మారనున్నాయి. చౌకగా మరియు సౌకర్యవంతంగా ప్రయాణించే అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగిస్తాయని మంత్రి పేర్కొన్నారు.



## ఫోన్‌పే ఐపీఓకు బ్రేక్




ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే తన పబ్లిక్ ఆఫర్ ప్రక్రియకు బ్రేకులు వేసింది. ఇప్పటికే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి కంపెనీకి అనుమతులు వచ్చాయి. భౌగోళిక రాజకీయ పరిణామాలు, స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఐపీఓ ప్రక్రియను వాయిదా వేశామని కంపెనీ సీఈఓ సర్ నిగమ్ స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్లలో స్థిరమైన ర్యాలీ వచ్చిన తర్వాత తిరిగి ఐపీఓ ప్రక్రియను కొనసాగిస్తామని, త్వరలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంటుందని ఆశిస్తున్నట్టు సర్ చెప్పారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు త్వరగా శాంతించాలని ఆశిస్తున్నాం.




# ఒక్కసారిగా తగ్గిన ధరలు!



బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోతున్నాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన పసిడి ధరలు తాజాగా గణనీయంగా క్షీణించాయి. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న సమయంలో ఈ స్థాయిలో ధరలు తగ్గడం సాధారణ ప్రజలకు ఉపశమనంగా మారింది. తాజా మార్కెట్‌లో తులం బంగారం ధరలో పెద్ద ఎత్తున తగ్గుదల నమోదైంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఒక్క రోజులోనే సుమారు రూ.2,240 వరకు తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర కూడా దాదాపు రూ.1,640 మేర పడిపోయింది. ఇదే సమయంలో వెండి ధరలో కూడా భారీ పతనం కనిపించింది. ఒకే రోజులో వెండి ధర దాదాపు రూ.5,000 వరకు తగ్గింది. ధరలు తగ్గిన తర్వాత న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,57,420గా ఉంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,300 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి ధర తగ్గిన తర్వాత కిలోకు సుమారు రూ.2,70,000 వద్ద ట్రేడవుతోంది. అలాగే కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,570గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,450 వద్ద ఉంది. మరోవైపు 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,420గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,44,300 వద్ద కొనసాగుతోంది. బంగారం, వెండి ధరలు తగ్గడానికి పలు కారణాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొంత తగ్గడం, అలాగే తీసుకుంటున్న వడ్డీ రేట్ల నిర్ణయాలు కూడా బంగారం ధరలపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా గత కొన్ని రోజులుగా ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్టుబడిదారులు తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించి లాభాలు పొందడం వల్ల మార్కెట్‌లో సరఫరా పెరిగి ధరలు తగ్గుముఖం పట్టాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# పెట్టుబడుల సలహాదార్లకు 'లైట్ టచ్' జరిమానా విధానం




పెట్టుబడుల సలహా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ పలు ప్రతిపాదనలను సిద్ధం చేసే ప్రయత్నంలో ఉంది. ఇందులో భాగంగా ప్రామాణీకరించిన లైట్-టచ్(తేలికపాటి) జరిమానా విధానాన్ని, డిజిటల్ రెగ్యులేటరీ మార్గనిర్దేశక ప్లాట్‌ఫాం, కామన్ అడ్వర్టజ్‌మెంట్ కోడ్ తదితరాలు తీసుకురానున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్(ఏఆర్ఐఏ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం పెట్టుబడుల సలహా వ్యవస్థ ఒక ముఖ్యమైన పరివర్తన దశలో ఉందని అన్నారు. 1,000కి పైగా నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు(ఐఏలు) దేశంలో ఉండగా.. అందులో 470 మంది వ్యక్తులు, 530 సంస్థలున్నాయి. పారదర్శకత, నిష్పాక్షికతతో పాటు నిబంధనలను పాటించేలా చూడడం కోసం ప్రామాణీకరించిన లైట్ టచ్ జరిమానా విధానాన్ని తీసుకు వచ్చేందుకు పనిచేస్తున్నట్లు వివరించారు. 'సెబీ సేతు' పేరిట ఐఏలకు సరళీకృత, ఎండ్-టు-ఎండ్ నియంత్రణ మార్గదర్శకత్వం అందించేందుకు డిజిటల్ ప్లాట్‌ఫాంనూ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అన్ని ఇంటర్మీడియటరీలకు కార్యకలాపాల సవాళ్లు తగ్గించడానికి, కమ్యూనికేషన్‌లో స్థిరత్వాన్ని మెరుగుపరచేందుకు సాధారణ వ్యాపార ప్రకటనల స్మృతి (కామన్ అడ్వర్టయిజ్‌మెంట్ కోడ్)ని సెబీ సిద్ధం చేస్తోంది. మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ల(ఎమ్ఎఫ్‌డీ)కు సంబంధించిన ప్రస్తుత నియంత్రణ విధానాన్ని సమీక్షించేందుకు కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. మదుపర్ల సంఖ్య పెరుగుతున్నా, నమోదిత పెట్టుబడుల సలహాదార్ల సంఖ్య తగ్గుతుండడంపై పాండే ఆందోళన వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ ఆసుపత్రులకు మూడు గ్రీన్‌సెల్ మొబిలిటీ అంబులెన్స్‌లు

భారతదేశ ప్రముఖ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్లాట్‌ఫామ్ అయిన గ్రీన్‌సెల్ మొబి లిటీ (GCM), సమాజ సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, ఎవర్‌సోర్స్ క్యాపిటల్ మద్దతుతో తన స్పెషల్ పర్పస్ వెహికిల్స్ ద్వారా హైదరాబాద్‌లోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థలకు మూడు అంబులెన్స్‌లను అందజేసింది. ఈ అంబులెన్స్‌లను రామ్‌దేవ్ రావు హాస్పిటల్, నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS), సర్ రోనాల్డ్ రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ & కమ్యూనికేషన్ డిసీజెస్ (ఫీవర్ హాస్పిటల్) లకు అందించారు. గ్రీన్‌సెల్ మొబిలిటీ హైదరాబాద్ డిపోలో ఇటీవల అంబులెన్స్‌ల అప్పగింత కార్యక్రమాలు జరిగాయి. వీటికి సైబరాబాద్‌లోని మాదాపూర్ అదనపు డిప్యూటీ కమిషనర్ (ట్రాఫిక్) శ్రీ జి. హనుమంత రావు గారు, గ్రీన్‌సెల్ మొబిలిటీ ప్రతినిధులు, సంబంధిత ఆసుపత్రుల అధికారులు నాయకత్వం వహించారు, ఇది హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో అత్యవసర ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడం, క్లిష్టమైన రోగుల కదలికకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రయత్నాలను సూచిస్తుంది. అత్యవసర రవాణా లభ్యతను పెంచడం ద్వారా, ఈ చొరవ సకాలంలో వైద్య చికిత్సకు ప్రాప్యతను మెరుగుపరుస్తుంది. నగర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇస్తుంది. ప్రాణాలను రక్షించే పరిస్థితులలో కీలక మైన అత్యవసర ప్రతిస్పందనలో జాప్యాలను తగ్గించడంలో సహాయపడుతుంది.ఈ చొరవ గురించి గ్రీన్‌సెల్ మొబిలిటీ ఎండీ, సీఈఓ శ్రీ దేవేంద్ర చావ్లా మాట్లాడుతూ, "గ్రీన్‌సెల్‌లో, మా బాధ్యత సుస్థిర రవాణాను అందించడం కంటే ఎక్కువగా ఉందని మేం విశ్వసిస్తున్నాం; ఇది మేం పని చేస్తున్న సమాజం శ్రేయస్సుకు విస్తరిస్తుంది. వైద్య అత్యవసర పరిస్థితిలో, ప్రతి క్షణం ముఖ్యమైంది. సకాలంలో రవాణా అందుబాటులో ఉండటం ప్రాణాలను కాపాడుతుంది. ఈ చొరవ ద్వారా, అత్యవసర వైద్య సదుపాయాన్ని బలోపేతం చేయడంలో, రోగి సంరక్షణను మెరుగుపరచడంలో హైదరాబాద్‌లోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థలకు మద్దతు ఇవ్వడం మాకు గర్వకారణం'' అని అన్నారు. ఆయా ఆసుపత్రుల అధికారులు ఈ చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంబులెన్స్‌లు వారి అత్యవసర స్పందన సామర్థ్యాలను గణనీయంగా బలోపేతం చేస్తాయని, రోగులకు సకాలంలో వైద్య సంరక్షణను పొందే అవకాశాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. గ్రీన్‌సెల్ మొబిలిటీ సీఎస్ఆర్




తాత్వికత సమాజానికి తిరిగి ఇవ్వడం పట్ల సంస్థ నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఆర్థిక వృద్ధిని పర్యావరణ బాధ్యత, సామాజిక నిర్వహణతో కలపడం అనేది స్థితిస్థాపక సమాజం, దీర్ఘకాలిక విలువను నిర్మించడంలో సహాయపడుతుందని కంపెనీ విశ్వసిస్తుంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా, గ్రీన్‌సెల్ మొబిలిటీ అవసరమైన సామాజిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, సమాజానికి కీలకమైన సేవలను పొందే అవకాశాన్ని మెరుగుపరచడానికి దోహదపడుతూనే ఉంది.

# 4.9 శాతానికి దిగొచ్చిన నిరుద్యోగ రేటు

పనిచేసే అవకాశం ఉన్న 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు స్వల్పంగా దిగొచ్చింది. గణాంకాలు, పథక అమలు మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన కార్మిక సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటా ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి దేశంలో నిరుద్యోగ రేటు 4.9 శాతానికి తగ్గింది. అంతకుముందు నెలలో ఇది 5 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం దిగిరావడమే ఇందుకు కారణం. సమీక్షించిన నెలలో పట్టణ నిరుద్యోగ రేటు 6.6 శాతానికి తగ్గింది. ఇది గతేడాది డిసెంబర్ నాటి స్థాయి అని పీఎల్ఎఫ్ఎస్ డేటా పేర్కొంది. ఇదే సమయంలో గ్రామీణ నిరుద్యోగం 4.2 శాతంతో స్థిరంగా కొనసాగుతోంది. మహిళల్లో కూడా నిరుద్యోగం 5.6 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గింది. ఈ క్షీణత గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ నమోదైంది. ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 39.7 శాతం నుంచి 40 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 25.5 శాతం వద్దే ఉంది.

# వంటగ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన



వంటగ్యాస్ సరఫరాపై కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100శాతం ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయబోతున్నట్లు ప్రకటించింది.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని స్పష్టం చేసింది. హర్మూజ్ దగ్గర భారతీయ నౌకలు కూడా సురక్షితంగా ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశంలో వంట గ్యాస్ కొరత ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. మున్ముందు ధర మరింత పెరుగుతుందనే ఆందోళనతో గృహ వినియోగదారులు గ్యాస్‌ను కొనుగోలు చేయడానికి బారులు తీరుతున్నారు. అసలు, గ్యాస్ దొరుకుతుందా, లేదా అనే భయాలు కూడా ప్రజల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పందించింది. వంటగ్యాస్ గురించి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసింది. అవసరం లేకపోయినా ఆందోళనలతో బుక్ చేయవద్దని సూచించింది. దేశంలో గృహ అవసరాలకు తగిన వంట గ్యాస్ అందుబాటులో ఉందని వెల్లడించింది. ఉత్పత్తిని పెంచాలని కంపెనీలను కూడా ఆదేశించినట్లు తెలిపింది.





## టీమ్‌ఇండియాకు తిరుగులేదు



టీ20 క్రికెట్ చరిత్రలో ప్రస్తుత భారత జట్టే అత్యంత బలమైన జట్టని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అన్నాడు. భారత్ న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి టీ20 ప్రపంచకప్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా కూడా టీమ్‌ఇండియా ఘనత సాధించింది. గత కొన్నేళ్లలో పరిమిత ఓవర్ల క్రికెట్లో భారత్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. గత నాలుగు ఐసీసీ టోర్నీల్లో ఆ జట్టు రెండు సార్లు మాత్రమే ఓడిపోవడం గమనార్హం. ప్రస్తుత భారత జట్టే ఇప్పటివరకు టీ20 క్రికెట్లో అత్యంత బలమైన జట్టా అన్న ప్రశ్నకు పాంటింగ్ స్పందిస్తూ.. ''కాదు అని చెప్పడం చాలా కష్టం. ఒక్క టీ20 క్రికెట్లోనే కాదు.. మొత్తంగా పరిమిత ఓవర్ల క్రికెట్లో, గత అయిదారేళ్లుగా ఆ జట్టు అదరగొడుతోంది'' అని పాంటింగ్ చెప్పాడు. ''భారత జట్టు సామర్థ్యం, లోతును టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందే చాలా మంది గుర్తించి ఉంటారు. భారత్‌కు అనుభవమూ ఎక్కువే. ఈ భారత జట్టు కేవలం టీ20ల్లోనే కాదు.. వైట్‌బాల్ క్రికెట్లోనే బలమైంది. వాళ్లకు హ్యాట్సాఫ్'' అని అన్నాడు.

# అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేయడంపై సునీల్ గవాస్కర్ వ్యాఖ్యలు

ది హండ్రెడ్ లీగ్ కోసం సన్ రైజర్స్ లీడ్స్ జట్టు పాకిస్థాన్ ఆటగాడు అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేయడంపై



సునీల్ గవాస్కర్ స్పందించాడు. పాకిస్థాన్ క్రికెటర్లకు ఫీజు చెల్లించడమంటే భారతీయుల మరణానికి కంట్రిబ్యూట్ చేసినట్లేనని సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్‌కు చెందిన యాజమాన్యాలు కలిగిన జట్లు ఏవైనా నైతికంగా పాకిస్థాన్ క్రికెటర్లను దూరం ఉంచాల్సిందే అన్నాడు.పాకిస్థాన్ క్రికెటర్లను 2008లోనే ఐపీఎల్ నుంచి బహిష్కరించిన విషయాన్ని గవాస్కర్ గుర్తు చేశాడు. మన దేశానికి చెందిన క్రికెట్ ఫ్రాంఛైజీ ది హండ్రెడ్ లీగ్‌లో పాకిస్థాన్ క్రికెటర్‌ను తీసుకున్నదని, కానీ 2008లో ముంబై దాడులు జరిగినప్పటి నుంచి మనం పాకిస్థాన్ క్రికెటర్లను దూరం పెట్టామని గుర్తు చేశాడు. పాకిస్థాన్ క్రికెటర్లు తమకు ఐపీఎల్‌లో ఫీజు ద్వారా వచ్చిన మొత్తంలో ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లిస్తాడని, ఆ సొమ్ము అక్కడి ప్రభుత్వం ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాడు.ఆ ఆయుధాలను వారు మన దేశం పైనే ప్రయోగిస్తారని మండిపడ్డారు. అంటే పాకిస్థాన్ ఆటగాళ్లకు మన జట్టు యాజమాన్యాలు చెల్లించే ఫీజు భారత ప్రజలు, సైనికుల ప్రాణాలు తీయడానికి పరోక్షంగా కారణమవుతుందని అన్నాడు. ఎవరైనా పాకిస్థాన్ ఆటగాళ్లు, సినిమా తారలను పక్కన పెట్టాల్సిందేనని స్పష్టం చేశాడు. పాక్ క్రికెటర్లకు చెల్లించే సొమ్ము పరోక్షంగా మనవారి ప్రాణాలను తీయడానికి కారణమవుతోందని వ్యాఖ్యానించాడు. న్యూజిలాండ్‌కు చెందిన డానియల్ వెట్టోరికి ఈ విషయం అర్థం కాకపోవడం వల్ల పాకిస్థాన్ క్రికెటర్‌ను తీసుకుందామని భావించి ఉండవచ్చని, కానీ యాజమాన్యానికి అర్థం కావాలి కదా అని అభిప్రాయపడ్డాడు. భారతీయుల జీవితాల కంటే టోర్నీలో గెలవడం ముఖ్యమా అని ప్రశ్నించాడు.




# హిట్ మ్యాన్‌కు హార్దిక్ వార్నింగ్ ముంబై ఇండియన్స్ అదిరిపోయే రియాక్షన్!

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే ముంబై ఇండియన్స్ జట్టులో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. గత కొంతకాలంగా రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య మధ్య కోల్డ్ వార్ నడుస్తోందన్న ప్రచారానికి ఆజ్యం పోస్తూ ఒక క్రీడా ఖాతా సోషల్ మీడియా లో సంచలన పోస్ట్ చేసింది. రోహిత్ శర్మ బ్యాటింగ్ ప్రదర్శన ఆశాజనకంగా లేకపోతేతాను చూస్తూ ఊరుకోనని, కఠిన నిర్ణయాలు తీసుకుంటానని హార్దిక్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టం చేసినట్లు ఆ ట్వీట్ సారాంశం. ఈ వార్త నెట్టింట వైరల్ కావడంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.ఈ వివాదాస్పద పోస్ట్‌పై ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఎట్టకేలకు స్పందించింది. అయితే ఈ వార్తలను ఖండించడం కంటే, ఒక సెరికల్ ఎమోజీతో సమాధానమివ్వడం విశేషం. ''కు తోచింది ఏదైనా రాసుకోవచ్చు'' అనే అర్థం వచ్చేలా నవ్వుతున్న ఎమోజీని పోస్ట్ చేసి, ఆ వార్తల్లో నిజం లేదని పరోక్షంగా కొట్టిపారేసింది. మేనేజ్‌మెంట్ ఇచ్చిన ఈ రియాక్షన్‌తో ప్రస్తుతానికి ఆ రూమర్లకు చెక్ పడినట్లు అనిపించినా, అభిమానుల్లో మాత్రం అనుమానాలు అలాగే ఉండిపోయాయి.సోషల్ డియాలో వైరల్ అవుతున్న ఈ కథనాలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. క్లిక్ బేట్ కోసం, వ్యూస్ కోసం ఇలాంటి తప్పుడు వార్తలను సృష్టించడం ఈ రోజుల్లో సర్వసాధారణం అయిపోయిందని పలువురు కామెంట్ చేస్తున్నారు. రోహిత్, హార్దిక్ మధ్య విభేదాలు ఉన్నాయని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని, జట్టులో చీలిక తేవడమే ఇలాంటి పోస్టుల ప్రధాన ఉద్దేశమని నెటిజన్లు మండిపడుతున్నారు. బాధ్యత లేని క్రీడా పేజీలపై చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా, ఐపీఎల్ వేలం ముగిసినప్పటి నుండి ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ మార్పు అంశం హాట్ టాపిక్‌గానే ఉంది. రోహిత్ శర్మ అభిమానులు హార్దిక్ నాయకత్వాన్ని ఇంకా పూర్తిగా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాంటి తరుణంలో వచ్చే చిన్న వార్త అయినా సోషల్ డియాలో కార్చిచ్చులా వ్యాపిస్తోంది. మైదానంలో జట్టు ప్రదర్శన మెరుగ్గా ఉంటేనే ఇలాంటి వివాదాలకు తెరపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతవరకు ఈ ''కెప్టెన్సీ వార్'' రూమర్లు షికారు చేస్తూనే ఉంటాయి.

# పాకిస్థాన్ బ్యాటర్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు ముగింపు

పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ సర్ఫరాజ్ అహ్మద్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. సుమారు రెండు దశాబ్దాల పాటు సాగిన తన ప్రయాణానికి ఆదివారం వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 2017లో సర్ఫరాజ్ సారథ్యంలోనే పాకిస్థాన్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకోవడం విశేషం.37 ఏళ్ల సర్ఫరాజ్ పాకిస్థాన్ తరఫున 54 టెస్టులు, 117 వన్డేలు, 61 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 6,164 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు, 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. వికెట్ కీపర్‌గా 315 క్యాచ్‌లు, 56 స్టంపింగ్‌లతో సత్తా చాటాడు. జూనియర్, సీనియర్ స్థాయిలో ఐసీసీ టైటిల్లు గెలిపించిన ఏకైక కెప్టెన్‌గా సర్ఫరాజ్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. 2006లో అతడి నాయకత్వంలోని అండర్-19 జట్టు ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌ను ఓడించి టైటిల్ గెలిచింది.సర్ఫరాజ్ కెప్టెన్సీలో పాకిస్థాన్ జట్టు టీ20 ఫార్మాట్‌లో అగ్రస్థానానికి చేరడంతో




పాటు వరుసగా 11 సిరీస్‌లు గెలిచి ప్రపంచ రికార్డు సృష్టించింది. బాబర్ అజామ్, షహీన్ అఫ్రిది, హసన్ అలీ, ఫఖార్ జమాన్ వంటి స్టార్ ఆటగాళ్లు అతడి కెప్టెన్సీలోనే వెలుగులోకి వచ్చారు. ''పాకిస్థాన్ తరఫున ఆడటం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. జట్టును అన్ని ఫార్మాట్లలో నడిపించాలన్న నా కల నెరవేరింది. నా ఎదుగుదలకు సహకరించిన సహచరులకు, కోచ్‌లకు, అభిమానులకు కృతజ్ఞతలు'' అని సర్ఫరాజ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు.

# భారత్ మూడు టీ20 జట్లను ఆడించగలదు

దేశంలో చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారని, టీ20ల్లో భారత్ ఒకే సమయంలో రెండు లేదా మూడు జట్లను బరిలోకి దించగలదని టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. 2024లో సూర్య టీ20 జట్టు పగ్గాలు అందుకున్నాక... టీమ్‌ఇండియా 52 మ్యాచ్‌ల్లో 42 గెలిచింది. ఇది పొట్టి ఫార్మాట్లో భారత్ ఆధిపత్యానికి నిదర్శనం. ఈ నేపథ్యంలోనే సూర్య స్పందించాడు. ప్రస్తుత టీ20 జట్టు.. భారత అత్యుత్తమ టీ20 జట్టని ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ''క్రమం తప్పకుండా ప్రతిభావంతులు వస్తూనే ఉన్నారు. ఐపీఎల్ దేశవాళీ క్రికెట్ నుంచి ప్రతి ఏటా ఎంతో మంది ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. టీ20 క్రికెట్లో భారత్ ఎన్నంటే అన్ని జట్లను తయారు చేయొచ్చు. దేశంలో ప్రతిభావంతులకు లెక్కేలేదు. రెండు మూడు తుది జట్లను బరిలోకి దించవచ్చు. భారత క్రికెట్ మూలాలు బలంగా ఉన్నాయి.




నిజం చెప్పడానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదు'' అని సూర్య అన్నాడు. సమష్టి కృషి వల్లే టీ20ల్లో టీమ్ ఇండియా ఎక్కువ విజయాలు సాధిస్తోందని చెప్పాడు.

# బెంగళూరు పేస్ బౌలర్ యశ్ దయాళ్ ఓ ఇంటివాడయ్యాడు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేస్ బౌలర్ యశ్ దయాళ్ ఓ ఇంటివాడయ్యాడు. సోషల్ డియా కంటెంట్ క్రియేటర్ శ్వేత పుండిర్‌ను వివాహం చేసుకున్నాడు. గత నెలలోనే వీరి పెళ్లి జరిగినప్పటికీ, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, వీరి వివాహం ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగింది. ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఈ జంట తమ పెళ్లి విషయాన్ని సోషల్ డియాలో అధికారికంగా ప్రకటించలేదు. అయితే, దయాళ్ తో ఉన్న కొన్ని క్షణాలను శ్వేత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో రూపంలో పంచుకున్నారు. ఢిల్లీకి చెందిన శ్వేత పుండిర్ ఒక సోషల్ డియా ఇన్‌ఫ్లుయెన్సర్, వ్లాగర్‌గా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాలో 5.87 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా యశ్ దయాళ్ ఐపీఎల్‌లో మంచి పేరు తెచ్చుకున్నాడు. 2022లో గుజరాత్ టాన్స్ తరఫున ఆడి, ఆ జట్టు టైటిల్ గెలవడంలో భాగమయ్యాడు. ఆ తర్వాత 2024 సీజన్‌లో ఆర్సీబీకి మారాడు. గత ఏడాది ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడంలోనూ దయాళ్ కీలక పాత్ర పోషించాడు. మార్చి 28న ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఆర్సీబీ యాజమాన్యం అతడిని అట్టిపెట్టుకుంది. ఈ సీజన్‌లో టైటిల్ డిఫెండింగ్ లక్ష్యంతో బరిలోకి దిగుతున్న ఆర్సీబీకి దయాళ్ సేవలు కీలకం కానున్నాయి. మార్చి 28న చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆర్సీబీ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.



# వుదయం సినిమా

MOVIE TIME!

## ఆ తరహా సినిమా తీస్తా

ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్ లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను'' అని హరీశ్ చెప్పారు.





## కామెడీ ఎంటర్‌టైనర్ రాకాస

ఏప్రిల్ 3న రిలీజ్ కానున్న ఫ్యాన్సీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాకాస'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రారంభం నుంచి వైవిధ్యమైన కంటెంట్, ప్రమోషనల్ ప్లానింగ్‌తో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఈ సినిమా రిలీజ్‌కు ముందే జరిగిన థియేట్రికల్ బిజినెస్ డీల్ ఇందుకు ఉదాహరణ. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ సినిమా థియేట్రిల్ రైట్స్‌ను శ్రీ లక్ష్మి నరసింహ మూవీ మేకర్స్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నారు. దీంతో సినిమాపై ఉన్న ఎక్స్ పెక్టేషన్స్ ఏంటో తెలుస్తుంది. సినిమాకు థియేటర్స్ లో మంచి ఆదరణ దక్కుతుందని ట్రేడ్ సర్కిల్స్ భావిస్తున్నాయి.

## వనజీవి రామయ్య బయోపిక్





పద్మశ్రీ అవార్డు గ్రహీత, 'కోటి మొక్కల రామయ్య'గా ప్రసిద్ధి చెందిన వనజీవి దరిపల్లి రామయ్య జీవిత కథ వెండి తెరపైకి వచ్చింది. సమాజానికి పర్యావరణ సందేశాన్ని అందించిన ఈ మహనీయుడి జీవితం ఆధారంగా రూపొందిన 'వనజీవి రామయ్య' బయోపిక్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే గద్దర్ అవార్డుల్లో బెస్ట్ షార్ట్ ఫిలిమ్స్ విభాగంలో ఎంపికైంది. నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో నిదిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, భూషం రవీంద్రనాథ్, లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మించిన ఈ సినిమాకు బల్లేపల్లి మోహన్ సంగీతాన్ని అందించారు.

తాజాగా చిత్రయూనిట్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, టీజేఎస్ చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం, రాజకీయ విశ్లేషకులు వి. ప్రకాష్, తన్నేరు బాబు రావు, నాగ మహేష్, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు హాజరై చిత్రాన్ని అభినందించారు.

ఈ చిత్రాన్ని భారతీయ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, "కోటి మొక్కలు నాటి ప్రకృతికి సేవ చేసిన రామయ్య గారి జీవితం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. త్వరలోనే భారతీయ భాషల్లో కూడా ఈ బయోపిక్‌ను తీసుకురానున్నాం" అని తెలిపారు. సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ కూడా ఇదే భావనను వ్యక్తం చేస్తూ, ఈ చిత్రాన్ని ప్రకృతి ప్రేమికుడు రామయ్యకు నివాళిగా అంకితం చేస్తున్నామని చెప్పారు.

రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దరిపల్లి రామయ్య పర్యావరణ పరిరక్షణలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఊరూరా తిరిగిన ఆయన, శుభకార్యాల్లో మొక్కలను బహుమతులుగా ఇవ్వడం ద్వారా సరికొత్త ఆచారాన్ని నెలకొల్పారు. చెట్ల గింజలను సేకరించి అటవీ ప్రాంతాల్లో చల్లడం ఆయన నిత్యకృత్యంగా ఉండేది. ప్రకృతిని ప్రేమించిన ఆ మహానుభావుడు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకృతి ఒడిలో కలిసిపోయినప్పటికీ, ఆయన చూపించిన మార్గం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఈ బయోపిక్ ద్వారా ఆయన సేవలు, స్ఫూర్తి మరింత విస్తృతంగా ప్రజలకు చేరవ కానున్నాయి.

## సందడిగా యూత్ ప్రెషర్స్ మీట్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ 2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ప్రెషర్స్ మీట్ కార్యక్రమం పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ లో సందడిగా నిర్వహించారు.

## పోలీస్ కంప్లైంట్ టీజర్ విడుదల



సౌతిండియా ప్రేక్షకుల ముందుకు యాక్షన్, కామెడీ, హారర్ థ్రిల్లర్ కలగలిపిన సినిమాను తీసుకురాబోతున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'పోలీస్ కంప్లైంట్' కన్నడ వెర్షన్ టీజర్‌ను బెంగళూరులో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం చిత్రబృందం, అతిథుల సందడితో హర్షాతిరేకంగా జరిగింది. ఈ వేడుకకు 'దేవి' చిత్రం ద్వారా గుర్తింపు పొందిన నటి ప్రేమ, 'దండుపాళ్యం' ఫేమ్ పూజా గాంధీ, కన్నడ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఆర్.కె. విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు.

## ఆయన నుంచి చాలా నేర్చుకున్నా



పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఇష్టంగా వెయిట్ చేస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 19న థియేటర్స్‌లోకి అడుగుపెట్టనుంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించారు. ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమా విశేషాలు పంచుకుంది రాశీ ఖన్నా. 'నిజం చెప్పాలంటే, పవన్ కల్యాణ్ గారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఎంతో ఉత్సాహంతో ఓకే చెప్పేశా. నేను నా మొదటి సినిమా చేస్తున్నప్పటి నుంచే ఆయనతో కలిసి ఒక్క సినిమా అయినా చేయాలి అనుకున్నాను. 'ఉస్తాద్ భగత్ సింగ్'తో నా కల నెరవేరింది. ఈ సినిమాలో నా పాత్ర చాలా మోడ్రన్‌గా ఉంటుంది. నా పాత్రకు మంచి క్యారెక్టరైజేషన్ ఉంటుంది. నాకు ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి, ఆ సాంగ్ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. పవన్ చాలా సింపుల్ పర్సన్, ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలో ఒక తెలియని అమాయకత్వం ఉంది. తక్కువ మాట్లాడతారు.. కానీ, ప్రతి మాటలో విలువ ఉంటుంది. నాతో ప్రజా సేవ చేయమని చెప్పారు. పవన్ ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారు. ఆయన నుంచి మానవత్వం నేర్చుకున్నాను. ఉస్తాద్ వేడుకలో స్టేజ్ మీద నుంచి పవన్ అభిమానులను చూస్తుంటే, ఆయనను ఒక దేవుడిలా ఆరాధిస్తున్నట్లు అనిపించింది' అంటూ మరెన్నో విశేషాలు పంచుకుంది.

## పెళ్లి పీటలెక్కనున్న జేజమ్మ



అరుంధతి మూవీతో జేజమ్మగా ప్రేక్షకుల గుండెల్లో స్థానం దక్కించుకున్న బ్యూటీ అనుష్క శెట్టి. ఆ తర్వాత బాహుబలి మూవీతో పాన్ ఇండియాలో క్రేజ్ దక్కించుకుంది. ప్రభాస్ సరసన నటించిన ముద్దుగుమ్మ.. తనదైన నటనతో ఆకట్టుకుంది. అయితే అప్పుడప్పుడు వీరిద్దరిపై పెళ్లి రూమర్స్ కూడా వినిపిస్తూనే ఉన్నాయి. ఏదో ఒక సందర్భంలో అనుష్కతో ప్రభాస్ పెళ్లి అంటూ బోలెడు కథనాలొచ్చాయి. కానీ అవన్నీ రూమర్స్ గానే మిగిలిపోయాయి. తాజాగా ఈ స్వీటీ అనుష్క పెళ్లికి సంబంధించిన ఓ న్యూస్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ ముద్దుగుమ్మ ఓ బిజినెస్‌మెన్‌ను పెళ్లాడనుందని సమాచారం. ప్రస్తుతం నాలుగు పదుల వయసులో ఉన్న అనుష్క బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్తతో ఏడడుగులు వేయనుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఇది పెద్దలు కుదిర్చిన పెళ్లి అని.. ప్రస్తుతం పెళ్లికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలుస్తోంది. అబ్బాయి కన్నడ కుటుంబానికి చెందినవారని.. వీరిద్దరి వివాహ నిశ్చయానికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించినట్లు లేటెస్ట్ టాక్. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. రాబోయే రోజుల్లో అనుష్క పెళ్లిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే ఈ ఏడాది చివర్లో అనుష్క పెళ్లి పీటలెక్కే ఛాన్స్ ఉంది. ఇక సినిమాల విషయానికి వస్తే గతేడాది ఘాటీ మూవీతో అభిమానులను మెప్పించారు. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ప్రస్తుతం మలయాళంలో కథనార్ అనే భారీ బడ్జెట్ సినిమాలో అనుష్క నటిస్తున్నారు.

## అల్బుకర్ర్యా రికార్డ్స్‌తో యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా భాగస్వామ్యం



సంగీత ఆధారిత వినోద రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థ అయిన యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ కు చెందిన విభాగం యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా, ప్రముఖ గాయకుడుసంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఇటీవల ప్రారంభించిన స్వతంత్ర రికార్డ్ లేబుల్ అల్బుకర్ర్యా రికార్డ్స్ తో ప్రత్యేక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా మరియు అల్బుకర్కీ రికార్డ్స్, అనిరుధ్ రవిచందర్ రూపొందించిన భవిష్యత్ పాప్ మరియు హిప్‌హాప్ సంగీతాన్ని, అలాగే ఈ లేబుల్‌కు భవిష్యత్తులో చేరుతుంది ఇతర సంగీత కళాకారులు విడుదల చేయనున్నారు. ఈ లేబుల్ కింద విడుదలయ్యే తొలి సంగీత ప్రాజెక్ట్‌లో అనిరుధ్ పాల్గొనగా, అది ఏప్రిల్ ప్రారంభంలో విడుదల చేయాలని ప్రణాళిక రూపొందించబడింది. ఈ గ్లోబల్ భాగస్వామ్యం ద్వారా యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా మరియు అల్బుకర్కీ రికార్డ్స్ కలిసి పని చేస్తూ అనిరుధ్ రవిచందర్ కళాత్మక ప్రతిభ యొక్క ప్రభావాన్ని మరింత విస్తరించడానికి కృషి చేయనున్నాయి. కాలక్రమేణా ఈ లేబుల్ ప్రాంతంలోని ఎదుగుతున్న పాప్ మరియు హిప్‌హాప్ కళాకారులకు ఒక ముఖ్యమైన వేదికగా మారి, వారి సంగీత ప్రయాణానికి నిలయంగా నిలవనుంది.

## హ్యాపీ రాజ్ ఫస్ట్ సింగిల్ అద్దిరా లెక్క రిలీజ్




స్టార్ కంపోజర్‌హీరో జివి ప్రకాష్ కుమార్ అప్ కమింగ్ మూవీ 'హ్యాపీ రాజ్'. హీరో డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై జైవర్ధ నిర్మించారు. మ్యాడ్ ఫేం శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిచింది. మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పీ ద్వారా మార్చి 27న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సృష్టిస్తోంది, ఇటివల విడుదలైన పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ "అద్దిరా లెక్క" సాంగ్ రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరన్ అదిరిపోయే బీట్స్‌తో ఈ సాంగ్‌ని కంపోజ్ చేశారు. గాయకుడు గోవింద్ ప్రసాద్ ఎనర్జీతో పాడిన ఈ పాటకు రెహ్మాన్ రాసిన లిరిక్స్ మంచి వైబ్ తీసుకొచ్చాయి. ఈ సాంగ్‌లో జివి ప్రకాష్ కుమార్ చేసిన డ్యాన్స్ మూమెంట్స్ స్పెషల్ హైలైట్‌గా నిలిచాయి. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టెప్స్ అన్నీ కలిసి సాంగ్‌ను మరింత ఎంటర్టైనింగ్‌గా మార్చాయి.

## ది గర్ల్ ఫ్రెండ్‌కు మూడు ఉగాది పురస్కార అవార్డులు

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న నటించిన ది గర్ల్ ఫ్రెండ్ సినిమా వరుసగా అవార్డ్స్ సొంతం చేసుకుంటోంది. ఇటీవలే ఈ సినిమాకు ఉత్తమ నటిగా రశ్మిక గద్దర్ అవార్డ్ సొంతం చేసుకుంది. ఇక తాజాగా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఉగాది పురస్కారాల్లో ఈ సినిమాకు మూడు అవార్డ్స్ దక్కాయి. చెన్నైలో జరిగిన శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ 28వ ఉగాది పురస్కారాల్లో ఉత్తమ నటిగా రశ్మిక, ఉత్తమ విలన్ గా దీక్షిత్ శెట్టికి అవార్డ్స్ దక్కాయి. ఉత్తమ రచన, దర్శకత్వం విభాగంలో బాపు రమణల పురస్కారం దర్శకుడు రాహుల్ రవీంద్రన్ గెల్చుకున్నారు. దీక్షిత్ శెట్టి, రాహుల్ రవీంద్రన్ ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డ్స్ స్వీకరించారు.

"ది గర్ల్ ఫ్రెండ్" సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందించారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహించారు.




## ధురంధర్ 2 హవా

### విడుదలకు ముందే రూ.130 కోట్లు

బాక్సాఫీస్ వద్ద మరోసారి కలెక్షన్ల వర్షం సృష్టించేందుకు 'ధురంధర్ 2' సిద్ధమవుతోంది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ అడ్వాన్స్ బుకింగ్స్ లో రికార్డులు కొల్లగొడుతోంది. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం, కేవలం అడ్వాన్స్ సేల్స్ ద్వారానే వంద కోట్ల క్లబ్‌లో చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. పెయిడ్ ప్రివ్యూల్లోనే కోట్లు వసూలుచేస్తోంది. ఈ కలెక్షన్లు చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' ప్రభంజనం ఏ స్థాయిలో ఉండనుందో తెలుస్తోంది.

భారీ అంచనాల మధ్య ఉగాదికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రివ్యూలు ఉండనున్నాయి. దీంతో దీని టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు తెలుస్తోంది. ప్రివ్యూల ద్వారా రూ.40.54 కోట్లు, మొదటిరోజు అడ్వాన్స్ బుకింగ్‌స్‌లో రూ.29 కోట్లు వచ్చాయని సినీ వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు ఓవర్సీస్‌లో సుమారు రూ.60 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయని సమాచారం. దీంతో మొత్తంగా ఈ సినిమా విడుదలకు రెండు రోజుల ముందే రూ.130 కోట్లు తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.